ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 38 పేజీలు: 8+4 వెల: 6.50


4 రాష్ట్రాల ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ రెడీ

5లో

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ

# మీ భూమిపై మీకే హక్కు

## రైతులకిచ్చిన వాగ్దానం నెరవేర్చామన్న సిఎం చంద్రబాబు

రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీ

సీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం

డోన్‌లో రైతు సంక్షేమ కార్యక్రమంలో ముఖ్యమంత్రి



సోమవారం బురుజుగ్రామంలో రైతుకు పట్టాదారు పాస్ పుస్తకం అందచేస్తున్న సిఎం చంద్రబాబు

**డోన్, మార్చి 9 ప్రభాతవార్త :** ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఏవైతే హామీ ఇచ్చామో వాటిని తూచ తప్పకుండా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్త బురుజు గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు రాజా ముద్ర తో కూడిన నూతన పాస్ పుస్తకాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వల్ల రెవెన్యూ శాఖ అస్తవ్యస్థం చేసిందని గతంలో మంత్రిగా ఉన్న వ్యక్తి ఒక సాధన రైతుభూమిని తన అనుచరులు కట్టబెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వంలో 1.95 కోట్ల ఎకరాలను 22ఏలో పెట్టారు.

>>2



రైతు సంక్షేమ కార్యక్రమానికి హాజరైన ప్రజానీకం




సోమవారం పార్లమెంటు ముందు ధర్నా నిర్వహిస్తున్న విపక్ష ఎంపిలు

## లోక్‌సభను కుదిపిన

# 'పశ్చిమ'వార్

చర్చకు పట్టుపట్టిన విపక్షాలు

వెల్‌లోకి దూసుకుపోయి ఆందోళన

స్పీకర్ అభిశంసనపైనా చర్చకు పట్టు

స్తంభించిన కార్యకలాపాలు, సభ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ, మార్చి 9:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రెండో విడతగా సోమవారం నుంచి ప్రారంభం అయినా విపక్షాలు అడుగడుగునా అడ్డుతగిలాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, స్పీకర్‌పై అవిశ్వాసం వంటి అంశాలపై చర్చలుజరపాలని ఇండియా కూటమి ఇతర విపక్షాలు పట్టుబట్టాయి. స్పీకర్ ఓంబిర్లాను తొలగించాలంటూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చలకు ఎంపి మహ్మద్ జావేద్, కె.సురేష్, మల్లురవి వంటి వారితోపాటు మొత్తం 118 మంది విపక్ష సభ్యులు సంతకాలు చేసారు. వీటిపై చర్చకు లోక్‌సభ స్పీకర్‌స్థానంలో ఉన్న ప్యానెల్ స్పీకర్ అనుమతించకపోవడంతో విపక్ష సభ్యులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. దీనితో లోక్‌సభ కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదాపడ్డాయి. ఒక సిట్టింగ్‌ఎంపి, మరో నలుగురు మాజీ ఎంపిల మరణంపై సభ నివాళి అర్పించిన తర్వాత సభ వాయిదాపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో భారతీయులు చనిపోతున్న సం ఘటనలపై రాజ్యసభ సభ్యుడు విపక్షనేత మల్లిఖార్జున్‌ఖర్గే సభలో వివరణ

>>2

## కవిత, కేజ్రీవాల్ సహా 23 మందికి

# ఢిల్లీ హైకోర్టు నోటీసులు

లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం

సిబిఐ కోర్టు ఆదేశాలపై హైకోర్టు స్టే

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నింది తులుగా పేర్కొన్న తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కవిత, ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ సహా 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దీంతో పాటు ఇదే కేసులో నిందితులను నిర్దోషులుగా పేర్కొన్న సమయంలో గత నెల 27వ తేదీన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కేసును వి చారించిన సిబిఐపై చేసిన వ్యాఖ్యలపై హైకోర్టు స్టే ఇచ్చింది. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ వినతి మేరకు ఈ కేసు విచారణ ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు (సిబిఐ కోర్టు) నుంచి హైకోర్టుకు చేరింది. 2021లో అప్పటి ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ హయాంలో వెలుగు చూసిన ఈ స్కాంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని గవర్నర్ చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపిన సి బిఐ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో సిఎం అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా, నాటి బిఆర్‌ఎస్‌పార్టీ ఎంఎల్‌సి కవిత

>>2

## సునీల్ నాయక్ 12 దాకా విచారణకు హాజరు కావాలి

- హై కోర్టు

**గుంటూరు, మార్చి 9 ప్రభాత వార్త ప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ పిటిషన్ పై హైకోర్టులో సోమవారం విచారణ




జరిగింది. సునీల్ నాయక్‌కు ఇప్పటికే అరెస్టు చేసి బీహార్ కోర్టులో హాజరు పరిచినందున ముందస్తు బెయిల్ పిటీషన్ విచారణకు అర్హత లేదని ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాది హై కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు కేసును ఈ నెల 12వ తేదీకు

>>2

## ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు 16కు వాయిదా

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై జగన్ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు నమోదైంది. ఈ కేసును సీబీఐకు బదలాయించాలని మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసుని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం విచారణ చేసే అధికారం లేదంటూ ఎమ్మెల్యే ఎంపీ ప్రజాప్రతినిధుల కోర్టుకు ఈ కేసును బదిలీ చేయాలంటూ వేసిన మరో పిటిషన్‌పై కూడా విచారణ జరిగింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. సీఎం చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్‌గీ హాజరయ్యారు. ఈ కేసు విచారణలో తమకు ప్రాథమిక అభ్యంతరాలు ఉన్నాయని, విచారణ అర్హత మీద వాదనలు వినాలని న్యాయమూర్తిని సీనియర్ న్యాయవాది కోరారు. తమ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ముకుల్ రోహిత్‌గీ కోరారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్‌గీ అభ్యర్థన మేరకు 16వ

>>2



సోమవారం పెద్దవడ్లపూడి గ్రామంలో హైలెవెల్ కెనాల్ ఎత్తిపోతలను ప్రారంభించిన మంత్రి లోకేష్

## అన్ని వాగ్దానాలు

# నెరవేర్చుతాం

తాడేపల్లి రిటైనింగ్‌వాల్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

పెద్దవడ్లపూడి గ్రామంలో హైలెవెల్ కెనాల్ ఎత్తిపోతలను ప్రారంభించిన మంత్రి

**విజయవాడ, మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నేరవేర్చుతామని ఏపీ మానవవనరులశాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ప్రజలకు సమస్యలను, ఇబ్బందులను కలుగకుండా నియంత్రించే దిశలోనే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేసారు. తాడేపల్లి మహానాడు ప్రాంత ప్రజల దశాబ్దాలకలను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. తాడేపల్లి పట్టణం సీతానగరం మహానాడువద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. కృష్ణానదికి ప్రకాశం బ్యారేజీ దిగువన కుడి వైపు 0.900కి.మీ నుంచి 2.610కి.మీ వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 294.20కోట్లతో పనులు చేపట్టేందుకు రాష్ట్రమంత్రి మండలి ఇటీవల ఆమోదం తెలిపింది.

>>2

## మద్యం కుంభకోణం..

# రూ.95కోట్ల ఆస్తులు గుర్తింపు



వాసుదేవరెడ్డి, ఆయన భార్య, బంధువుల పేరుతో ఆస్తులు

మనీలాండరింగ్ గుట్టురట్టు చేసిన ఇడి

**విజయవాడ.మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కుట్రకు రూపకల్పనతోపాటు దాని అమలులో కీలకపాత్ర పోషించినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న ఏపీఎస్‌బిసిఎల్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆయన భార్య, బంధువుల పేరిట రూ.95.80 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమికంగా గుర్తించింది. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తుతో 2021- 2025 మధ్య ఈ ఆస్తులు కొన్నట్లు గుర్తించింది. తన బావమరిది మారెళ్ల విజయ నరసింహారెడ్డి పేరిట ఉన్న సంస్థల్లోకి లంచాల సొమ్మును మళ్లించుకుని ఆ సంస్థల ద్వారా ఆస్తులు కొనుగోలు చేయించి వాటిని తన భార్య పేరిట వాసుదేవరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిర్ధారించింది. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తును వాసుదేవరెడ్డి ఎలా మనీ లాండరింగ్ చేశారో ఈడీ దర్యాప్తులో వెలుగుచూసింది. మద్యం సరఫరా ఆర్డర్లు కావాలంటే వైఎస్సార్సీపీ మద్యం ముఠాకు లంచాలు చెల్లించాల్సిందేనంటూ డిస్టిలరీలు, సరఫరా కంపెనీలతో తొలుత బేరసారాలు నిర్వహించింది వాసుదేవరెడ్డేనని సిట్ విచారణలో గతంలోనే వెల్లడైంది. ఆ లంచాల్లో కొంత భాగం అతనికి చేరిందని ఈడీ తేల్చింది. బీ9 బెవరేజస్ లిమిటెడ్‌కు 2019 నవంబరు, డిసెంబరు, 2020 జనవరి నెలల్లో ఎస్‌బిసిఎలఖ మద్యం సరఫరా ఆర్డర్లే ఇవ్వలేదు. బీబీఎల్ క్లస్టర్ మేనేజర్ మహేష్‌రెడ్డిని వాసుదేవరెడ్డి పిలిపించి మద్యం సరఫరా ఆర్డర్లు కావాలంటే తనకు ఒక్కో కేసుకు 65 నుంచి 78 రూపాయల చొప్పున లంచమివ్వాలని డిమాండ్ చేశారని గుర్తించింది. అందుకు అంగీకరించడంతో ఆ సంస్థకు ఆర్డర్లు లభించాయని తేల్చింది. వాసుదేవరెడ్డి బావమరిది మారెళ్ల విజయనరసింహారెడ్డి నిర్వహణలోని రణదీప్ ఎంటర్‌ప్రైజస్, అసీఫా మార్కెటింగ్ సర్వీసెస్, వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజస్, వీఎన్‌ఆర్ గ్లోబల్ వంటి సంస్థలతో బీబీఎల్ మార్కెటింగ్, అడ్వర్టైజ్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థల ద్వారా ఎలాంటి సేవలూ పొందకుండానే పొందినట్లుగా చూపి వాసుదేవరెడ్డికి లంచంగా చెల్లించాల్సిన సొమ్మును బీబీఎల్ ఆయా సంస్థల ఖాతాల్లో జమ చేసినట్లు ఈడీ గుర్తించింది. బహుళ అంచెల్లో అవన్నీ వాసుదేవరెడ్డి భార్య పేరిట ఆస్తులుగా మారినట్లు తేలింది. పెరల్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వాసుదేవరెడ్డి రూ.20కోట్ల లంచం

>>2

## బహ్రెయిన్ చమురు

# స్థావరంపై ఇరాన్ దాడి

టెహ్రాన్ వీధుల్లో ఇజ్రాయెల్ భీకర దాడులు

ఇరాన్‌కు సంపూర్ణ మద్దతు: పుతిన్



**టెహ్రాన్‌జెరూసలెం, మార్చి 9:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దేశాలు జరుపుతున్న దాడులతో టెహ్రాన్ వీధులు అగ్నిగోళాల్లా మండిపోతున్నాయి. లెక్కకు మించిన బాంబులు, క్షిపణిదాడులతో రెండుదేశాలు ఇరాన్‌పై ముప్పేటదాడిచేస్తున్నాయి. అయితే ఇందులో ఇరాన్ కూడా తక్కువేమీ తినలేదు. గల్ఫ్‌దేశాల్లోని అమెరికా ఇజ్రాయెల్ స్థావరాలనే లక్ష్యంగాచేసుకుని దాడులుచేయడంతోపాటు, ఆదేశాల్లోని చమురునిల్వలపైనా దాడులుచేస్తుండటంతో ఇపుడు అమెరికాపై ఆదేశాలు ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నాయి. దాడులు కట్టడిచేయకుండా అమెరికా తాత్సారంచేస్తున్నదన్న భావన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా బహ్రెయిన్ ఆయిల్‌రిఫైనరీపై ఇరాన్‌దాడులుచేసింది. బాప్కో ఎనర్జీస్ అనే సంస్థపై ఇరాన్‌డ్రోన్‌దాడిచేయడంతో సంస్థ ధ్వంసం అయిందని కంపెనీ ప్రకటించింది. అలాగే ఇరాన్ క్షిపణి శకలాలు తగిలి ఇజ్రా యెల్‌లో ఒక భారత పౌరుడికి గాయాలయ్యాయి.అలాగే ఇపుడు డ్రోన్లు, క్షిపణిదాడులకు తోడు ఇపుడు ఇరాన్ సైబర్

>>2

## విద్యుత్ సరఫరాలో

# సమస్యలు లేవు..



వేసవి డిమాండ్‌కు తగిన కరెంటు సరఫరా: కె.విజయానంద్

**విజయవాడ, మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఈ ఏడాది మే నెలలో రాష్ట్రంలో దాదాపు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్‌కు చేరుకునే అవకాశం ఉంటుందని గౌరవ ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. సోమవారం సచివాలయం నుండి డిస్కాముల సిఎండీలతో పాటు ట్రాన్స్‌కో, జెన్కో అధికారులతో వర్చువల్‌గా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖచ్చితమైన విద్యుత్ అంచనాల ప్రకారం ఫిబ్రవరి , మార్చి , ఏప్రిల్, మేకు సంబంధించి విద్యుత్ డిమాండ్ అంచనా వేశామని, ఇందుకు సంబందించి డిస్కాముల సిఎండీలు సమగ్ర ప్రణాళికతో విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి విద్యుత్ ప్రణాళిక ప్రకారం అవసరమైన విద్యుత్ , డిమాండ్ అం చనాలు, విద్యుత్‌ఉత్పత్తి, అందుబాటులో ఉండే విద్యుత్, తదితర అంశాలను

>>2

# లోక్‌సభను కుదిపిన 'పశ్చిమ'వార్

>> ఇవ్వాలని పట్టుబట్టారు. విపక్ష సభ్యుల నినాదాలమధ్య విదేశాంగమంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించబోయారు. దౌత్యమార్గం, చర్చలద్వారానే పశ్చిమాసియా ఉద్రిక్తతలకు పరిష్కారం అని కేంద్రమంత్రి వెల్లడించారు. గతనెల 20వ తేదీనే ప్రభుత్వం ప్రకటించిందని అన్నివర్గాలు సంయమనం పాటించాలనికోరినట్లు తెలిపారు. గల్ఫ్‌దేశాల్లో క్లిష్టపరిస్థితుల్లో ఉన్న భారతీయులను తరలిస్తున్నామని, ఇప్పటివరకూ 67 వేల మందిని తరలించినట్లు విదేశాంగమంత్రి జైశంకర్ వెల్లడించారు. అయితే సభలోనే ఉన్న విపక్ష సభ్యులు జైశంకర్ ప్రకటనతో శాంతించలేదు. పశ్చిమాసియా వివాదంపై కేంద్రంప్రకటన సంపూర్ణంగా లేదంటూ విపక్షం మొత్తం వాకౌట్ చేసింది. విపక్ష సభ్యులు వాకౌట్‌చేయడంపై రాజ్యసభలో అధికారపక్ష నేత జెపినడ్డా విపక్ష నేతల వైఖరి బాధ్యతా రాహిత్యంగా ఉందని దుయ్యబట్టారు. అలాగే స్పీకర్ ఓంబిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానంపై పదిగంటలు చర్చజరపాలని కోరారు. ఈ చర్చను మంగళవారం నుంచి ప్రారంభిస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఈ చర్చను ప్రారంభిస్తారు. రెండురోజులపాటు ఈ చర్చ జరుగుతుంది. రోజుకు ఐదు గంటలపాటు చర్చకు కేటాయించారు. తొలుత స్పీకర్ విపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసులు తిరస్కరించడంతో ప్రతిపక్ష ఎంపిలు తీవ్ర నిరసన వ్యక్తంచేసారు. మజ్లిస్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ స్పీకర్ పాల్‌లమధ్య తీవ్ర వాగ్వాదం అనంతరం వీటిని తిరస్కరించారు. సభా కార్యకలాపాలకు విపక్షం అడుగడుగునా అంతరాయాలు కలిగించడంతో పార్లమెంటు ఉభయ సభలు వాయిదాపడ్డాయి.

**పార్లమెంటు హౌస్‌లో విపక్ష ఎంపిల నిరసన:** పార్లమెంటు కాంప్లెక్స్‌లో సోమవారం విపక్ష ఎంపిలందరూ నిరసన ప్రదర్శననిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే, పార్టీ మాజీ చీఫ్ రాహుల్‌గాంధీ, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌లు పార్లమెంటు హౌస్‌కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. పశ్చిమాసియా వివాదాలపై చర్చజరగాలని, ప్రభుత్వం తన వైఖరిపై ఎందుకు మౌనం వహిస్తోందని వారు ధ్వజమెత్తారు. ఖర్గేఛాంబర్‌లో విపక్ష ఎంపిలందరూ కూడా భేటీ అయ్యారు. బడ్జెట్ సమావేశాల రెండోదశలో చేపట్టాల్సిన చర్చపై వారంతా భేటీ అయ్యారు. ఖర్గే, గాంధీ, సమాజ్‌వాదిపార్టీ రామ్‌గోపాల్‌యాదవ్, డిఎంకె దయానిధి మారన్, ఎన్సీపీ సుప్రియా సూలే, శివసేన యుబిటి సంజయ్‌రౌత్ వంటి నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. విదేశాంగ మంత్రి ప్రకటన ఒక్కటే సరిపోదని సమగ్ర చర్చ జరగాల్సిందేనని ఎంపిలు పట్టుబట్టడంతో సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగింది. తర్వాత ఎంపిలందరూ కలిసి పార్లమెంటు మకరద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. గల్ఫ్ తగులబడిపోతోంది, చమురుషాక్ ఇస్తోంది, భారతీయులు నిలిచిపోయారు. భారత్‌కు నాయకత్వం అవసరం మౌనం కాదు అంటూ ఎంపిలు నినాదాలు చేసారు. ఖర్గే గాంధీ, అఖిలేష్ యాదవ్, టిఎంసి సాగరికా ఘోష్ వంటివారు ఈ నిరసనలో నినాదాలు చేసారు.



సోమవారం పార్లమెంటు ముందు నిరసనలో పాల్గొన్న అఖిలేష్ యాదవ్, రాహుల్, ఖర్గే తదితరులు

## 12 దాకా విచారణకు హాజరు కావాలి

>> వాయిదా వేసింది. అప్ప టివరకు దర్యాప్తు అధికారుల ఆదేశాల మేరకు విచారణకు హాజరు కావాలని తెలిపింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు గత ఐదు రోజులుగా సాగుతున్న సునీల్ నాయక్ విచారణ సోమవారంతో ముగిసింది. కానీ దర్యాప్తు అధికారి విజ్ఞప్తి మేరకు సునీల్ విచారణను 12 వ తేదీ వరకు హైకోర్టు పొడిగించింది. **సి ఐ డి కార్యాలయంలో సీన్ రీ క్రియేషన్:** రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ఐదో రోజు విచారణ ముగిసింది. గుంటూరులోని సీసీఎస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దాదాపు ఏడు గంటల పాటు విచారణాధికారి దామోదర్ సునీల్ నాయక్ ను విచారించారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి సునీల్ నాయక్ ను తీసుకుని వెళ్లి సీన్ రీక్రియేషన్ చేశారు. ఇందులో భాగంగా రఘురామకు కస్టోడియల్ టార్చర్ జరిగిన రోజున సునీల్ నాయక్ ఉన్న గదికి తీసుకుని వెళ్లారు. అక్కడ దాదాపు పావు గంట పాటు విచారించిన అనంతరం తిరిగి సీసీఎస్ స్టేషన్‌కు తరలించారు. సునీల్ నాయక్ విచారణ తర్వాత దర్యాప్తు బృందం తీసుకునే తదుపరి చర్యల పై తీవ్ర చర్చ జరుగుతోంది.

## సిలిండర్ బుకింగ్‌కు గడువు ఇక 25 రోజులు

**ముంబయి, మార్చి 9:** గ్యాస్ వినియోగదారులకు కంపెనీలు షాక్ ఇచ్చాయి. గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లో చిన్న మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఒక సిలిండర్ తీసుకున్న 15 రోజుల తర్వాతే రెండోది బుక్ చేసుకునే అవకాశం ఉండేది. కానీ, ఇప్పుడు ఆ సమయాన్ని 25 రోజులకు పెంచారు. అంటే.. ఒక సిలిండర్ డెలివరీ అయిన తర్వాత, రెండోది రావాలంటే కనీసం 25 రోజుల గ్యాప్ ఉండాలి. దీని కోసం గ్యాస్ ఏజెన్సీల సాఫ్ట్‌వేర్‌ను కూడా అప్‌డేట్ చేశారు. ఒక సంవత్సరంలో (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు) ఒక్కో కనెక్షన్‌పై మొత్తం 15 సిలిండర్లు మాత్రమే తీసుకోవచ్చు. ఇందులో 12 సిలిండర్లు సబ్సిడీతో వస్తాయి. మిగిలిన 3సిలిండర్లకు సబ్సిడీ ఉండదు. బుకింగ్ చేసిన 24గంటల లోపే సిలిండర్ డెలివరీ చేయాలని కంపెనీలు ఆదేశించాయి. దీని వల్ల వినియోగదారులకు చాలా సౌకర్యంగా ఉంటుంది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు కస్టమర్లు కంగారుపడాల్సిన అవసరంలేదని అధికారులు చెప్పారు.



తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేష్

## అన్ని వాగ్దానాలు నెరవేర్చుతాం

>> ఈ క్రమంలో ఆ వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది.

**రూ.14.88 కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవల్ కెనాల్:** పెద్దవడ్లపూడి గ్రామంలో హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. తొలుత పెదవడ్లపూడి గ్రామానికి చేరుకున్న మంత్రికి స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రూ.14.88 కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి పంపుల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ పథకం ద్వారా మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని 25,344 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంపులను అమర్చారు. ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయించారు.

**రూ. 65 లక్షల సీఎస్ఆర్ నిధులు**

నులకపేటలో కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహకారంతో రూ. 65 లక్షల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టే అభివృద్ధి చేస్తున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలంతా సంతోషిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మరుగున పడ్డ సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలగిస్తుందని ప్రజలు చెబుతున్నారు.

## రూ.95కోట్ల ఆస్తులు గుర్తింపు

>> నేరుగా తీసుకున్నారని ఈడీ గుర్తించింది. ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరా చేసే రవాణా కాంట్రాక్టును సిగ్మా సంస్థకు కట్టబెట్టడంలో వాసుదేవరెడ్డిదే కీలక పాత్ర అని తేల్చింది. మద్యం కుంభకోణం నిందితుడు ఈశ్వర్ కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి ఈ అక్రమానికి తెరలేపినట్లు గుర్తించింది. రవాణా ఛార్జీలను భారీగా పెంచేసి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని తద్వారా వారు అనుచిత లబ్ధి పొందినట్లు తేల్చింది. విజయనరసింహారెడ్డిని ముందుపెట్టి మద్యం రవాణాలోనూ అవినీతికి పాల్పడినట్లు గుర్తించింది. మద్యం కుంభకోణంలో దోచుకున్న సొమ్ములను వాసుదేవరెడ్డి ఆయన భార్య కల్పనారెడ్డి, బావమరిది విజయనరసింహారెడ్డి, మామ మారెళ్ల పుల్లారెడ్డి, వారికి చెందిన వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్, వీఎన్ఆర్ గ్లోబల్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి మిల్క్ చిల్లింగ్ పాయింట్ తదితర సంస్థలకు మళ్లించారని ఈడీ తేల్చింది. ఆ సొత్తుతో ఆ సంస్థలు స్థిరాస్తులు, భూములు కొన్నట్లు ఈడీ గుర్తించింది. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ 95.80 కోట్ల రూపాయలని తేల్చింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరంలోని 49.05 కోట్ల విలువైన 34 ఎకరాల వ్యవసాయ భూమిని మారెళ్ల పుల్లారెడ్డి, విజయనరసింహారెడ్డిలు వాసుదేవరెడ్డి భార్య కల్పనారెడ్డి పేరిట 2022లో గిఫ్ట్ డీడ్ చేసినట్లు ఈడీ గుర్తించింది. వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌లో కల్పనారెడ్డి, విజయనరసింహారెడ్డి భాగస్వాములు. మద్యం కుంభకోణంలో దోచుకున్న సొత్తులో కొంత వాసుదేవరెడ్డి ఆ సంస్థలోకి మళ్లించారని ఈడీ గుర్తించింది. ఆ డబ్బుతో ఆ సంస్థ 2023 డిసెంబరు, 2024 మార్చి నెలల్లో తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో రూ.34.33 కోట్ల విలువైన స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు తేల్చింది. హైదరాబాద్‌లోని గండిపేట వెన్నా బ్రీజ్‌లో కోటి రూ.40 లక్షలు విలువైన ఓ విల్లాను వీఎన్ఆర్ డెయిరీ కొనుగోలు చేసింది. దాన్ని కల్పనారెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అన్నింటిని ఈడి విచారించి ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆస్తులు గుర్తించింది.

## మీ భూమిపై మీకే హక్కు

>> ప్రైవేట్ భూమని ఇష్టానుసారంగా చేశారు అడిగిన భూమి ఇవ్వకపోతే వాటిని 22 ఏ లో పెట్టేసేలా గత ప్రభుత్వ వివరించిందని దీనిని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని తీసివేసే బాధ్యత తీసుకుంటానని చెప్పిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేసి రైతుల కోసం మీ భూమి మీ హక్కు అంటూ రాజు ముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఏర్పాటు చేసి జరిగిందన్నారు అప్పీల్ కు వెళ్లడానికి కూడా వీలు లేకుండా చేయాలని గత ప్రభుత్వం చూశారని విమర్శించారు. ఇదే జిల్లాలో పాణ్యం నియోజకవర్గంలో పట్టాదార పాస్ పుస్తకాన్ని కాల్చి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని అధికారంలోకి రాగానే రద్దు చేశారని మీ రికార్డులలో తప్పులను సరిదిద్దుతున్నామని ప్రజలకు వివరించారు వారసత్వంగా వచ్చిన భూములు సొంత శ్రమతో కొనుగోలు చేసిన భూములకు చెందిన పుస్తకాలపై ఫోటోలు వేసుకొని ఫోటోలు పిచ్చితో జీవితాలతో ఆడుకునే పరిస్థితి గత ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సర్వే రాళ్లపైన ఫోటోలు ముద్రించుకున్నారని దాదాపు 750 కోట్ల ఫోటోలు ఖర్చు చేశారని విమర్శించారు. నేను ఎక్కడికి వెళ్ళినా భూ సమస్యలపై కట్టలు కట్టలు అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు వాళ్లు చేసిన ఒక దుర్మార్గమైన పనిని సరిదిద్దడానికి దాదాపు 20 నెలలు పట్టిందని తెలిపారు రైతుల సమక్షంలోనే మీ భూమి కొలతలు తీసుకునే రైతులు ఆమోదంతో మీ భూమి వివరాలుతో పుస్తకాలు ఇస్తు న్నాం. భూ రికార్డులు తార్మర్ చేయకుండా పక్కగా పట్టాయిస్తున్నామని క్యూ ఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చామని ఎవరు రికార్డులు తార్ మార్ చేసిన తెలిసిపోతుందని తెలిపారు ఎమ్మార్వోలు విఆర్వోలు తప్పు చేసిన బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా తెలిసిపోతుందని నేను ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను ట్యాంపర్ చేయలేరన్నారు. రూపాయి అవినీతి లేకుండా కొత్త పటాదారు పాసుపుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. ఎవ్వరు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత నాదే అని చెప్పుకొచ్చారు. 16,816 గ్రామాలు ఉన్నాయి. అందులో 6,860 గ్రామంలో సర్వే గత ప్రభుత్వంలో చేశారని తప్పులు తొడగల్లో 19.93 లక్షల పుస్తకాలు ఇచ్చారని రికార్డులు తారుమారు చేసి ఇచ్చారని విమర్శించారు అవన్నీ పక్కన పెట్టేసి బల్లి కొత్త రైతులకు పుస్తకాల అందిస్తున్నామని పేర్కొన్నారు గత పాలకులు చేసిన తప్పును సరిదిద్దుతూ ప్రభుత్వమే ఉచితంగా పట్టాలిస్తుందని రిజిస్ట్రేషన్ విధానం కూడా సులభతరం చేస్తున్నామని గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శించారు మూడు పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేశామని రాష్ట్రానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తా మొన్న మాటలు నమ్మి అధికారం ఇచ్చారని నంద్యాల జిల్లాలో పార్లమెంట్‌తో సహా 8 మందిని గెలిపించారన్నారు సీమలో ఏడు సీట్లు తప్ప అన్నింటి కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నామన్నారు. ప్రజాహిత కోసం కూటం ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు గత ప్రభుత్వంలో అన్ని కుంభకోణాల వివాదాలు ఎక్కువ పేదల ఆరోగ్యం కంటే వారికి డబ్బులే ముఖ్యమని అన్నారు. 30 వేల మంది కల్తి మద్యం తాగి గత ప్రభుత్వంలో చనిపోయారని విమర్శించారు. ఎక్సైజ్ శాఖలో నెలకు 100కోట్లు అవినీతి చేశారని గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రజల జీవితాలు ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని తెలిపారు. తిరుమల లడ్డులో వాడే నెయ్యిని కూడా కల్తీ చేశారని విమర్శించారు సీమల ముఠా నాయకులూ ఉండే వారని ఎన్నికల సమయంలో డబ్బులు కంటే బాంబులు అడిగే పరిస్థితి ఉండేదని ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్భాగ్యాలు ఉండకూడదని ఈ ప్రాంతంలో ముఠా తగాదాలను తుదిముట్టించామన్నారు. డోన్ నియోజకవర్గంలో 30 చెరువులకు హంద్రీవా ద్వారా నీళ్లు ఇచ్చామన్నారు. హంద్రీనివాను నగరి గాలేరు ఎస్సార్‌బీసీ తెలుగు గంగకు ఎన్టీఆర్ శ్రీకారం చుడితే వీటిని పూర్తి చేసి అదృష్టం నాకు దక్కింది భగీరథుని స్ఫూర్తితో సీమలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలనేదే నా సంకల్పం అని పేర్కొన్నారు. అన్ని రిజర్వాయర్లకు నీరు ఉండాలని పొలాలన్నీ పచ్చగా ఉండాలి సీమను ఉద్యానవనంగా తయారు చేస్తానని హామీ ఇచ్చారు రాయలసీమ ఉత్పత్తులను దేశ స్థాయికి పంపి మెరుగైన వెరైటీస్ ఇక్కడికి తీసుకొస్తామని ప్రజలకు సూచించారు అదేవిధంగా కొత్త బురుజు గ్రామంలో ఎటువంటి చిన్న సమస్య రాకుండా రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమార్ గనియాకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్ బీసీ జనార్ధన్ రెడ్డి ఎన్ఎండి ఫరుక్ ఎమ్మెల్యే కోట్ల జై సూర్య ప్రకాష్ రెడ్డి జిల్లా ఇన్చార్జి గౌరీ చరిత మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో సమస్యలు లేవు..

>> ఈ సందర్భంగా ఆయన సమీక్షి ంచారు. ఏ పీ జెన్కో ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న ఉత్పత్తిని గరిష్టంగా వినియోగించాలని , 247 నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సగటున 264.65 లీగ్ రోజుకు గ్రిడ్ డిమాండ్ ను అందుకుంటోందని , గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 9.15 వృద్ధి నమోదు చేసినట్లు కె విజయానంద్ తెలిపారు. ఏ పీ విభజన తర్వాత అత్యధిక వినియోగాన్ని ఈ నెల 7న 274.6 ఎమ్ యు ,14,011 ఎం యూ పీక్ డిమాండ్ కు చేరుకొని ఆల్ టైం రికార్డు నమోదయిందని తెలిపారు. గత నెల చివరి 10 రోజుల్లో అకస్మాత్తుగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో అదనపు విద్యుత్ అవసరమయ్యిందని ,మార్చి, ఏప్రిల్ 2026లో పీక్ డిమాండ్ 14,500 ఎం యూ కి, కనిష్ట డిమాండ్ సుమారు 9,000 ఎం యూ కి చేరే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా విద్యుత్ సంస్థలు విద్యుత్ సరఫరా కు అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. థర్మల్, పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిని నిరంతరంగా పర్యవేక్షించాలని , డామ్ మార్కెట్, ఆర్టీమ్ నుండి విద్యుత్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన,నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కె విజయానంద్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీఎల్సి సీఎం డి ఎల్. శివశంకర్, ఏపీ ఈ డి ఎల్ సి సిఎండి ఐ. పృథ్వీ తేజ్,ఇన్‌చార్జి పి.పుల్లారెడ్డి, ఏ పీ ట్రాన్స్కో డైరెక్టర్ గ్రిడ్ ఎ.కె.వి. భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

## 16కు వాయిదా

>>తేదీన వాదనలు వింటామని హైకోర్టు ప్రకటించింది. ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన అన్ని కేసులను 16వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.

### వారం - వర్జ్యం

10-03-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
సప్తమి రా.1.54
అనూరాధ రా.7.05
వర్జ్యం : రా.1.21-3.09
దు.ఉ.8.43-9.31, రా.11.04-11.52
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు వద్దు.

**వృషభం:** సరియైన సలహాదారులు నమ్మకస్తులైన సేవకాజనం లోపించడం ఒక్కటే తీరని సమస్యగా ఉంటుంది.

**మిథునం:** వ్యాపార విస్తరణకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు ఆలస్యం అవుతాయి. ఆత్మ విశ్వాసం మరింత పెరుగుతుంది.

**కర్కాటకం:** అందరినీ కలుసుకుని సమిష్టి ప్రయోజనాల కొరకు మీరు చేసే యత్నాలు ఫలిస్తాయి. మీకంటూ ప్రత్యేకమైన నష్టమేమీ లేదు.

**సింహం:** కొన్ని సందర్భాలలో దైవానుగ్రహం మీకు తోడుఉందని ఋజువు చేసే సంఘటనలు జరుగుతాయి.

**కన్య :** జీవితభాగస్వామి నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. నూతన పెట్టుబడులు అనుకూలంగా ఉంటుంది.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అంతగా ప్రభావం చూపవు. కొన్ని అవకాశాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం మీ తెలివి తేటలకు ఆశ్చర్యపోతారు. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందు కుంటారు. వస్త్రలాభం.

**ధనుస్సు:** ఉద్యోగులు ఇంక్రిమెంట్లు, హోదాలు పొందుతారు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మకరం:** నూతన ఉద్యోగానికై చేసే దరఖాస్తులు, సంప్రదింపులు, పర్యాటనలు లాభిస్తాయి. కుటుంబ సభ్యులను కలుసుకుంటారు.

**కుంభం:** అతి కష్టంమీద చేపట్టిన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. శుభకార్య ప్రయత్నాలు సానుకూలపడతాయి.

**మీనం :** ఆస్తి తాలూకూ వివాదాలను సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేసుకోవడమే మంచిదని భావిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఢిల్లీ హైకోర్టు నోటీసులు

>> సహా 23 మంది నిందితులుగా వుండడం విదితమే. వీరందరిని సిబిఐ అధికారులు దశల వారిగా అరెస్టు చేసి తీహార్ జైల్లో నిర్బంధించడం అప్పట్లో సంచలనం రేపింది. నిందితులంతా ఐదు నెలల నుంచి ఏడాదిన్నర వరకు జైల్లో వుండాల్సి వచ్చింది. ఈ కేసు విచారణ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో జరిగింది. దాదాపు ఐదేళ్ల పాటు సాగిన ఈ విచారణపై రౌస్ అవెన్యూ కోర్టు గత నెల 27వ తేదీన తీర్పు ఇస్తూ నిందితులందరిని నిర్దోషులుగా పేర్కొంది. దీంతో ఈ కేసులో రాజకీయంగా తీవ్రంగా ఇబ్బందులు పడ్డ కేజ్రీవాల్, కవిత సహా మిగతావారికి పెద్ద ఊరట దక్కింది. లిక్కర్ స్కాంపై తీర్పు ఇచ్చిన రౌస్ అవెన్యూ కోర్టు ఇదే సమయంలో ఈ కేసును విచారించిన సిబిఐపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే సిబిఐ 23 మందిని దోషులుగా చెప్పడం ఏమిటనీ...? ప్రశ్నించింది. ఇది సరైన చర్యకాదని వ్యాఖ్యానించింది. సిబిఐ అధికా రులు ముందు వెనుకా చూడకుండా వ్యవహరించారని సిబిఐ కోర్టు తప్పు పట్టింది. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై కేజ్రీవాల్, కవిత తదితరులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు బిజెపిపై తీవ్రంగా మండిపడ్డారు. అయితే రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును అదే రోజున సిబిఐ అధికారులు ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై ఢిల్లీ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు కవి త, కేజ్రీవాల్ సహా 23 మందికి నోటీసులు జారీ చేసి వివరణ కోరింది. విచారణ సందర్భంగా సిబిఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ సంస్థ సిబిఐతో పాటు విచారణ అధికారులపై రౌస్ అవెన్యూ కోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వున్నాయని ఆయన వాదించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు లిక్కర్ స్కాం కేసులో సిబిఐతో పాటు దర్యాప్తు అధికారులపై రౌస్ అవెన్యూ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు సిబిఐ కేసులో నిందితులు విడులయ్యారు కాబట్టి ఈడీ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసు విచారణను నిలిపివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరగా హైకోర్టు భిన్నంగా స్పందించింది సిబిఐ రివిజన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు మనీలాండరింగ్ కేసు విచారణ వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.



## బహ్రెయిన్ చమురు స్థావరంపై ఇరాన్ దాడి

>> దాడులకు ఉపక్రమించింది. ఇరాన్ హ్యాకర్లు విజయవంతంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. 60కిపైగా టెలిగ్రామ్‌ద్వారా ఎలక్ట్రానిక్ ఆపరేషన్స్ రూమ్ ఏర్పాటుచేసిమరీ అమెరికా నిఘా వర్గాలపై దాడులుచేస్తుండటాన్ని అమెరికా సైతం గుర్తించింది. అమెరికాలోని 40వేలకుపైగా పారిశ్రామిక నియంత్రణ వ్యవస్థలను వీరు హ్యాక్‌చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఇరాన్ కొత్త లీడర్ మొజ్తబా ఖమేనీ**

ఇదిలా ఉండగా ఇరాన్ కొత్త సుప్రీం కమాండర్‌గా దివంగత ఖమైనీ తనయుడు మొజ్తాబా ఖమైనీ ఎంపికయ్యారు. ఇరాన్ ముగ్గురు సభ్యుల మండలి మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తమ కొత్త సుప్రీం కమాండర్‌పై దాడిచేసారన్నది అవాస్తవమని ఆయన సురక్షితంగా ఉన్నట్లు ప్రకటించారు. అలాగే విదేశాల్లో ఉంటున్న ఇరానీయులు అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతుప్రకటనలిస్తే ఇరాన్‌లోని వారి ఆస్తులను సీజ్‌చేస్తామని ఇరాన్ ప్రభుత్వం హెచ్చరించింది. ఇదిలా ఉంటే ఇరాన్‌పై యుద్ధం ముగించడంపై ఇజ్రాయెల్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధ్యక్షుడు ట్రంప్‌ప్రకటించడం చూస్తుంటే అమెరికన్లలో కూడా అసహనం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా నిలుస్తుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ ప్రకటించారు. కొత్తసుప్రీం కమాండర్ మొజ్తబా ఖమైనీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**లెబనాన్‌పై దాడులు మరింత ఉధృతం**

ఇదిలా ఉంటే లెబనాన్‌లోని హెజ్బొల్లాగ్రూప్‌ను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఇజ్రాయెల్ దాడులుచేస్తోంది అంతేకాకుండా యుద్ధనిబంధనలను అతిక్రమించి ముందు వైట్‌ఫాస్ఫరస్ పౌడరు చల్లి తద్వారా పేలుస్తుండటంతో మారణహోం జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిటీ ఆరోపించింది. ఈ దాడుల్లో ఇప్పటివరకూ 400 మందికిపైగా లెబనాన్ పౌరులు మరణించారని ప్రకటించింది. లెబనీస్ పట్టణం యోమోర్‌పై జరిగిన దాడిలో ఇళ్లపై వైట్‌ఫాస్ఫరస్ చల్లి తర్వాత పేలుడు చేయడంతో అన్ని ఇళ్లు మంటల్లో చిక్కుకున్నాయని ఫైర్ అధికారులు సకాలంలో స్పందించడంతో పెద్దముప్పు తప్పిందని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల సంఘం వెల్లడించింది.

## మీ విజయం దేశానికి గర్వకారణం: సీఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** టీ20 ప్రపంచ కప్ గెలుచుకున్న భారత్ క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ విజయంతో ఇప్పటివరకూ ఈ ట్రోఫీని మూడుసార్లు గెలిచిన తొలి దేశంగా భారత్ నిలవటం గర్వకారణమని ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మన జట్టు సాధించిన ఈ విజయం క్రీడాభిమానులకు ఎంతో సంతోషాన్ని కలిగించింది అన్నారు. భారత్ క్రికెట్ జట్టుకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.

భారత్ క్రికెట్ జట్టుకు ఇది నిజంగా అద్భుతమైన క్షణం. అహ్మదాబాద్‌లో ఉత్సాహంతో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య భారత్ జట్టు ప్రపంచ కప్ కైవసం చేసుకున్న సందర్భాన్ని ప్రత్యక్షంగా చూడటం ఎంతో ఆనందంగా ఉంది అని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్, ఆర్సెలార్ మిత్తల్ ఎండీ ఆదిత్య మిత్తల్‌లను కలిసినట్లు లోకేశ్ వివరించారు.

## విజయ బ్రాండ్‌ను దెబ్బతీస్తున్న ఏపి

### తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** విజయ బ్రాండ్‌ను ఏపి ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆ డెయిరి తెలంగాణ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మండి పడ్డారు. ఏపి ఫెడరేషన్ ఫ్రాంచైజ్ పంపిణీచేస్తోన్న నెయ్యి వెజిటెబుల్ ఆయిల్ అని స్పష్టం చేశారు. ఏపి ఫెడరేషన్ తెస్తున్న నెయ్యిని ఎన్‌డిడిబికి పంపి తాము టెస్టు చేయించామని, కల్తీ జరిగినట్టు రిపోర్టులో వచ్చిందని సంచనల అంశాలను బయటపెట్టారు. ఈ అంశంపై ఏపి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతోమాట్లాడారు. రాష్ట్ర పునర్విభజన అనంతరం తెలంగాణ విజయ డెయిరి పూర్తిగా సహకారరంగంలో పనిచేస్తూ రైతుల నుండి పాలను సేకరించి నెయ్యితోపాటు నాణ్యమైన పాలఉత్పత్తులను రాష్ట్ర ప్రజలకు విక్రయిస్తోందన్నారు. అయితే ఏపి ఫెడరేషన్‌మాత్రం పేరుకే విజయ డెయిరి బ్రాండ్ కింద ఉందని, మ్యాక్స్ చట్టం కింద అక్కడి డెయిరి జిల్లా ఫెడరేషన్‌లుగా విడిపోయిందన్నారు. అలా ఏపిలోవిజయ బ్రాండ్‌తో వ్యాపారం చేసుకు నేందుకు కొంతమంది ప్రయివేటువ్యక్తులకు, సంస్థలకు అనుమతి ఇచ్చిందన్నారు.

## పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా ఎన్. మధుసూదన రెడ్డి నియామకం

**విజయవాడ,మార్చి 9,ప్రభాతవార్త ప్రతినిధి:**ఏపీ రాష్ట్ర పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా ఎన్. మధుసూదన రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీపీగా(లా అండ్ ఆర్డర్) ఉన్న మధుసూదన రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల కమిషన్ ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అదనపు బాధ్యతలు అప్పగించింది. సాధారణ పరిపాలన శాఖ నుంచి జీఓ ఆర్.టి. నెం.519 జారీ అయింది. ఎన్నికల సమన్వయం కోసం స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా ఎన్. మధుసూదన రెడ్డి పని చేయనున్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం సూచించింది.

### రాష్ట్రంలో1.15 కోట్ల టన్నుల
## చెత్త క్లియర్
### మంత్రి పి.నారాయణ

**విజయవాడ, మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,53 కోట్ల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయని గుర్తించినట్లు ఏపీ పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్ల డించారు. ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టి, ఇప్పటివరకు 1.15 కోట్లు టన్నుల చెత్తను క్లియర్ చేశామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పది వేస్ట్ టు ఎనర్జీ (చెత్త నుంచి విద్యుత్) ప్లాంట్లు ప్రారంభించామని, వాటిలో రెండు పూర్తి చేశామని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం ఆ ప్లాంట్లను పట్టించుకోకుండా నిరక్ష్యం చేయడం వల్లే నేడు రాష్ట్రంలో చెత్త సమస్య ఇంత తీవ్రరూపం దాల్చిందని ఆయన ధ్వజ మెత్తారు. భవిష్యత్తులో ఈ సమస్య తలెత్తకుండా ప్రధాన నగరాల్లో పీపీపీ పద్ధతిలో అత్యాధునిక వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని నారాయణ పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఆయన, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. జగన్ ఐదేళ్ల పాల నను ఖిచెత్త పాలనగా అభివర్ణిస్తూ, ఆ సమయంలో పేరుకుపోయిన వ్యర్థాల సమస్య రాష్ట్రానికి పెను సవాలుగా మారిందని ఆయన మండిపడ్డారు.

### మద్యం కేసులో ఇడి విచారణకు
## హాజరైన నిందితులు

**విజయవాడ.మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణంలో ఈడీ విచారణకు కీలక నిందితులు హాజరయ్యారు. వారిలో కృష్ణ మోహన్ రెడ్డిని 2 గంటలపాటు ఈడీ అధికారులు ప్రశ్నించారు. ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఇప్పటికే రూ.441.61 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అధికారులుజప్తు చేసారు. రాజ్ కెసిరెడ్డి, చాణక్య, వాసుదేవరెడ్డికి చెందిన రూ.441 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ. ఏపీ మద్యం కేసులో ఈడీ విచారణ కొనసాగుతుంది. నిందితులెవ్వరు ఈడీ ప్రశ్నలకు తగిన రీతిలో జవాబులు ఇవ్వలేదని సమాచారం!. ఏపీ లిక్కర్ స్కామ్) కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ క్రమంలో మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను తీసుకురావాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొంది. సోమవారంవిచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది.

దాంతో వారు విచారణకు హాజరయ్యారు.ఇక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ మద్యం స్కామ్‌లో రూ. వేల కోట్ల కమీషన్లు, మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే రూ.441 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే.

### భగవద్గీతను పట్టుకొని అబద్ధాలు చెప్పిన భూమనకు జైలు శిక్ష విధించాలి
#### - బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్

**విజయవాడ మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డి భగవద్గీతను పట్టుకొని అబద్ధాలు చెప్పి, పవిత్ర గ్రంథాన్ని అవమానపరిచారని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ ధ్వజమెత్తారు. భగవద్గీత మీద ప్రయాణం చేసి అబద్ధం చెప్పినట్టు రుజువైతే 3 ఏళ్ల నుంచి 7 ఏళ్ల జైలు శిక్ష విధించొచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయని ఆ ప్రకారం భూమనను శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీవారి సొమ్ముతో మానవులందరికీ భగవద్గీత పుస్తకాన్ని ముద్రించారు.



పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కు ఆహ్వానిస్తున్నపారేపల్లి దూండీ రాకేష్

### అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణకు
## ఉపముఖ్యమంత్రి పవన్‌కు ఆహ్వానం

**విజయవాడ.మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.... నిర్మిస్తున్న 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఈ నెల్ల16న ఆవిష్కృతమవుతుందని ఆ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ పారేపల్లి దూండీ రాకేష్ తెలిపారు.

2026 న పొట్టి శ్రీరాములు గారి 125 వ జయంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు విశిష్ట అతిథులుగా ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్,

మంత్రి కందుల దుర్గేష్ ఆహ్వానించినట్లు తెలిపారు.సీఎం చంద్రబాబు సహకారంతో రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ విగ్రహం నిర్మించినట్లు అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ దూండి రాకేష్ తెలిపారు.

# ప్రమాదంలో కోళ్లు!

### రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో మరణిస్తున్న కోళ్లు
### సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలి: డా.దేవేందర్‌నాయుడు

**విజయవాడ, మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో కోళ్ళకు ప్రమాదం పొంచి ఉందని, రైతులు జాగ్రత్త పడాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంచాలకులు, డా. టి. దామోదర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలో పెద్ద సంఖ్యలో కోళ్లు మరణించినట్లు తెలియవచ్చిన నేపథ్యంలో మన రాష్ట్రంలోని కోళ్ల రైతులు, ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లోని కోళ్ల రైతులు తగిన జీవభద్రతా ప్రమాణాలు పాటిస్తూ, అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లోని పశుసంవర్ధక అధికారులు,సిబ్బంది తమ పరిధిలోని కోళ్ల ఫామ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, కోళ్లు, వాటి ఉత్పత్తుల రవాణాను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సరిహద్దు జిల్లాల్లోని రైతులు తమ ఫామ్‌లోని కోళ్ల ఆరోగ్య పరిస్థితిని నిత్యం పరిశీలించుకోవాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న కోళ్ల పెంపకదారులు తగిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి కోళ్లు, గుడ్లు లేదా ఉత్పత్తులను అనుమతి లేకుండా తీసుకురాకూడదన్నారు.కోళ్ల ఫామ్‌లలో బయోసెక్యూరిటీ చర్యలను కచ్చితంగా పాటించాలన్నారు. ఫామ్‌లో అనుమతి లేకుండా బయటి వ్యక్తులు ప్రవేశించకుండా చూడాలన్నారు. కోళ్లలో అకస్మాత్తుగా మరణాలు లేదా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్యాధికారికి సమాచారం అందించాలన్నారు. చనిపోయిన కోళ్లను నిరక్ష్యంగా పారేయకుండా పశుసంవర్ధక శాఖ సూచనల ప్రకారం పూడ్చివేయాటం చేయాలన్నారు. ఫామ్‌లలో శుభ్రత మరియు క్రిమిసంహారక చర్యలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని కోళ్ల పెంపకదారులు భయపడాల్సిన అవసరం లేదని, అయితే వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని, పశుసంవర్ధక శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు ఆ ప్రకటనలో తెలిపారు.

### ప్రభుత్వ సలహాదారుగా
### మంతెన సత్యనారాయణ రాజు

**విజయవాడ, మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ సలహాదారుగా మంతెన సత్య నారాయణ రాజును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మంతెనకు యోగా నేచరోపతి విభాగానికి సలహాదారుగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేబినెట్ హోదాతో పాటు హానరరీ అడ్వైజర్‌గా బాధ్యతలు అప్పగించింది. రెండు సంవత్సరాల పదవీకాలం వరకు ఆయన సేవలు కొనసాగనున్నాయి. వాహనం, కార్యాలయం, సిబ్బంది సౌకర్యాలతో పాటు అధికారిక పర్యటనలకు ట్రావెల్ అలవెన్స్ కూడా కల్పించాలని ఉత్తర్వుల్లో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వబడ్డాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ జి. సాయి ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.ఏపీ రాష్ట్ర పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా ఎన్. మధుసూదన రెడ్డి నియామకం జరిగింది. అడిషనల్ డీజీపీగా(లా అండ్ ఆర్డర్) ఉన్న మధుసూదన రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల కమిషన్ ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అదనపు బాధ్యతలు అప్పగించింది. సాధారణ పరిపాలన శాఖ నుంచి జీఓ ఆర్.టి. నెం.519 జారీ అయింది.

## ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విషయంలో కఠినమైన చట్టాలు అమలు చేయాలి

విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి: స్త్రీల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే శక్తుల విషయంలో కఠినమైన చట్టాలు అమలు చేయాలని పలువురు మహిళా నేతలు ఉద్ఘాటించారుజ.దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ప్రియాంక (హైకోర్టు న్యాయవాది) ప్రకాష్ కుమారి(ప్రభుత్వ ఉపాధ్యాయురాలు) పద్మ(పీఓడబ్ల్యు)హాజరయ్యారు.ప్రియాంక(హైకోర్టు న్యాయవాది)మాట్లాడుతూ ఒక మహిళ విద్యావంతురాలు అయితే తన కుటుంబాన్ని తన సమాజానికి ఎంతో ఉపయోగపడుతుంది, సమాజంలో బాల్యవివాహాలు జరగకుండా చూడాలి తల్లిదండ్రులు చదువు లేకపోయినా పిల్లల్ని చదివించగలగాలి అని చెప్పారు. పద్మ(పీఓడబ్ల్యు)1910 లో కోపెన్ హగ్ అనే నగరంలో క్లారా జెట్కిన్ అనే మహిళ ఆధ్వర్యంలో జరిగిన పోరాటం విజయవంతం కావడం వలన దాని ఫలితం 1975 ఐక్యరాజ్యసమితి మార్చి 8న అధికార పూర్వకంగా మహిళా దినోత్సవం ప్రకటించారు. ఒక మహిళ తన హక్కులు సాధించుకోవడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం చేసుకుంటున్నాము ప్రకాష్ కుమారి(ప్రభుత్వ ఉపాధ్యాయురాలు) భార్యాభర్తల మధ్య దాపరికాలు ఉండకూడదు, స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే. దళిత స్త్రీ శక్తి అనే సంస్థ మహిళా హక్కుల కోసం మంచి పోరాటాలు చేస్తారు, అందరూ కలిసి వివక్షత లేని సమాజం స్థాపించాలి. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి కోఆర్డినేటర్స్ రోజా ప్రసన్న మహిళా కలయికలు తదితరులు పాల్గొన్నారు.

# 10 జిల్లాల్లో హెచ్‌పివి టీకా పంపిణీ

### -14 యేళ్ల బాలికలకు మాత్రమే ఈ టీకా ! - ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్

**విజయవాడ,మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్ క్యాన్సర్) ముప్పు తప్పించేందుకు 14 ఏళ్ల బాలికలకు ఉచిత హెచ్పీవీ టీకా పంపిణీ సోమవారం పది జిల్లాల్లో ప్రారంభమైంది. మిగిలిన జిల్లాల్లో మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఓ ప్రకటన జారీ చేశారు. కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, పల్నాడు, శ్రీ సత్యసాయి, విజయనగరం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి జిల్లాల్లో టీకా పంపిణీ సోమవారం నుంచి ప్రారంభమైందని తెలిపారు. సుమారు 1500 మందికి వాక్సినేషన్ జరిగిందని తెలిపారు. 1,647 ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం ఉన్నట్లు గుర్తించిన 1,647 పీహెచ్సి, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వ్యాక్సిన్ను కేంద్ర ప్రభుత్వం నుంచి వ్యాక్సిన్ను పంపించారు. గ్రామ/ వార్డు సచివాలయాల్లో రికార్డుల ఆధారంగా 14 ఏళ్ల బాలికలు రాష్ట్ర వ్యాప్తంగా 3. 45 లక్షల మంది ఉన్నారని గుర్తించారు. వీరికి మాత్రమే ఈ టీకా వేస్తున్నారు. దీనికి ముందు ఎ. ఎన్. ఎం.లు, ఆశాలు బాలికల సదరు బాలికల తల్లిదండ్రులను కలిసి టీకా ప్రాధాన్యాన్ని సూచిస్తున్నారు. ఏయే ఆరోగ్య కేంద్రాల్లో టీకా వేస్తున్నారో కూడా చెబుతున్నారు. టీకా వేసే సమయంలో తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతిని తీసుకుని యువిన్ యాప్లో నమోదుచేస్తున్నారు. ఆధార్కార్డు నెంబరు ఆధారంగా ఓటీపీ రూపంలో ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. టీకా పంపిణీ ప్రారంభకార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు. 3 మూడు నెలలపాటు.టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు పలువురికి ఇంజెక్షన్ ఇచ్చినచోట నొప్పి, ఎర్రదనం, వాపు, తేలికపాటి జ్వరం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది.

ఇవి సాధారణంగా 23 రోజుల్లో తగ్గుతాయి. హెచ్పీవీ టీకా సురక్షితమైనది. ప్రభావవంతమైంది. భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ను నివారించడంలో హెచ్పీవీ వ్యాక్సిన్ కీలక ప్రాత పోషిస్తుంది మూడు నెలలపాటు టీకా పంపిణీ కార్యక్రమం జరగనుంది.

## రాజకీయాలను అర్థం చేసుకుని ఒబిసి విద్యార్థులు ఉద్యమించాలి
### - ఎఐబిఎస్పీ జాతీయ సమన్వయ కర్త డా. జె. పూర్ణచంద్రరావు



విజయవాడ ధర్నా చౌక్‌లో ఓబిసి విద్యార్థుల ధర్నాలో మాట్లాడుతున్న ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయ కర్త డా. జె. పూర్ణచంద్రరావు

**విజయవాడ, మార్చి9, ప్రభాతవార్తప్రతినిధి:** అగ్రకుల రాజకీయాలను అర్థం చేసుకుని ఓబీసీ విద్యార్థులు ఉద్యమించాలని రిటైర్డ్ డీజీపీ, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) జాతీయ సమన్వయ కర్త డా. జె. పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో మెస్ కాస్మోటిక్‌చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ చేస్తూ ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు యూఎన్ ఆర్అధ్యక్షతన ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షా కార్యక్రమానికి రిటైర్డ్ డీజీపీ, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) సమన్వయ కర్త డా. జె. పూర్ణచంద్రరావు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పది మెడికల్ కాలేజీలు కూడా అగ్రకులాలకు చెందిన వారివేనని, వారు బహుజన పిల్లల మెస్, కాస్మోటిక్ చార్జీలను ఎందుకు పట్టించుకుంటారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఈ అగ్రకులాల ప్రభుత్వాలకు ఇష్టం ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అగ్ర సామాజిక వర్గాల పాలనలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు చదవ కూడదు. ఇలా ధర్నాలు చేసుకుంటూ బతకాలన్నట్లు వ్యవహరించడం బాధాకరం అన్నారు. తమిళనాడు, తెలంగాణ కంటే ఏపీలో తక్కువ మెస్ కాస్మోటిక్ చార్జీలు ఉన్నాయని వెంటనే పెంచాలని డిమాండ్‌చేశారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి "పది మెడికల్ కాలేజీల్లో లక్ష ఉద్యోగాలు వాళ్ల తీసుకుంటే... మనం కోటి సంతకాల ఉద్యమం ఎందుకు చేశాం. వాళ్ల కోట్ల కోసం కోటి సంతకాల ద్వారా కోట్లు సంపాదించుకుంటారు. రాష్ట్రంలో పాలకులు ఇద్దరూ ఒకటే.. బయటికే ఒకరిపై ఒకరు కామెంట్లు.. ఇద్దరూ పాలక పక్షాలే కానీ అందులో ప్రజలే ప్రతిపక్షాలు., అంటూ పూర్ణచంద్రరావు స్పష్టం చేశారు. ఈ రాజకీయాలను విద్యార్థులు అర్థం చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ధనిక రాష్ట్రం ఏపీ కాదు అనేది నిజం కాదు. పాలకుల విధానాలను గమనిస్తూ.. ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని, పాలకులను ప్రశ్నించాలంటే మెటీరియల్ తెలియాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జనభాలో వందకు ముగ్గురున్న రజకవృత్తికారులు ఒక్కరూ ఎమ్మెల్యే కాలేదు. జనభాలో వందకు ముగ్గురున్న రజక వృత్తికారులు ఒక్కరూ ఎమ్మెల్యే కాలేదని, సామాజిక న్యాయం జరగాలంటే బీసీలు,ముస్లింలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా శాసనసభలు, రాజ్యసభ, శాసన మండలిలో రిజర్వేషన్లు కల్పించడమే మార్గమని విజయవాడలో జరిగిన రజక (చాకలి) సమాజం సమ్మేళనంలో నాయకులు డిమాండ్ చేశారు.

ఫోటో: ఫీ

# తిరుమల సమాచారం

## లడ్డూ ప్రసాదాల తయారీకి నెయ్యి కొరత లేదు :టిటిడి



**తిరుమల,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి నిల్వలు టిటిడి వద్ద సమృద్ధిగా ఉన్నాయని టిటిడి స్పష్టం చేసింది. కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో టిటిడి వద్ద నెయ్యి నిల్వలు లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని అసత్య ప్రచారం చేయడం సరికాదని పేర్కొంది. శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి సరఫరా మూడంచెల కొనుగోలు విధానం ద్వారా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతున్నందున ఎలాంటి అనుకోని పరిస్థితులు తలెత్తినా సరఫరాలో అంతరాయం కలగకుండా టిటిడి ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇందాపూర్ డైరీ నుండి తిరుమలకు వస్తున్న నెయ్యి ట్యాంకర్ కడప జిల్లా కొండాపూర్ సమీపంలో ప్రమాదానికి గురైన విషయం నిజమే. అయితే ఒక సంస్థకు చెందిన ట్యాంకర్ ప్రమాదానికి గురైనంత మాత్రాన నెయ్యి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగలేదని టిటిడి స్పష్టం చేసింది. మిగిలిన రెండు సంస్థల నుండి నెయ్యి సరఫరా యథావిధిగా కొనసాగుతోంది. ప్రస్తుతం భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది.

## విద్యుత్ తీగలకు బలైన రెండు ఏనుగులు

### - పంట రక్షణ కోసం వేసిన కరెంటు తీగలతో విషాదం - నెరబైలు అటవీ ప్రాంతంలో ఘటన - ఇద్దరిపై కేసు నమోదు



**యర్రావారిపాలెం (తిరుపతి జిల్లా), మార్చి 9 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా, యర్రావారిపాలెం మండలం, నెరబైలు గ్రామపంచాయతీ, పాత తురకపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలకు తగిలి రెండు ఏనుగులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి...నెరబైలు గ్రామానికి చెందిన అక్తర్ బాషా అను అతని భూమిని షామీర్ అనే రైతు కౌలుకు తీసుకొన్నాడు. ప్రస్తుతం వేసవికాలం సమీపిస్తున్న కారణంగా అటవీ ప్రాంతంలోని వన్యమృగాల బారి నుండి తాను సాగుచేసిన వేరుశనగ పంటను రక్షించుకునేందుకు పొలానికి చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతానికి ఆహారం కోసం వచ్చిన రెండు ఏనుగులు పొలం సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. గత 2 వారాలుగా సమీప అటవీ ప్రాంతం నుండి వచ్చి ఏనుగులు సంచరిస్తున్నాయి. పంట పొలాల్లోకి వచ్చి మళ్ళీ అటవీ ప్రాంతం లోకి వెళ్లిపోతున్నాయి. అయితే సోమవారం ఉదయం 2 ఏనుగులు మృతి చెందిన ఘటన విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన ఏనుగులను పంచనామా నిర్వహించి ఏనుగులను ఖననం చేశారు. ఈ ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంటలను రక్షించుకునే క్రమంలో రైతులు చట్టవిరుద్ధంగా విద్యుత్ తీగలు వేయకూడదని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అడవి జంతువుల సంరక్షణకు అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్వో సాయిబాబా, ఫ్లయింగ్ స్క్వాడ్ రామ కోదండ రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చైతన్య, నెరబైలు పశువైద్యాధికారి కృష్ణకాంత్, ఎఫ్ బీఓ లు ప్రదీప్, నిఖిల్, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు జైలు

**తిరుపతి,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవులనుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో నిందితుడికి ఐదేళ్ళు కారాగార శిక్షతో పాటు మూడులక్షల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలల జైలు శిక్ష విధించారు.తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పర్యవేక్షణలో అమలు చేస్తున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్" వ్యవస్థ ఫలితంగా ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ అదనపు న్యాయమూర్తి ఏ. నరసింహమూర్తి ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో సోమవారం సంచలన తీర్పునిచ్చారు. తిరుపతి జిల్లా చిన్నగొట్టికల్లు మండలం దేవర కొండ గ్రామంకు చెందిన నిందితుడు తైదాల మధుసూదన్ అనే మధు (33 ) 2017 సంవత్సరంలో ఎర్రవారి పాలెం పోలీస్ స్టేషన్‌లో స్మగ్లర్‌గా కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ, పర్యవేక్షణ కోర్టు లైజనింగ్‌లో కృషి చేసిన డిఎస్పీ ప్రసాద్ , స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏ. అమరనారాయణ , ఎర్రవారి పాలెం అప్పటి ఎస్ఐ డి. గోపి సిఐ టి.వి. సత్యనారాయణ కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్, డి. దుర్గాప్రసాద్ - కోర్టు కానిస్టేబుల్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## క్రమశిక్షణతో పద్మావతి వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ కార్యక్రమాలు



**తిరుపతి,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖ అన్ని కార్యక్రమాలను క్రమశిక్షణతో చేయటం కొనియాడదగ్గ విషయమని ముఖ్య వక్తలు తెలిపారు. పది లక్షల రూపాయలను అనువాదాల కోసమే కేటాయించడం ఇందుకు నిదర్శనమన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో శాస్త్ర వైజ్ఞానిక పరిభాషా కమీషన్, ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న త్రిభాషా సమాచార సాంకేతిక పదకోశం నిపుణుల సలహా సంఘ సమీక్ష సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖాధ్యక్షులు, ఈ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా తెలుగు అధ్యయన శాఖలో జరగడం గర్వ కారణమన్నారు. నేటి అధునాతన యుగంలో సాంకేతికత ముందంజగా సాగుతుందని భిన్న భాషలలో ఉన్న విజ్ఞానాన్ని అనువదించి మాతృభాషలో అధ్యయనం చేయడం వల్ల మరింత జ్ఞానం సముపార్జించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఆచార్య సి. వాణి ,ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దీపక్ కుమార్ కళా సంస్కృతి, భాష రెండు వేరు కాదని భాషకి కళ ఆత్మ వంటిదని అన్నారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ మంచినీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం. 38/2025-26 తేదీ: 05.03.2026
కోనసీమ జిల్లా అమలాపురం RWS&S డివిజన్ 12% ZP గ్రాంట్ క్రింద రూ.15.00 లక్షల వ్యయం గల పనికి ఆన్‌లైన్ టెండర్లు పిలువబడుచున్నవి. కాంట్రాక్టర్లు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ https://tender.apeprocurement.gov.in నుండి తేదీ: 09.03.2026, ఉ.10.30గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, RWS&S డివిజన్, అమలాపురం.
DIPR.NO. 19274/CL/ADVT/1/1/2022-23 తేదీ: 09.03.2026



పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank
...The name you can BANK upon!
సాధారణ పరిపాలన విభాగం - జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయూద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004. ఈ-మెయిల్: zohydgad@pnb.co.in ఫోన్: 040-23235213,23235216
ఎంపానెల్‌మెంట్ నోటీసు
పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ పరిధిలోని బ్యాంకు యొక్క వివిధ కార్యాలయాలు/శాఖలలో "సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థ సరఫరా, సంస్థాపన, పరీక్షించడం మరియు ప్రారంభించడం కోసం కాంట్రాక్టర్ల ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తులు" ఆహ్వానిస్తుంది. (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ & కర్ణాటక రాష్ట్రం).
అర్హత, నిబంధనలు & షరతులు మరియు దరఖాస్తు ఫారమ్‌ల వివరాలు బ్యాంక్ వెబ్‌సైట్ https://www.pnbindia.in/Tender.aspx లో అందుబాటులో ఉన్నాయి, వీటిని 10.03.2026న 10:00 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
మద్దతునిచ్చే అన్ని పత్రాలతో నిర్ణీత నమూనాలో పూర్తి చేసిన పత్రాలను "అసిస్టెంట్ జనరల్ మేనేజర్, GAD, పంజాబ్ నేషనల్ బ్యాంక్, జోనల్ ఆఫీస్: హైదరాబాద్, 6-1-73, రెండవ అంతస్తు, సయూద్ ప్లాజా, లక్డీ-కా-పూల్ - 500 004"కి 23.03.2026 నాటికి సాయంత్రం 5.00 గంటల లోగా పంపవలెను.
పైన పేర్కొన్న పనికి సంబంధించి ఏదైనా సవరణ/స్పష్టీకరణ పైన పేర్కొన్న బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి. కావున బ్యాంకు వెబ్ సైట్ ను తరచుగా సందర్శించగలరు.
అసిస్టెంట్ జనరల్ మేనేజర్


## అమరావతిలో మా లక్ష్మి వన్ హోటల్స్‌కు రాయితీలు - ఉత్తర్వులు జారీ చేసిన పర్యాటకశాఖ

**విజయవాడ,మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని పరిధిలో ఏర్పాటు చేయబోతున్న మాలక్ష్మి వన్ హోటల్స్‌కు పనులు కూడా ప్రారంభం కాకముందే ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే పేరుతో ప్రభుత్వం ఇచ్చిన ఈ రాయితీలు చర్చనీయాంశంగా మారాయి. అకాసియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కోరిన మీదట ఈ నిర్ణయం తీసుకున్నట్లు పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పేర్కొన్నారు. ఈ మేరకు జారీ చేసిన జిఓ నెం.14లో ఎస్‌జిఎస్‌టి 100 శాతం తిరిగి చెల్లించనున్నారు. కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి 12 ఏళ్లకాల పరిమితితోపాటు సొంత భూమిలోనే హోటల్ ఏర్పాటు చేస్తున్నందున్న మరో ఏడాది మొత్తం 13 సంవత్సరాలు తిరిగి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం పెట్టుబడిలో పదిశాతం గరిష్టంగా రూ.25 కోట్లు రాయితీ ఇవ్వనున్నారు. ఇది కూడా ప్రాజెక్టు ప్రారంభమైన తరువాత ఐదు వార్షిక వాయిదాల్లో చెల్లించనున్నారు. స్టాంప్ డ్యూటీ పూర్తిగా మినహాయించారు. ఐదేళ్లపాటు పారిశ్రామిక రేట్లకే విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఐదేళ్లపాటు విద్యుత్ సుంకం రీయింబర్స్ చేయనున్నారు. అయితే, పనులే ప్రారంభమే కాకుండా రాయితీలు ప్రకటించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి రాజధాని పరిధిలో ఎకనామిక్ ప్రాజెక్టుల్లో భాగంగా 2018లో అథారిటీ తీర్మానం నెంబరు 234/2018 ప్రకారం మహాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్‌కు మందడం పరిధిలో భూములు కేటాయించారు. 2025 ఆగస్టు 25వ తేదీన వెంచర్స్‌కు సంబంధించిన పేరును అకాషియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రవేటు లిమిటెడ్‌గా మారుస్తూ జిఓ నెంబరు 869 ఇచ్చారు. ఇదే స్థలంలో డబుల్ ట్రీ బై హిల్టన్ బ్రాండ్ కింద రూ.330 కోట్లతో మాలక్ష్మి వన్ టూరిజం, హాస్పిటాలిటీ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని, తాము ఏర్పాటు చేసే ప్రాజెక్టు వల్ల 372 మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఉపాధి కల్పిస్తున్నందున 202429 ఆంధ్రప్రదేశ్ పర్యాటక పాలసీలో తమకు రాయితీలు ఇప్పించాలని కోరారు.

వార్త

అలవాట్లు మనం ఉపయోగించే చేతికర్ర వలె ఉండాలి. కానీ ఆధారపడే ఊత కర్రగా ఉండకూడదు.

-ఎ.జి. గార్డెనర్

# విధ్వంసరహిత టెక్నాలజీ అవసరమే

**రాబోవు తరాల్లో మానవ మేధస్సుతో తయారైనటువంటి కృత్రిమ మేధాశక్తి సహజసిద్ధమైన మానవ మేధస్సుపై దండయాత్ర చేసినా ఆశ్చర్యపడవ లసిన అవసరం లేదేమో శృతిమించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనుకోని రీతిలో ఒకవేళ విధ్వంసం వినాశనం చేసే పరిస్థితిలే సంభవిస్తే ప్రపంచం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే. నూతన ఆవిష్కరణలు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న ఉపకరణాలు ఎట్టి పరి స్థితుల్లో మానవాళికి హాని చేసేవిధంగా ఉండకుండా శాంతి యుత జీవన విధానాలకు విఘాతం కలగకుండా సహజ మైన మానవాళి మనుగడకు ఆధ్యాత్మిక జీవన విధానాలకు ఆటంకం లేకుండా ప్రపంచంలోని ఆయా ప్రాంతాల్లో నివసించే విభిన్న సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన ప్రజల మధ్య సాన్నిహిత్యం పరస్పర సహకారానికి తోడ్పాటు అందించే విధంగా అవసరాలను సులభతరం చేసే విధంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ముందు పురోగమించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

నేటి ఆధునిక జీవన విధానాల్లో మానవ సంబంధాల కన్నా ఆధునిక సాంకేతిక ఉపకరణాల అనుబంధమే ఎక్కువగా ముడిపడి ఉందంటే అతిశయోక్తి లేదు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ మానవుని దైనందిన జీవితాల్లోకి అతి సులభంగా చొచ్చుకొచ్చినంతగా మానవీయ కోణాల్లో ఆలోచనా ధోరణిలు అనుకున్నంత స్థాయిలో లేవంటే నమ్మశక్యం కావేమో. ప్రస్తుతం మారుమూల ప్రాంతాల్లో సైతం అక్షరాస్యతతో సంబంధం లేకుండా ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు సాంకేతిక ఉపకరణాలు అంటే టెక్నాలజీ వస్తు వినియోగం అధికం కావడం ఇంటర్నెట్ సెల్‌ఫోన్ లాంటి అత్యాధునిక సాంకేతిక ఉపకరణాలచే ప్రపంచమే మానవుని అరచేతిలోకి వచ్చిందా అనే విధంగా మానవ జీవన విధానాలు సాంకేతిక ఉపకరణాల మధ్య విడదీయరాని బంధం ఏర్పడుతూ వస్తుండడం విశేషం. ప్రస్తుతం అతివేగంగా కృత్రిమ సాంకేతికత పరిజ్ఞానం మానవ జీవన విధానాన్ని మార్చివేస్తుంది. ఎక్కువగా మానవులు ఒంటరిగా కూర్చుని భౌతిక సంబంధం లేక ఎదురెదురుగా ఎదురుపడి మాట్లాడుకోలేనంతగా ఉపకరణాలే వారి మధ్య సంధానకర్తగా ఉంటున్నాయా అనే సంశయం కలగక మానదు. కంప్యూటర్ ఉపకరణాల నుండి అంటే ఎలక్ట్రానిక్ డివైస్ నుండి మొదలైన ప్రస్తావన సెల్‌ఫోన్లు లాప్టాప్‌లు స్మార్ట్‌ఫోన్లు వీటితో పాటు సులభతరంగా వినియోగించుకునే సాఫ్ట్వేర్ టెక్నాలజీ రోజురోజుకు మరింత సులభతరం కావడం అందరి జీవన విధానాలను మార్చేస్తున్నాయి. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి అనేక రకాల సాఫ్ట్వేర్లను మానవుడు తయారు చేస్తున్నప్పటికీ అవి మానవుని జ్ఞాపక శక్తి కంటే మానవ అంతర్గత శక్తుల కన్న అత్యంత వేగంగా దృశ్యశ్రవణ రూపంలో మార్చగల శక్తి ఆధునిక సాఫ్ట్వేర్లకే సొంతమైంది. సాంకేతిక అభివృద్ధి మానవాళికి సులభతరమైన విధానాలను అందిస్తుంది కానీ, మానవ సమూహాలు ఒకప్పటి మానవ అనుబంధాలు సాంకేతిక పరిజ్ఞానంతో క్రమక్రమంగా దూరం జరుగుతుండడం తెలియకుండానే జరిగిపోతున్నాయి. మానవుడిని ఒక గదికో ఒక ప్రదేశానికి పరిమితం చేసే ఆధునిక సాంకేతిక ఉపకరణాలు తెలియకుండానే మానవులను ఒంటరిగా కూర్చొని ప్రపంచాన్ని చూడడానికి దోహదం చేస్తున్నాయి. అదేవిధంగా సెల్ఫోన్ చేతుల్లో లేనిదే సాంకేతికతను ఉపయోగించుకోనిదే కాలం గడవని పరిస్థితిలో జీవన విధానాలు ఉంటున్నాయా అని అనిపిస్తుంటుంది. మానవుని నిర్మితమైన కృత్రిమ రోబోటిక్స్ విధానం వేగంగా సమాజంలోకి వస్తుంది. డ్రోన్ వ్యవస్థ అత్యంత శక్తివంతంగా మానవుడికి ప్రత్యామ్నాయంగా మానవుని వలె పనిచేసే తీరువేగం కచ్చితత్వం వాటికి ఉంటుందంటారు. వీటన్నిటిని తయారు చేస్తున్న మానవ మేధస్సు తర్వాత కాలాల్లో వాటిని ఉపయోగించుకునే విధానాన్ని బట్టే జీవన పరిణామ క్రమం ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఒక ఎత్తు అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నేటి తరం నేరుగా సాంకేతికతను చూడడం మానవ అనుబంధాల కన్నా ఊహాత్మకమైన ఆలోచన విధానాలను ఆర్టిఫిషి



యల్ ఇంటెలిజెన్స్‌తో కృత్రిమ దృశ్య రూప సంబంధాల మధ్య జీవన విధానాలు కొనసాగిస్తుండడం గమనార్హం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవుని మానసిక వికాసంలో జరిగే మార్పులకు ఊహ ప్రపంచాన్ని తెరపై ముందుకు తెస్తుంది. దీనికి అనుకూలంగా మార్చుకునే మానవ జీవన విధానాలు పూర్తి స్థాయిలో మానవ సంబంధాల కన్నా సాంకేతిక సంబంధాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవించే విధంగా ఉన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ క్రమంలో కృత్రిమమేధా శక్తి మానవ మనోవిజ్ఞానానికికచ్చితంగా సువాలుగా నిలుస్తుందేమో. అపరిమితమైన ఆధునిక కృత్రిమ మేధస్సు పరిజ్ఞాన పరిమితులు దాటకుండా దైనందిన జీవితాలలో మమేకమైపోతాయా లేక మానవ సహజమైన మేధస్సుకు సవాలుగా నిలుస్తాయా అనే విషయమై పునరాలోచించాల్సిందే. మానవుడు తన సృజనాత్మక ఆలోచన ధోరణితో తయారు చేస్తున్న అనేక నూతన ఆవిష్కరణలు కృత్రిమమైన సాంకేతిక ఉపకరణాలు మానవజాతికి ఎంత మేరకు అవసరమో తెలియదు కానీ రాబోవు కాలంలో తిరిగి అవి మానవాళికి వ్యతిరేకంగా మారిపోతాయా లేక మానవుని చెప్పు చేతుల్లోనే ఉంటాయా అనేది సందిగ్ధంగానే మిగిలిపోతుందేమో. సాంకేతికత అనేది ప్రపంచంలో అనేక మందిలో కొంతమంది సాంకేతిక నిపుణుల చేతుల్లో మాత్రమే నిక్షిప్తమై ఉంటుంది కానీ ఆ కొంతమంది తయారు చేస్తున్న ఇలాంటి అనేక రకాలు అయినటువంటి సాంకేతిక పరిజ్ఞానం కంట్రోలింగ్ విధానం సాధారణ ప్రజలు ఉపయోగించే పరిస్థితి ఉందా లేదా అనే విషయమై భిన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఆధునిక మానవ విజ్ఞాన శాస్త్రం చుట్టూ ఉన్న పరిసరాలతోపాటు అనంత విశ్వంలో ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు లోతుగా అధ్యయనం చేస్తున్నప్పటికీ, చివరికి ఏదో ఒక రకమైన అంతుచిక్కని శక్తి అనేదే ఈ విశ్వానికి సృష్టికి మూలం అని కొందరు శాస్త్ర పరిజ్ఞానం ఉన్నవారు పరోక్షంగా తరచుగా చెప్పుతుండటం చివరికి భౌతికపరమైన అభివృద్ధి చెందుతున్న పరిజ్ఞానంతో పాటు సమాంతరంగా ఆధ్యాత్మికంతో కూడినటువంటి భావనే చివరకు జవాబుగా మిగిలిపోతుందా అని అనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అపహాస్యం చేసే విధంగా వినాశనానికి ఉపయోగిస్తేమాత్రం మానవుడు తనకు తానే విధ్వంసాన్ని సృష్టించుకున్న వాడు అవుతాడు. ఏ విధమైన టెక్నాలజీ అయినా మితిమీరని హద్దులు దాటని వినియోగానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే విధంగా ఉండాలి లేకుంటే రాబోవు తరాల్లో మానవ మేధస్సుతో తయారైనటువంటి కృత్రిమ మేధాశక్తి సహజసిద్ధమైన మానవ మేధస్సుపై దండయాత్ర చేసినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదేమో శృతిమించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనుకోని రీతిలో ఒకవేళ విధ్వంసం వినాశనం చేసే పరిస్థితిలే సంభవిస్తే ప్రపంచం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే. నూతన ఆవిష్కరణలు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లో మానవాళికి హాని చేసేవిధంగా ఉండకుండా శాంతి యుత జీవన విధానాలకు విఘాతం కలగకుండా సహజమైన మానవాళి మనుగడకు ఆధ్యాత్మిక జీవన విధానాలకు ఆటంకం లేకుండా ప్రపంచంలోని ఆయా ప్రాంతాల్లో నివసించే విభిన్న సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన ప్రజల మధ్య సాన్నిహిత్యం పరస్పర సహకారానికి తోడ్పాటు అందించే విధంగా అవసరాలను సులభతరం చేసే విధంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ముందు పురోగమించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. •

## మసకబారుతున్న మానవత్వం!

ఎక్కడికెళ్తోందో దేశం, ఏమైపోతోంది? అన్న కవిగారి ఆందోళనలు ఇన్నాళ్లకు ప్రజాబాహుళ్యపు కర్ణపుటాల్లోకి చేరాయి. రోజువారి ప్రాపంచిక విషయాలు, జరుగుతున్న సంఘటనలు, ఉదంతాలు, వేటిని పరిశీలించినా జరుగరాని వాటిని వింటున్నాం, కంటున్నాం. ఇలాంటి వాటిని గమనిస్తే ముందు ముందు మరెన్ని ఘోరాలు చూడాలో, మరెన్ని చేదు అనుభవాలు చవిచూడాలో భయమేస్తుంది. రేపటి పౌరులను క్రమశిక్షణలో పెట్టగల యంత్రాంగం ఏమీ చేయలేని, చెప్పలేని పరిస్థితులను గమనిస్తూ నివ్వెరపోయి చూస్తోంది. బళ్లారిలోని గురుకుల పాఠశాల వసతి గృహంలో ఓ విద్యార్థి డ్రగ్స్‌కు బానిసై తోటి విద్యార్థులు నిద్రిస్తుండగా కత్తితో, రాడ్లతో వారిపై దాడిచేశారు. కర్నూలు వాసి హేమంతకుమార్ మృతిచెందాడు. నిన్నగాక మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఒక మహిళా టీచరు స్కూల్లో చెప్పులు వేసుకురాని 10 మంది విద్యార్థుల మెడలో చెప్పుల దండ వేయించింది. కృష్ణా జిల్లా ఉయ్యూరులోని ప్రయివేటు పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. ఆ పది మంది మెడలో చెప్పుల దండ వేసి తోటి విద్యార్థుల ఎదుట నిలబెట్టింది. టీచరు తీరుపైతల్లిదండ్రులు ప్రశ్నిస్తే కేవలం వారు ఇకపైనా క్రమశిక్షణతో ఉంటారని, టీచరు సమాధానం. ఇతరుల ముందు అవమానంచేస్తే ఆ విద్యార్థుల మనసు గాయపడ్తుందని కూడా తెలియకుండా టీచర్లు చేసే వికృత రచ్చ విద్యార్థులల్లో ఏ విధమైన సంఘర్షణ కలుగ చేస్తుందో అర్థం చేసుకోలేని పరిస్థితి. జరిగిన సంఘటన ఎక్కడిదైనా ఏ ఊరిదైనా సమాజంలో విద్యార్థులు, గురువుల వ్యవహారశైలిలో, ప్రవర్తనా ధోరణిలు నానాటికీ నీచస్థాయికి దిగజారుతున్నాయని, మానవతా విలువలు మచ్చుకైనా లేవని తెలిసి నిట్టూర్చడ మొక్కటే మిగిలింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ తేవడానికే తాము ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు చెప్పుకోవడంలో వారిలో బాధ్యతారాహిత్యాన్ని చూపిస్తోంది. క్రమశిక్షణ నేర్పేందుకు ఇలాంటి పద్ధతులను అనుసరించడం ఒక తప్పయితే వాటిని సమర్థించుకోవడం మరో తప్పు. విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు మర్యాదకర పద్ధతులను గౌరవంగా నచ్చచెప్పి చూడటమే. జరిమానా విధించి వారిని దారిలోకి తెచ్చుకోవడమో మాని వారిలో అవమాన భారం కలిగేటట్లు దండించడం మధ్యయుగాల నాటి చర్యలను తలపిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాలో కార్వి ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మధుకుమారి స్కూల్‌లో విద్యార్థినుల చేత మసాజ్ చేయించుకోవడం మరింత అమానుష చర్యగా అనిపిస్తోంది. ఆనక టీచర్ సస్పెండయ్యారు. అయితే ఏం కనీస మానవత్వం లేకుండా వ్యవహరించేవారు గురుస్థానంలో ఉండనీయరాదు. అదే అసలు సిసలు క్రమశిక్షణ అంటే. ఒకప్పుడు ప్రాచీన కాలంలో గురుకులాల్లో గురుశ్రూషలో పాదసేవలు చేయించుకోకునే వారని జరిగేదని రాయగా తెలుసుకున్నాం. కాగా ఇంతటి ఆధునికకాలంలోనూ విద్యగరపాల్సిన గురువులు క్రమశిక్షణ పేరుతోనో సొంత సేవలతోనో విద్యార్థులను ఇబ్బంది పెట్టడం మానవతా కోణంలో చూస్తే అన్ని విధాలా తప్పే. విజయవాడ విద్యాధర పురం నేషనల్ స్కూల్‌లో చదువుతున్న మూడేళ్ల చిన్నారిపై యాసిడ్ దాడి జరిగిందని ఆరోపణ. చిన్నారి ప్రయివేటు పార్టులకు తీవ్ర గాయాలయ్యాయి. అతిచిన్న వయసున్న చిన్నారిపై దాష్టీకానికి ఎవరు ఎలాంటి కారణాలు చెప్పినా క్షమార్హం కాదు. పిల్లలపై కక్షబూనడం వినటానికే అతి జుగుప్సాకరం. మానవత్వం సిగ్గుతో తలదించుకునే అమానుషాలు జరుగుతున్నాయి. ఒకప్పుడిలాంటివి జరిగితే మధ్యప్రభావం అనేవారు. ఇప్పుడలా కాదు 'కాల మహిమ'. ఇలాంటివి ఈ మధ్యకాలంలో ఎన్నో మానవత్వం లేని ఉదంతాలు బయటపడి ఔరా! అని ముక్కునే వేలేసుకోవాల్సి వస్తోంది. అందుకే అన్నారేమో! ఇది కలికాలమని, నాగ్‌పూర్‌లోని కోరాడి ప్రాంతంలో హోలీ ఆడుకుంటూ ఓ నాలుగేళ్ల మనవడు బామ్మ మీద రంగులు చిలకరించాడు. దానికి ఆగ్రహోద్రగ్యురాలైన ఆ బామ్మ తన చేతిలోఉన్న బకెట్‌లోని వేణ్ణీళ్లను మనవడిపై పోయగా బాలుడి శరీరమంతా బొబ్బలెక్కిపోయాయి. ఆస్పత్రికి తరలించారు. ఏది ఏమయినా ఆగ్రహం ఎవరికి వచ్చినా పసివాడిపై పోయడంతో అతని పరిస్థితి విషాదంగా మారింది. మొన్నీమధ్య తమ ఉపాధ్యాయుడిని కడుపులో గుద్దులు గుద్ది గాయపరచిన విద్యార్థి కథనం కూడా వైరల్ అవడం తెలిసిందే. విద్యార్థులు తరగతిలో గదిలోకి ప్రవేశించినప్పుడే చేయదగినవి, చేయకూడని వాటి గురించి చెప్పడం మంచి పద్ధతి. అంతేతప్ప వారిలో అవగాహన పెంచి కక్షలు, కార్పణ్యాలను ప్రేరేపిస్తే రేపటి పౌరులు ఏస్థాయికి చేరుకుంటారో ఆలోచించాలి. విద్యార్థుల మనో వికాసానికి చేపట్టదగిన చర్యలు అవసరం. అలాగే కొందరు ఉపాధ్యాయుల్లో అసహనం కలిగేఅంశాలపై అవసరమైనంత మేరకుసంయమనం పాటించే పరిస్థితులను ప్రోది చేయాలి. హైదరాబాద్ హాఫీజ్‌పేటలో తొమ్మిదోతరగతి చదివే విద్యార్థి తలమాసిందని, జుట్టు ఎక్కువగా ఉందని ప్రిన్సిపాల్ గుండు కొట్టించిన ఉదంతం ఒకటి బయటకొచ్చింది. రానురాను విద్యార్థులు, గురువుల మధ్య సంబంధాలు ఏవిధంగా నిర్వహించాలో తెలియని పరిస్థితులలో ఉభయులూ గతి తప్పి ప్రవర్తించడం సభ్యసమాజం హర్షించే పరిస్థితిలేదు. విద్యాసంస్థలు ప్రయివేటువైనా, ప్రభుత్వానివైనా అందులో ఉండే విద్యార్థులు కానీ, గురువులు కానీ సమస్యల పరిష్కారంలో ఏ విధమైన సంయమనం పాటించాలి.

> పనులను చేయడంలో రహస్యం ఒకటుంది. అదేమిటంటే ఆ పనుల్ని వాయిదా వేయడం సరికాదు. వెంటనే చేయడం.
>
> ఆడమ్ స్మిత్



> జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం, విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.
>
> స్వామి వివేకానంద



## ప్రజావాక్కు



### రీకాల్ అనే పదం రావాలి

నిజానికి బ్రిటిష్ వారి భావజాలంలో 'సర్' బిరుదు కాదు. నిజానికిరిఫార్మ్‌కావాల్సి ందిప్రజాస్వామ్యఎన్నికల వ్యవస్థ. రీ కాల్ అనే పదంకావాలి. ప్రజలు ఎన్నుకున్న రాజకీయ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన వాగ్దానాలు నెరవేర్చలేని పక్షంలో వారిని తీసివేసే అధికారం కూడా ప్రజలకు ఉండాలి. ఎన్నికల కమిషన్ కూడా గెలిచినవారు ఎన్నికల మేనిఫెస్టోలో వారు చెప్పిన వాగ్దానాల నెరవేరుస్తున్నారో లేదో చూడాలి. అలా వారు చేయలేని పక్షంలో వారిని రీకాల్ చేయడానికి మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని వారికి హెచ్చరించాలి. అలాంటి ఎన్నికల కమిషనర్ కావాలి అతని పేరు టిఎన్ శేషన్ అయి ఉండాలి. అంతేకానీ తన గర్భం హోదా గొప్పతనం చాటుకునే టి ఎన్ శేషన్ కాదు. ఎందుకు భారత రాజ్యాంగంలో అంబేద్కర్ గారు ప్రవేశ పెట్టలేదో ఎవరికీ తెలియదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఆన్‌లైన్ సర్వీసెస్‌లో సాంకేతిక లోపం

తెలంగాణ మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ట్యాబ్ ఓపెన్ కావడం లేదు. ఈట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అం దుబాటులోఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈ లోపం కారణంగా అనేక మంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. కావున, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ సాంకేతిక సమస్యను తక్షణమేపరిష్కరించి, మీసేవ యాప్ అన్ని విధాలుగా సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విద్యార్థులకు ఉపశమనం కల్పించాలి

ఎ.పి.లోప్రైవేట్ఇంజనీరింగ్ కళాశాల ట్యూషన్ ఫీజులను పెంచారు. నియమితకాలం తర్వాత ఫీజుల పెంపు సాధారణమే. ఐతే గత ఫీజులతో పోలిస్తే కాస్త స్వరూపం ఉంటేమంచిది. కొత్తగా పెట్టిన ఫీజులుమొదటి ప్రాధాన్యత ఇచ్చివిద్యార్థులు కళాశాలను ఎంచుకుంటారు. ఫీజు రీయింబర్స్ విధానం ఉన్నప్పటికీ తల్లితండ్రులు మిగిలిన అవసరాలకు వెచ్చించాలి. వార్షిక ఆరంభానికి ముందే నూతన ఫీజులను తెలియచేయడం కూడా ముఖ్య విషయమే.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### పెరుగుతున్న డయాబెటిస్ బాధితులు

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక డయాబెటిస్ బాధితులున్న రెండో దేశంగా భారత్ నిలవడం ఒక తీవ్రమైన ప్రజారోగ్య సంక్షోభానికి నిదర్శనం. వేగవంతమైన పట్టణీకరణ, జీవనశైలి మార్పులు జన్యుపరమైన ముప్పులు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు కేవలంసంపన్న వర్గాలకే పరిమితమైన ఈవ్యాధి, ఇప్పుడు గ్రామీణప్రాంతాలకు, యువతకు సైతం వేగంగా విస్తరిస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారం, మానసిక ఒత్తిడి, అస్తవ్యస్తమైన నిద్ర అలవాట్లు ఈ మెటబాలిక్ వ్యాధికి ఇంధనంగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తు, చాలాసందర్భాల్లో ఈ వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోంది. మధుమేహం కలిగించే దుష్ప్రభావాలు కేవలం ఒక అవయవానికే పరిమితం కాకుండా మొత్తం శరీర వ్యవస్థను దెబ్బతీస్తాయి. ఇది దేశ ఆరోగ్య వ్యవస్థకు పెను భారంగా మారుతోంది.

- ఎన్. రామారావు, నల్గొండ

### పోలీసు వ్యవస్థలో మార్పులు

పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యం లేకుండా పోలీస్ వ్యవస్థ స్వయంప్రతిపత్తి కలిగి బాధితులకు మరింత చేరువగా మానవీయ కోణంలో సేవలందించేందుకు తెలంగాణ రాష్ట్ర నేర పరిశోధన విభాగం సీఐడి ఒక కీలకనిర్ణయం తీసుకుంది. ఇది పౌరులకు బాధితులకు శుభ పరిణామంగా భావిస్తున్నారుఇకపై బాధితులు ఠాణాల చుట్టూ తిరగాల్సిన అవసరంలేకుండా పోలీసులే బాధితుల నివాసానికి లేదా వారు కోరిన ప్రదేశానికి వెళ్లి ఎఫ్.ఐ.ఆర్. నమోదుచేసే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే మొదటిసారిగా పౌర కేంద్రీత పోలీసింగ్‌లో భాగంగా ఈ విప్లవాత్మక మార్పును తీసుకొచ్చినట్లు సిఐడీ విభాగం తెలిపారు. ప్రత్యేకించి మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, శారీరక దాడులు, బాధితులు తీవ్ర మానసిక ఒత్తిడిలోనవుతుంటారు.

- ఎస్.లక్ష్మీనారాయణ, కరీంనగర్

### ప్రాజెక్టు పేరు మార్చాలి

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల ప్రారంభించిన చెనకా కోరాట బ్యారేజ్ ఆదిలాబాద్ జిల్లాకు ప్రాణవాయువు లాంటిది. ఈ ప్రాజెక్ట్ సాకారంలో గత ప్రభుత్వం పాత్ర చాలా ఎక్కువ. జల జగడాలు ముసురుకుంటున్న ఈ తరుణంలో చర్చల ద్వారా ప్రాజెక్ట్‌ను ఎలాసాకారం చేయొచ్చో గత ముఖ్యమంత్రి చేసి చూపెట్టారు. 68వేలఎకరాలకు సాగునీరుఅమలులోకి వచ్చింది.

- భారత అవినాష్, జనగామ

# కల్తీలపై నియంత్రణ ఇంకెప్పుడు?

చిలగాని జనార్ధన్

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఫలితంగా కల్తీ పదార్థాలు మార్కెట్‌లో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించిన ప్రతీ వంద షాంపిల్స్‌లో 20కి పైగా కల్తీకి గురైనట్లు నివేదికలు చెబుతున్నాయి. 2021-24 మధ్య కాలంలో పార్లమెంటుకు నివేదించిన ఆహార కల్తీలే ఇందుకు నిదర్శనం. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో భారీగా ఆహార పదార్థాలు, సరుకుల కల్తీలు జరుగుతోన్నా నియంత్రణకు తీసుకున్న చర్యలు నామమాత్రమే. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోనూ వైద్య ఆరోగ్య శాఖకు అత్తెసరు నిధులే కేటాయించిన విషయం తెలిసిందే. బడ్జెట్‌లో రెండు శాతమే కేటాయించినా ఇందులో ప్రజారోగ్య శాఖ పరిధిలో ఫుడ్‌సేఫ్టీ విభాగం ఊసే లేకుండా పోయింది. ఆహార కల్తీ నిర్ధారణకు ల్యాబ్‌ల విస్తరణ, సిబ్బంది నియామకం లేనట్లేనని తేలింది. ఏపీలో తిరుపతి లడ్డు, పాల కల్తీ దూమారం రేపుతున్న విషయం తెలిసిందే. గతంలో హైదరాబాద్‌లో మోమోస్ మయోనైజ్ తినడం వల్ల మృతి చెందిన సంఘటనలున్నాయి. తెలంగాణాలోనూ రోజూ ఎక్కడో చోట ఆహార కల్తీలతో అనారోగ్య పాలౌతున్నారు. తరచూ విద్యాసంస్థల్లోని స్టూడెంట్స్ ఫుడ్ పాయిజ్‌కు గురై ఆసుపత్రి పాలౌతున్నారు. మార్కెట్‌లో రోజు తినే వస్తువులు, పదార్థాలు కల్తీయా, నాసిరకమా అనేది తెలియడం లేదు. ఎక్కువగా కల్తీ పదార్థాలు తయారు చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. పసుపు, కారం, ధనియాలు, పప్పులు, నూనెలు ఇలా నిత్యవసర సరుకులతో పాటు ఇతర వస్తువుల్లో కల్తీ జరుగుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల పరీక్షల్లో స్పష్టమౌతుంది. అరటి పండ్లలో ఇథోపాన్ పెస్టిసైడ్, ఆపిల్‌పై ప్యారాపిన్, సపోట, దానిమ్మ, సంత్ర వీటిల్లో కార్బడ్ అవశేషాలుంటున్నాయి. కన్ఫెక్షనరీలో పల్లి పట్టిలో సల్ఫర్ డైయాక్సైడ్, కుర్‌కురే, చాక్‌లెట్స్..స్వీట్స్ హౌజ్‌ల్లో లడ్డు, జిలేబీ, కేక్‌లలో విచ్చలవిడిగా కలర్స్ వినియోగిస్తున్నారు. దీనివల్ల క్యాన్సర్‌తో పాటు లివర్ సంబంధిత వ్యాధులు కబలిస్తున్నాయి. ఇక ఫాస్ట్‌ఫుడ్



సెంటర్లలో వినియోగించే ఆయిల్, కలర్స్, ముడి పదార్థాల గురించి చెప్పనవసరం లేదు. తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్‌ను గుర్తించే ఒకే ల్యాబ్ ఉంది. ప్రతీ రోజు కొన్ని మాత్రమే టెస్ట్ చేసేందుకు వీలుంది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు వందలోపు ఫుడ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది మాత్రమే ఉన్నారు. సుమారు కోటిన్నర జనాభా గల హైదరాబాద్‌లో 32 సర్కిళ్లలో ఉన్నఅరకొర సిబ్బంది వల్ల తనిఖీలు ఏ మాత్రం చేయవచ్చో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రానికి ఆరు ఎఫ్ఎస్ఎస్ఐ ల్యాబ్‌లు, మరో ఆరు మొబైల్ ల్యాబ్‌లు మంజూరు చేయాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీనివల్ల తనిఖీలు, షాంపిల్స్ సేకరణ పరిమితంగా చేస్తున్నట్లు తెలుస్తుంది. దుకాణాలు, ఆహార ఉత్పత్తి సంస్థల రిజిస్ట్రేషన్, లైసెన్సుల జారీ ఇలా అన్నీ ఇక్కడ చిదంబర రహస్యాలే. ఫుడ్‌సేఫ్టీ ఆఫీసుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన లేకుండా పోయింది. అతి కొద్ది మందికి అవగాహన ఉన్న వారు ఆఫీసుకు వెళ్లినా అక్కడ తాళాలే దర్శనమిస్తాయి. ఎఫ్ఎస్ఓలు, సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండరు. ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించకపోవడం, ఆహార కల్తీ నిరోధక విభాగం అస్తవ్యస్తానికి కారణంగా చెప్పవచ్చు. ఆహార పదార్థాల తయారీ దారులు, హోటళ్ల యజమానులు, ఇతర దుకాణా దారులు దరఖాస్తులను జీఎఫ్ఐ పరిశీలించి రిజిస్ట్రేషన్, లైసెన్సులు జారీ చేయాల్సి ఉంది. ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేశాక, క్షేత్ర స్థాయి లో ఫుడఇన్స్‌పెక్టర్ పరిశీలించి, అర్హతలున్నట్లు నిర్ధారించాకే, కొన్ని షరుతుల మేరకు వారికి లైసెన్స్‌లు జారీ చేయాలి. కాని ఇలా చేయడం లేదనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఫుడ్ లైసెన్స్‌ల జారీ, తనిఖీలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ సిబ్బందిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ లేకుండా పోయింది. తెలంగాణ ఏర్పడకముందు కనీసం నెలకొకసారైనా జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వ హించేవారు. కల్తీలపై నిర్వాహకులకు ఫైన్‌గాని, ఇతర చర్యలు తీసుకునే వారు. కాని స్వరాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ విభాగంపై సమీక్షలు, సమావేశాలు లేవు. బాధ్యులపై చర్యలేవీ లేవు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆహార పదార్థాల కల్తీల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. •

# పాఠ్యపుస్తకం ఒక సామాజిక దిక్సూచి!

మల్రాపు వసుంధరా దేవి

విద్య అంటే కేవలం అక్షరాలను పేర్చడం కాదు, అది ఒక తరం ఆలోచనా విధానాన్ని నిర్మించే మహత్తర ప్రక్రియ. పాఠ్యపుస్తకం కేవలం సమాచార భాండాగారం కాదు, అది రేపటి పౌరుడికి సమాజాన్ని చూపే అద్దం. అటువంటి పాఠ్యపుస్తకాల్లో దేశపు అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థల గురించి ప్రస్తావించేటప్పుడు ఎంతటి పరిణతి, బాధ్యత ఉండాలనే అంశంపై ఇప్పుడు దేశవ్యాప్త చర్చ జరుగుతోంది. ఇటీవల జాతీయవిద్యా పరిశోధనా శిక్షణా మండలి ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థ పనితీరుపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ఈ చర్చకు కేంద్రబిందువుగా మారాయి. ప్రజాస్వామ్యంలో వ్యవస్థల పట్ల విమర్శ ఉండటం సహజమే అయినా, ఆ విమర్శ విద్యా వ్యవస్థ ద్వారా విద్యార్థికి చేరేటప్పుడు ఏ తీరులోఉండాలి? అది వ్యవస్థను సంస్కరించేలా ఉండాలా లేక వ్యవస్థపై సమూలమైన అవిశ్వాసాన్ని నాటేలా ఉండాలా? అనే ప్రశ్నలు ఇప్పుడు మేధావులను తొలిచేస్తున్నాయి. ప్రజాస్వామ్యం అనేది ప్రధానంగా మూడు స్తంభాలపై నిలబడుతుంది. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ. ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతింటే అది రాజ్యాంగ విచ్ఛిన్నానికే దారితీస్తుంది. ఇందులో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకమైనది. పౌరుల ప్రాథమిక హక్కులకుభంగం కలిగినా, రాజ్యాంగ విలువలపై దాడి జరిగినా అండగా నిలిచేది న్యాయస్థానమే. అటువంటి వ్యవస్థ గురించి పాఠ్య పుస్తకాల్లో రాసేటప్పుడు రచయితలు అత్యంత సున్నితత్వంతో వ్యవహరించాలి. పాఠ్యపుస్తకం అనేది విద్యార్థికి వ్యవస్థల పట్ల ప్రాథమిక అవగాహనను కల్పించే తొలి మెట్టు. ఈ దశలో వ్యవస్థలోని లోపాలను సాధారణీకరణ చేస్తూ బోధించడం వల్ల విద్యార్థి మనసులో ఒక రకమైన నిరాశావాదం అంకురిస్తుంది. వ్యవస్థ అంటేనే అవినీతి అని, అక్కడ సామాన్యుడికి చోటులేదని బాల్యంలోనే నూరిపోస్తే, భవిష్యత్తులో వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎలా ఎదగగలరు? ఇక్కడ విద్యావ్యవస్థ తన బాధ్యతను గుర్తించాలి. విద్యార్థికి 'విమర్శనాత్మక ఆలోచన' నేర్పడం అంటే వ్యవస్థను ద్వేషించడం నేర్పడం కాదు. విమర్శనాత్మక ఆలోచన అంటే ఒక సమస్యను వివిధ కోణాల్లో విశ్లేషించడం, వాస్తవాలను గ్రహించడం, మెరుగైన పరిష్కారాల కోసం ఆలోచించడం. కానీ, దురదృష్టవశాత్తు కొన్ని పాఠ్యాంశాలు వ్యవస్థలను కేవలం ఒకే కోణంలో, అది కూడా ప్రతికూల కోణంలో చూపిస్తున్నాయి. ఇది విద్యార్థి మేధస్సును వికసింపజేయడానికి బదులు, సంకుచిత భావజాలంలోకి నెట్టివేస్తుంది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ పలు సందర్భాల్లో చెప్పినట్లుగా, రాజ్యాంగ వ్యవ



స్థలపై నిరాధారమైన ఆరోపణలు ప్రజాస్వామ్య ఆరోగ్యానికి చేటు చేస్తాయి. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకమే ఆ వ్యవస్థకు అసలైన బలం. ఆ నమ్మకాన్ని విద్యా దశలోనే దెబ్బతీయడం వల్ల సామాజికంగా భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. సామాజిక కోణంలో చూస్తే, ఒక దేశపు స్థిరత్వం ఆ దేశ ప్రజలు తమ వ్యవస్థల పట్ల కలిగి ఉండే గౌరవంపై ఆధారపడి ఉంటుంది. పాఠ్యపుస్తకం ఇతర వ్యవస్థల పట్ల 'గౌరవం'తో కూడిన 'హేతుబద్ధత'ను నేర్పాలి. ఉదాహరణకు, న్యాయవ్యవస్థలో కేసులు ఆలస్యం అవుతున్నాయనే అంశాన్ని చర్చించేటప్పుడు, దానికి గల కారణాలను, పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని, మౌలిక సదుపాయాల లోటును కూడా వివరించాలి. అలాకాకుండా, కేవలం న్యాయం దొరకదని చెప్పడం వల్ల విద్యార్థికి వ్యవస్థపై విముఖత కలుగుతుంది. దీనివల్ల రేపటి రోజున పౌరులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ప్రమాదం ఉంటుంది. చట్టబద్ధమైన పాలన అనేది పరస్పర విశ్వాసంపైనే ఆధారపడి ఉంటుంది. అక్షరం గాయపరచవచ్చు లేదా నయం చేయవచ్చు. పాఠ్యపుస్తక రచయితలు ఈ అక్షర శక్తిని వ్యవస్థలను నిర్వీర్యం చేయడానికి కాకుండా, వ్యవస్థలను పటిష్టం చేసే దిశగా మలచాలి. ఈ క్రమంలో పాఠ్యపుస్తకాల తయారీ ప్రక్రియలో భారీసంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. కేవలం ఒకే వర్గానికి చెందిన విద్యావేత్తలే కాకుండా, న్యాయ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు, వివిధ రంగాల నిపుణుల భాగస్వామ్యంతో పాఠ్య రచన జరగాలి. పాఠ్యం అనేది ఒక 'ఏకపక్ష ప్రసంగం'లా ఉండకూడదు, అది ఒక 'సంవాదం'లా ఉండాలి. ఒక సమస్యను విద్యార్థి ముందు ఉంచి, ఆ సమస్య పరిష్కారంలో వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించి, విద్యార్థి ఆలోచనకు పదును పెట్టాలి. అంతే తప్ప, వ్యవస్థ విఫలమైందనే ముగింపును పాఠ్యమే ఇచ్చేయకూడదు. రాజ్యాంగం పట్ల ప్రాథమిక విధేయతను, గౌరవాన్ని పెంపొందించడం విద్యావ్యవస్థ ప్రాథమికకర్తవ్యం. విమర్శ అనేది ఆ చట్రంలోనే జరగాలి. ముగింపుగా చెప్పాలంటే, పాఠం బలపడితేనే పౌరుడు బలపడతాడు, పౌరుడు సమతుల్యంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుంది. విమర్శ ఉండాలి కానీ అది బాధ్యతాయుతంగా, పరిష్కార దిశగా ఉండాలి. పాఠ్యపుస్తకం విద్యార్థికి ఒక 'క్రిటికల్ విజన్' ఇవ్వాలే తప్ప, 'నెగటివ్ విజన్' ఇవ్వకూడదు. అక్షరం అనేది ఒక దీపం వంటిది. అది దారి చూపాలి తప్ప, ఇల్లే కాలిపోయేలా చేయకూడదు. పాఠ్యపుస్తకాల వివాదం ఈ దిశగా ఒక పెద్ద హెచ్చరిక. వ్యవస్థల పట్ల విశ్వాసాన్ని కాపాడుకుంటూనే, లోపాలను ఎత్తిచూపే ఒక ఆరోగ్యకరమైన విద్యా విధానాన్ని రూపొందించుకోవాల్సిన సమయం ఇది. వ్యవస్థపై విశ్వాసం లేని అక్షరం, పౌర సమాజానికి శాపం. అక్షర బాధ్యతను గుర్తించినప్పుడే అక్షరం ఆయుధమవుతుంది, సమాజం విజ్ఞానమయమవుతుంది. "పాఠం నేర్పే అక్షరం. వ్యవస్థను ప్రశ్నించే చైతన్యాన్ని ఇవ్వాలి కానీ, ఆవ్యవస్థ పునాదులనే కూల్చివేసే అవిశ్వాసాన్ని కాదు! •

మన విఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 4 రాష్ట్రాల ఎన్నికలకు ఇసి రెడీ




**ఈ వారంలో షెడ్యూల్ రావచ్చంటున్న అధికారులు**

**అసోం, కేరళ, తమిళనాడు, బెంగాల్‌తోపాటు పుదుచ్చేరి అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలు**

**న్యూఢిల్లీ, మార్చి 9:** దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం సంకేతాలిచ్చింది. అసోం, కేరళ, తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందని సమాచారం. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని పూర్తి స్థాయి ఎన్నికల సంఘం బృందం బెంగాల్‌లో పర్యటిస్తోంది. ఆ బృందంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కూడా ఉన్నారు.బెంగాల్‌లో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన తర్వాత ఈ బృందం మార్చి 10న ఢిల్లీకి తిరిగి వెళ్లనుంది. అక్కడ ఎన్నికల ఏర్పాట్లపై అన్ని రాష్ట్రాల్లో సమీక్ష పూర్తి చేసిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముందని ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొన్నాయి. అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహకాలను ఎన్నికల కమిషన్ పరిశీలించింది. ఇప్పుడుబెంగాల్ సమీక్ష అనంతరం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఆ నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితులు కూడా ముగింపుదశకు చేరాయి. అసోం అసెంబ్లీ గడువు మే 20న ముగియనుంది. కేరళ అసెంబ్లీ కాలపరిమితి మే 23న ముగుస్తుంది. తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుండగా, బంగాల్ అసెంబ్లీ కాలపరిమితి మే 7న ముగియనుంది. అలాగే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో జరిగే ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఆ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించగలుగుతారు. రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీంతో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడగలుగుతామని అధికారులు చెబుతున్నారు. ఇంతకుముందు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ విధానం అమలు చేసిన రాష్ట్రంగా బిహార్ నిలిచింది. గత ఏడాది చివర్లో అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేశారు. అంతకు ముందు వరకు కీలక పోలింగ్ కేంద్రాలతో పాటు మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 50 శాతం వరకు మాత్రమే వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి ఉండేది. ఇక ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసే సమయంలో స్థానిక పండుగలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘాన్ని కోరాయి. ముఖ్యంగా అస్సాంలో జరిగిన సమావేశంలో పలువురు రాజకీయ పార్టీలు ఎన్నికలను ఒక దశలో లేదా గరిష్టంగా రెండు దశల్లో నిర్వహించాలని సూచించినట్లు సమాచారం. అసోం త్వరలో జరగబోయే బిహు పండుగను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తేదీలను నిర్ణయించాలని పార్టీలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ సూచనలను ఎన్నికల సంఘం గమనించిందని వర్గాలు తెలిపాయి. ఇక ఓటర్ల భాగస్వామ్యం పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఓటర్లను చురుకుగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఆయుధాల దిగుమతిలో భారత్ టాప్-2

**న్యూఢిల్లీ, మార్చి 9:** ప్రపంచంలో ఆయుధాలు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో ఇండియా రెండో స్థానంలో ఉన్నట్లు ఆయుధాల దిగుమతిపై స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా నివేదిక విడుదలచేసింది.2021 నుంచి 2025 వరకు అయిదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా 8.3 శాతం ఆయుధాలు దిగుమతి చేసుకున్న దేశంగా భారత్ నిలిచినట్లు సిప్రి పేర్కొన్నది. ఇక అత్యధిక సంఖ్యలో ఆయుధాలు దిగుమతి చేసుకున్న దేశాల్లో ఉక్రెయిన్ నిలిచింది. రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్ గత అయిదేళ్లలో 9.7 శాతం ఆయుధాలను దిగుమతి చేసుకున్నట్లు సిప్రి రిపోర్టులో వెల్లడించారు. ట్రెండ్స్ ఇన్ ఇంటర్నేషనల్ ఆర్మ్స్ ట్రాన్స్‌ఫర్ 2025 టైటిల్‌తో సిప్రి తన రిపోర్టును రిలీజ్ చేసింది. కానీ గత రికార్డులతో పోలిస్తే భారత్‌లో ఆయుధాల దిగుమతి తగ్గినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2016 నుంచి 2020, ఆ తర్వాత 2021 నుంచి 2025తో పోలిస్తే భారత్ ఆయుధాలు దిగుమతి చేస్తున్న సంఖ్య 4 శాతం పడిపోయినట్లు సిప్రి తన నివేదికలో చెప్పింది.



అయితే ఇటీవల ఆయుధాలను డిజైన్ చేసి, ఉత్పత్తి చేసే అంశంలో భారత్ తన సామర్థ్యాన్ని పెంచుకున్నది, దాని వల్లే దిగుమతి తగ్గినట్లు సిప్రి అభిప్రాయపడింది. ఓ ప్రణాళిక ప్రకారం భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నట్లు చెప్పారు. ఫ్రాన్స్ నుంచి సుమారు 140 యుద్ధ విమానాలు, జర్మనీ నుంచి జలాంతర్గామిని తెప్పించేందుకు భారత్ ప్రయత్నిస్తున్నది. భారత్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న అగ్రదేశాల్లో రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ ఉన్నాయి. రష్యా నుంచి ఆయుధాలు దిగుమతి చేస్తున్న సంఖ్య తగ్గిపోయింది. 2011-15 మధ్య ఆయుధ దిగుమతి 70 శాతంగా ఉండేది. కానీ ఆ తర్వాత 2016 నుంచి 2020 వరకు దిగుమతి 51 శాతానికి పడిపోయింది, ఆ తర్వాత 2021 నుంచి 2025 వరకు 40 శాతానికి తగ్గినట్లు సిప్రి తన నివేదికలో చెప్పింది. ఇక 202125 మధ్య కాలంలో ఫ్రాన్స్ నుంచి 29 శాతం, ఇజ్రాయెల్ నుంచి 15 శాతం ఆయుధాలను దిగుమతి చేశారు. చైనా, పాకిస్తాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకున్నట్లు రిపోర్టులో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగుమతుల్లో పాకిస్తాన్ ఐదో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. ఆ దేశం సుమారు 4.2 శాతం ఆయుధాలను దిగుమతి చేసింది. చైనా తన 80 శాతం ఆయుధాలను టర్కీకి సరఫరా చేస్తోంది. ఇక పాకిస్తాన్‌కు రెండో అతిపెద్ద సరఫరాదారుడిగా నెదర్లాండ్స్ కొనసాగుతున్నది. అయితే ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఆయుధాలు సరఫరా చేస్తున్న దేశాల్లో అమెరికా ఉన్నది. గ్లోబల్‌గా ఆ దేశం నుంచి 42 శాతం ఆయుధాలు సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. మొత్తం 99 దేశాలకు అమెరికా ఆయుధాలను సరఫరా చేసింది.

## శత్రువులకు మద్దతుగా నిలిస్తే ఆస్తులు సీజ్‌చేస్తాం

**ప్రవాస ఇరానీయులకు ఇరాన్ సర్కార్ హెచ్చరిక**

**టెహ్రాన్, మార్చి 9:** విదేశాల్లో ఉంటున్న తమ దేశ పౌరులకు ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. తమ శత్రువులకు మద్దతుగా నిలిస్తే ఇరాన్‌లోని వారి ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ అటార్నీ జనరల్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన చేసింది. ఈ ఆదేశాల ప్రకారం విదేశాల్లో ఉంటున్న ఇరాన్ పౌరులు ఆ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించకూడదు. శత్రువులకు సహకరించడం, మద్దతు తెలపడం వంటివి చేయకూడదు. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికాలకు అనుకూలంగా ఉండకూడదు. ఒకవేళ అలా చేస్తే ఇరాన్‌లోని వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం. శత్రువుల చర్యలను సమర్థించినా, సహకరించినా ఇదే అమలవుతుంది. చట్ట ప్రకారం వారి ఆస్తులను సీజ్ చేస్తామని తెలిపింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వారిని శత్రువుల కింద పరిగణించి, వారి ఆస్తులను జప్తు చేసే అధికారం తమకు ఉందని వెల్లడించింది. ఇంటెలిజెన్స్, గూఢచర్యం వంటి వాటికి పాల్పడినా ఇదే గతి పడుతుందని హెచ్చరించింది. ఇజ్రాయెల్, అమెరికా ప్రభుత్వాలతో కలిసి పని చేయకూడదని కూడా సూచించింది.

## మహారాష్ట్రలో ఆటోల రిజిస్ట్రేషన్లు నిలిపివేత



**ముంబయి, మార్చి 9:** మూడు చక్రాల ఆటోరిక్షాలపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ఆటోరిక్షాలకు అనుమతుల మంజూరును నిలిపివేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ ప్రకటించారు. తాజా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా దీనిపై ప్రకటన చేశారు. రాష్ట్రంలో మూడు చక్రాల ఆటోరిక్షాలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, అందువల్ల నగరాల్లోని రోడ్ల సామర్థ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని కొత్త ఆటోలకు అనుమతుల మంజూరును నిలిపివేశామని ప్రభుత్వం తెలిపింది. 2025-26 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం మహారాష్ట్రలో 12.96 లక్షలు రిజిస్టర్డ్ త్రీ వీలర్ ఆటోలున్నాయి. ముంబై మెట్రో నగరంలోనూ అధికంగా ఆటోలున్నాయి. గరిష్ట స్థాయిని మించిపోయాయి. ముంబైలో సగటున ఒక కిలో మీటర్‌కు 2,648 ఆటోలు రోడ్లపై తిరుగుతున్నట్లు ఆర్టీవో డాటా తేల్చింది. ఇది ఇండియాలోని అన్ని మెట్రో నగరాలకంటే అత్యధికం. ముంబై చుట్టుపక్కల ప్రాంతాల్లోనే 2.5 లక్షల ఆటోలు ఉన్నాయి. దీంతో నగరంలో లేన్ టు వెహికల్ స్థాయి మించిపోయింది. పార్కింగ్‌కు కూడా సమస్యలొస్తున్నాయి. ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. పర్యావరణానికి కూడా హాని కలుగుతోంది. ఇప్పటికే ముంబైలో వాయు కాలుష్యం ఎక్కువైంది. ప్రస్తుతం ఏక్యూఐ 170 200 వరకు ఉంది. ఇది అనారోగ్య స్థాయి. సగటున 50100 వరకు ఉండాలి. సీఎన్‌జీ ఆటోలతో కూడా ఎక్కువ వాయు కాలుష్యం అవుతోంది. ఈ నేపథ్యంలోనే కాలుష్యాన్ని తగ్గించేందుకు ముంబై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెట్రో కారిడార్ పెంపు, ఎలక్ట్రిక్ బస్సులవైపు దృష్టిసారించింది. అలాగే కొత్త ఆటోలకు అనుమతి నిరాకరించింది. ఈ చర్యల వల్ల ట్రాఫిక్ తగ్గడం, కాలుష్యం తగ్గడంతోపాటు ఆటో రిక్షా నడిపే వారి ఆదాయం కూడా పెరుగుతుంది. అలాగే ఆటోలకు సంబంధించి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించే వీలుంటుంది. కొత్త ఆటోలు రాకపోవడంతో ఇప్పుడున్న వాటి ద్వారా డ్రైవర్లకు మెరుగైన ఆదాయం లభిస్తుంది.

## 67వేలమంది గల్ఫ్ భారతీయులు స్వదేశానికి

**న్యూఢిల్లీ, మార్చి 9:** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి నుంచి ఇప్పటివరకు 67 వేల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. ఇవాళ ఆయన రాజ్యసభలో పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై ఒక ప్రకటన చేశారు. సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ, భారతీయుల భద్రతకు, వారిని వెనక్కి తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లోని గగనతలాన్ని పాక్షికంగా తెరిచిన ప్రతీసారి, వాణిజ్య విమానాలతో పాటు ప్రత్యేక విమానాల ద్వారా భారతీయులను వెనక్కి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ నాటికి ఈ సంఖ్య 67వేలకు చేరిందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించడం గమనార్హం. వారి నిరసనల మధ్యే జైశంకర్ తన ప్రకటనను పూర్తి చేశారు. ఇరాన్‌లో ఉద్రిక్తతలు పెరగడంతో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి విద్యార్థులకు, ఇతర పౌరులకు సహాయం అందించడానికి చర్యలు తీసుకుందని జైశంకర్ వివరించారు. పలువురు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. వ్యాపార నిమిత్తం ఇరాన్‌లో ఉన్న భారతీయులు, పొరుగున ఉన్న అర్మేనియాకు వెళ్లి అక్కడి నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## టివికెచీఫ్ విజయ్‌కు సిబిఐ మరోసారి సమన్లు

**చెన్నై, మార్చి 9:** గత సంవత్సరం కరూర్ తొక్కిసలాటకు సంబంధించిన కేసులో ప్రముఖ నటుడు, టీవీకే అధినేత విజయ్‌కి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 10 విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది. ఈ కేసులో విజయ్‌ని సీబీఐ గతంలో విచారించింది. తాజాగా మరోసారి విచారించడానికి సమన్లు జారీ చేసింది. జనవరి నెలలో రెండు పర్యాయాలు సీబీఐ అతనిని విచారించింది. గత సంవత్సరం సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ కేసును దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థ విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా జనవరిలో విజయ్‌ని ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారించింది.

## రాష్ట్రపతికి గౌరవం ఇవ్వనిది మీరా, నేనా?

### మోడీకి మమత ఒక్కఫోటోతో సమాధానం



**కోల్‌కత్తా, మార్చి 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ మధ్య రాజకీయ వివాదం మరోసారి తారస్థాయికి చేరింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తమ ప్రభుత్వం అగౌరవం కలిగించిందంటూ ప్రధాని చేసిన విమర్శలకు సీఎం మమత ఒక పాత ఫోటోతో ఘాటుగా బదులిచ్చారు. రాష్ట్ర పతి నిలబడి ఉండగా ప్రధాని కూర్చున్న ఫోటోను చూపిస్తూ అసలు గౌరవం ఇవ్వనిది ఎవరని ఆమె నిలదీశారు. మార్చి 7న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బెంగాల్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా బాగ్డోగ్రా విమానాశ్రయంలో తనకు స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి గానీ, కేబినెట్ మంత్రులుగానీ రాకపోవడంపై రాష్ట్రపతి అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ, టీఎంసీ ప్రభుత్వం ఒక గిరిజన మహిళా రాష్ట్రపతిని తీవ్రంగా అవమానించిందని, ఇది సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఆరోపణలను సీఎం మమత తీవ్రంగా ఖండించారు.

## సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌పై విపక్షాల అభిశంసన తీర్మానం



**న్యూఢిల్లీ, మార్చి 10:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా బ్లాక్ పార్టీలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో అభిశంసన ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన ఇండియా బ్లాక్ పార్టీల సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ నేత శతాబ్దిరాయ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. అలాగే పార్లమెంటు ఉభయ సభల్లోని విపక్ష ఎంపిలు కనీసం లోకసభ నుంచి వంద మంది, రాజ్యసభ నుంచి 50 మంది సభ్యుల నుంచి సంతకాలు సేకరించనున్నారు. పశ్చిమబెంగాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ జరిగిన విషయం తెలిసిందే. టిఎంసి అధినేత్రి, ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాష్ట్రంలో సిర్‌కు వ్యతిరేకంగా నిరంతరాయంగా నిరసనలు కొనసాగుతున్న విషయం కూడ తెలిసిందే. అయితే ఓటర్ల జాబితా సవరణ అంశంలో కేంద్ర ఎన్నికల సంఘానికి, ఆ రాష్ట్రానికి మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. సిర్ గురించి బెంగాల్ సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించడం పట్ల సిఇసి జ్ఞానేశ్ ఆగ్రహంగా ఉన్నట్లు తృణమూల్ నేతలు ఆరోపిస్తున్నారు. తమ పార్టీ బృందంపై సిఇసి జ్ఞానేశ్ కేకలు వేశారని, దీన్ని తాము సీరియస్‌గా తీసుకోనున్నట్లు టిఎంసి నేత చంద్రిమ భట్టాచార్య అన్నారు. ఆదివారం కోల్‌కతా వెళ్లిన ఎన్నికల సంఘం బృందానికి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. కాళీఘాట్ దర్శనానికి వెళ్లిన సమయంలో సిఇసికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కానీ ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ కాళీమాత ఆశీస్సులు రాష్ట్ర ఓటర్లపై ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## రూ.923కోట్ల విలువైన బంగారం అమెరికాకు..



**వాషింగ్టన్, మార్చి 10:** అమెరికాపై కనకవర్షం కురుస్తోంది. వెనిజులా నుంచి 100 మిలియన్ డాలర్ల (రూ. 923 కోట్లు) విలువైన బంగారం యుఎస్‌కు వచ్చింది. ఈ విషయాన్ని అగ్రరాజ్య హోమ్ మంత్రి డగ్‌బర్గమ్ ధ్రువీకరించారు. 'శుక్రవారం ఆ బంగారం వచ్చింది. ఇంకా ఆ దేశంలో 500 బిలియన్ డాలర్ల విలువైన బంగారం వనరులు ఉన్నాయి' అని వెల్లడించారు. వెనిజులా ప్రభుత్వ ఆధ్వర్యంలోని బంగారం మైనింగ్ కంపెనీ మినర్వెన్‌తో లావాదేవీలకు అనుమతిస్తూ అమె రికా ఇప్పటికే లైసెన్స్ జారీ చేసింది. ఆ సంస్థతో కలిసి తవ్వకాలు చేపట్టింది. ఇటీవల వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌తో బర్గమ్ భేటీ అయ్యారు. అలాగే అమెరికా మైనింగ్, మినరల్ కంపెనీలతోనూ చర్చలు జరిపారు. ఈ పరిణామాల తర్వాతే మంత్రి స్పందన వచ్చింది. ఖనిజ సంపన్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు భద్రత కల్పిస్తామని డెల్సీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో గెరిల్లా దళాలు, ఇతర వర్గాలు చురుగ్గా ఉంటాయి. ఇక, తాజా లైసెన్స్ కింద ఉత్తరకొరియా, రష్యా, ఇరాన్, క్యూబాకు చెందిన వ్యక్తులు, సంస్థలతో మినర్వెన్ ఒప్పందాలు చేసుకోవడంపై నిషేధం ఉంది.
వెనిజులాలో సమృద్ధిగా ఉన్న కీలక ఖనిజాలపై చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కొనేలా ట్రంప్ యంత్రాంగం ఈ చర్యలు తీసుకుంటోంది. డ్రగ్స్ అక్రమ రవాణా పేరు చెప్పి ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను అమెరికా బంధించి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీనివెనక ప్రధాన ఉద్దేశం చైనాను ఈ దేశాలకు దూరం పెట్టడమే. లాటిన్ అమెరికా దేశాల్లో డ్రాగన్ ప్రాబల్యం క్రమంగా పెరుగుతూ వస్తోంది. అది అగ్రరాజ్యాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. దాంతో ఆయా దేశాల్లో వనరులను నియంత్రణలోకి తెచ్చుకునేందుకు తన అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకునే పనిలో ఉంది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేని



**టెహ్రాన్, మార్చి 9:** ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయ తొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హుస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది. ఇం దులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకు న్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తిచేసింది. అతడు ఎప్పటినుంచి బాధ్యతలు స్వీక రిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి.

## అమెరికా కీలక వ్యవస్థలపై ఇరాన్ సైబర్ దాడులు



**వాషింగ్టన్, మార్చి 9:** ఇరాన్‌పై జరిగిన దాడుల తర్వాత అమెరికా కీలక వ్యవస్థలపై సైబర్ ముప్పు తీవ్రమైంది. ఆ దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే 60కి పైగా ఇరాన్ అనుకూల హ్యాకింగ్ గ్రూపులు ఆన్‌లైన్ వేదికగా అమెరికాపై దాడులకు సిద్ధమైనట్లు ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ సోమవారం విడుదల చేసిన రిపోర్టులో వెల్లడించింది. ఈ హ్యాకర్లంతా టెలిగ్రామ్ వేదికగా ఎలక్ట్రానిక్ ఆపరేషన్స్ రూమ్‌ను ఏర్పాటు చేసుకుని, తమ టార్గెట్లను పంచుకుంటున్నట్లు పరిశోధకులు గుర్తిం చారు. ప్రభుత్వ ఆదేశాల కంటే కూడా సైద్ధాంతిక కారణాలతోనే వీరు ఏకమవుతుండటంతో ఈ దాడులను అంచనా వేయడం, అడ్డుకోవడం కష్టంగా మారిందని నివేదిక పేర్కొంది. అమెరికాలోని పవర్ గ్రిడ్లు, వాటర్ సప్లై నెట్‌వర్క్‌లు, ఉత్పాదక సంస్థలను నియంత్రించే సుమారు 40 వేలకు పైగా ఇండస్ట్రియల్ కంట్రోల్ సిస్టమ్స్ (ఐసీఎస్) పబ్లిక్ ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయి ఉన్నాయని, వీటికి కనీస పాస్‌వర్డ్ భద్రత కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఈ సైబర్ దాడులు చేయడం హ్యాకర్లకు మరింత సులువుగా మారిందని క్లౌడ్‌సెక్ పరిశోధకులు తెలిపారు.

## బహ్రెయిన్ ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడి



**మనామా, మార్చి 9:** ఇరాన్ యుద్ధం తీవ్రమవుతోంది. ముఖ్యంగా మధ్యప్రాచ్య దేశాలు ఈ యుద్ధం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఒకపక్క ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తుంటే.. ఇరాన్ మాత్రం గల్ఫ్ దేశాల్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. తాజాగా బహ్రెయిన్‌లోని ఒక ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడి చేసింది. అక్కడి ప్రభుత్వ ఆధ్వర్యంలోని బాప్కో ఎనర్జీస్ అనే సంస్థపై ఇరాన్ దాడి చేసింది. దీంతో ఈ చమురు శుద్ధి సంస్థకు భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకుముందు కూడా సౌదీలోని సౌదీ అరాంకో సంస్థపై ఇరాన్ దాడి చేసింది. ఇలా తమ దేశంలోని ఆయిల్ రిఫైనరీలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులకు దిగుతుండటంతో గల్ఫ్ దేశాల్లో ఆందోళన మొదలైంది. ఎందుకంటే ఆయా దేశాలకు ప్రధాన ఆదాయ వనరు చమురే. అలాంటిది అక్కడి చమురు సంస్థల్ని దెబ్బతీసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు రెండు రోజుల క్రితం ఇరాన్‌లోని చమురు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేసింది. దీంతో చమురు నిల్వ కేంద్రాలు, రిఫైనరీలకు భారీ నష్టం కలిగింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ చేసిన ఈ పనిపై అమెరికా అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ చమురు శుద్ధి కేంద్రాలను మిస్సైల్స్ ప్రయోగించేందుకు వాడు తోందని, అందువల్లే ఆ ప్రదేశాలపై దాడి చేయాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ చెప్పింది. ఏదేమైనా ఇరాన్, గల్ఫ్ కంట్రీస్‌లోని చమురు కేంద్రాలపై ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం వల్ల అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు మాత్రం పెరుగుతున్నాయి.

## ఇరాన్ నౌకకు కోచి ఎయిర్‌పోర్టులో ఆశ్రయం



**న్యూఢిల్లీ, మార్చి 9:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, కొచ్చి ఓడరేవులో తమ యుద్ధనౌకకు ఆశ్రయం కల్పించినందుకు భారత్‌కు ఇరాన్ కృతజ్ఞతలు తెలిపిందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో పశ్చిమాసియా పరిస్థితులపై ఆయన కీలక ప్రకటన చేశారు. శ్రీలంక సమీపంలో ఇరాన్‌కు చెందిన ఐఆర్ఐఎస్ దేనా యుద్ధనౌక అమెరికా జలాంతర్గామి దాడికి గురై మునిగిపోయిన సంగతి తెలిసిందే. సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న మరో ఇరాన్ యుద్ధనౌక ఐఆర్ఐఎస్ లావన్ భారత్ సాయం కోరింది. అందుకు భారత్ వెంటనే స్పందించి, కొచ్చి పోర్టులో డాక్ చేసేందుకు అంగీకరించింది. దీనిపై స్పందించిన జైశంకర్ 'ఫిబ్రవరి 20న ఇరాన్ మూడు నౌకల కోసం అనుమతి కోరగా, మార్చి 1న కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో మార్చి 4న కొచ్చికి చేరుకున్న ఆ నౌక సిబ్బందికి ప్రస్తుతం భారత నౌకాదళ కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తున్నాం. మానవతా దృక్పథంతో తీసుకున్న ఈ నిర్ణయం సరైనదేనని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 20,మార్చి 5 తేదీల్లో ఇరాన్ విదేశాంగమంత్రి అరాఘ్చీతో తాను మాట్లాడినట్లు ఆయన సభకు తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభంపై భారత్ మూడు విధానాలకు కట్టుబడి ఉందన్నారు. చర్చల ద్వారా శాంతిని నెలకొల్పడం, ఆ ప్రాంతంలో ఉన్న భారతీయుల భద్రత, అలాగే దేశ ఇంధనభద్రత, వాణిజ్య ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. మరోవైపు, జైశంకర్ ప్రకటన సమయంలో విపక్షాలు వ్యవహరించిన తీరుపై సభా నాయకుడు జేపీ నడ్డా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విపక్షాలకు జాతీయ ప్రయోజనాల కంటే రాజకీయాలు, సభలో గందరగోళం సృష్టించడం మీదే ఆసక్తిఎక్కువని విమర్శించారు. గతంలో వక్ఫ్ బిల్లు, బడ్జెట్ సమావేశాలు, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు కూడా విపక్షాలు ఇలాగే సభ నుంచి వాకౌట్ చేశాయని.ఆత్మనిర్భర్ భారత్‌పట్ల వారికి ఏమాత్రం చిత్తశుద్ధిలేదని నడ్డా ధ్వజమెత్తారు.

## మినాబ్ స్కూలుపై దాడిచేసింది అమెరికా తోమ్‌హాక్ క్షిపణి



**టెహ్రాన్, మార్చి 9:** అమెరికా-ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా గతనెల 28వ తేదీన ఇరాన్‌పై చేసిన దాడిలో దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ ప్రాంతంలో ఉన్న ఓ బాలికల స్కూల్‌పై క్షిపణి పడింది. ఆ పేలుడు ఘటనలో సుమారు 160 మంది వరకు విద్యార్థినులు మరణించారు. ఆ విషాద సంఘటన యావత్ ప్రపంచాన్ని కలిచివేసింది. ఆ దాడి వెనుక అమెరికా ఉన్నట్లు ఇరాన్ ఆరోపించగా, బాలికల స్కూల్‌పై తాము దాడి చేయలేదని ట్రంప్ అన్నారు. అయితే తాజాగా మినాబ్ స్కూల్‌పై మిస్సైల్ పడుతున్న ఘటనకు చెందిన ఓ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నది. ఆ వీడియో ఫుటేజ్ ఆధారంగా అది అమెరికా వాడే తోమాహాక్ క్షిపణిగా గుర్తించారు. మెహర్ న్యూస్ ఏజెన్సీ ఆ వీడియోను షేర్‌చేసింది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా అమెరికాకు చెందిన మీడియాసంస్థలు కూడా ఆ క్షిపణి అమెరికాదే అని నిర్ధారించాయి. స్కూల్ సమీపంలో ఉన్న ఐఆర్జీసీ నావల్ కాంప్లెక్స్‌ను టార్గెట్ చేసే క్రమంలో బహుశా ఆ క్షిపణి స్కూల్‌పై పడి ఉంటుందని ఓ ఆంగ్లపత్రిక తన కథనంలో చెప్పింది. ఇంటెలిజెన్స్ సమాచా రం వల్ల ఆ వైఫల్యం జరిగి ఉంటుందని మరో పత్రిక తన కథనంలో పేర్కొన్నది. ఇరాన్‌పై దాడిలో తోమాహాక్ క్షిపణులను వాడినట్లు అమెరికా చెబుతోంది. ఆ క్షిపణులు సుమారు 1600 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను చేధించగలవు. ప్రస్తుతం జరుగుతున్న వార్‌లో కేవలం అమెరికా వద్దే ఇలాంటి ఆయుధాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్ క్షిపణియే ఆ స్కూల్‌పై పడినట్లు ఇటీవల ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ వాదనలను ఖండిస్తూ ఈ వీడియోను రిలీజ్ చేశారు. తోమాహాక్ తరహాలోనే క్షిపణి ఉన్నట్లు అమెరికా వైమానిక దళ స్పెషల్ ఆపరేషన్స్ నిపుణుడు వెస్ బ్రాంట్ తెలిపారు. ఇరాన్ వద్ద ఇలాంటి క్షిపణులు లేవని మిడిల్‌బరీ కాలేజీ ప్రొఫెసర్ జెఫ్రీ లూయిస్ తెలిపారు.

## లెబనాన్‌పై దాడుల్లో ఫాస్ఫరస్ చల్లిన ఇజ్రాయెల్



**బీరూట్, మార్చి 9:** లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక పక్క ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ మరోవైపు లెబనాన్‌పై కూడా దాడులకు దిగింది. ఈ రెండు దేశాల మధ్య కూడా దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. వారం రోజుల నుంచి ఇరాన్ లెబనాన్‌పై దాడులకు పాల్ప డుతోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 400 మందికిపైగా లెబనాన్ ప్రజలు మరణించినట్లు ఆ దేశం ప్రకటించింది. లెబనాన్ రాజధాని బీరుట్‌పై కూడా దాడి చేసింది. ప్రజల నివాసాలపై కూడా మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో ఇప్పుడుఇజ్రాయెల్ చేసిన ఒక పని వివాదానికి కారణమైంది. లెబనాన్‌పై దాడుల్లో భాగం గా ప్రజల నివాసాలపై వైట్ ఫాస్ఫరస్ ప్రయోగించినట్లు తేలింది. ఈ నెల 3న లెబనీస్ పట్టణమైన యోమోర్‌పై జరిపిన దాడిలో ఇండ్లపై వైట్ ఫాస్ఫరస్ చల్లినట్లు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం గుర్తించింది. దీనికి సంబంధించిన ఆధారాల్ని కూడా సేకరించింది. దీని ద్వారా రెండు ఇండ్లు, ఒక కారు మంటల్లో చిక్కుకున్నాయి. అక్కడి ఫైర్ అధికారులు స్పందించి మంటలు ఆర్పేశారు. ఈ వైట్ ఫాస్ఫరస్ చల్లిన తర్వాత చిన్న నిప్పురవ్వ అంటుకున్నా మొత్తం మంటలు వ్యాపిస్తాయి. ఇలాంటి చర్యలకు అనుమతి ఉండదు.అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా ఇజ్రాయెల్ ఇలాంటి పని చేస్తుందని, దీనివల్ల తమ పౌరుల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉంటుందని లెబనాన్ అధికారులు అన్నారు. వీటి ద్వారా ఎవరైనా గాయాలపాలైనా వాటి ప్రభావం చాలాకాలం ఉంటుందని తెలిపారు. వైట్ ఫాస్ఫరస్‌ను బాంబులు, షెల్స్, రాకెట్లు వంటి వాటిలో వాడుతారు. ఈ కెమికల్ ఆక్సిజన్ రియాక్షన్‌కు గురైనా మంటలు అంటుకుంటాయి. అందుకే అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఈ కెమికల్‌ను వాడటం, పౌరులకు హాని చేయడం నేరం. మిలిటరీ కార్యక్రమాలకే దీన్ని వాడాలి.

# అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు స్వయం ప్రతిపత్తి

**విజయవాడ,మార్చి 9.ప్రభాతవార్తప్రతినిధి:** రాజధానిలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఏర్పాటు చేసిన అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎజిఐసిఎల్)కు స్వయం ప్రతిపత్తి కల్పించారు. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకూ సిఆర్‌డిఏ పరిధిలో ఉన్న ఎజిఐసిఎల్ ఇక నుండి నేరుగా పట్టణాభి వృద్ధి శాఖ ఆధ్వర్యాన పనిచేయనుంది. దీనికోసం స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తి రంగ సంస్థల లిస్టులో 25వ శాఖగా దీన్ని గుర్తించింది. 24వ శాఖగా రెరా ఉంది. దీనికోసం ఎపి పరిపాలనా నిబంధనలు 2018లోని రెండో షెడ్యూలుకు సవరణలు కూడా చేసింది. అమరావతి అబి వృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసే ప్రాజెక్టులతో ఎజిఐసిఎల్ నేరుగా ఒప్పందాలు చేసుకోవడం, చర్చలు జరపడం ద్వారా ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 166 క్లాజ్(2),(3) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి గవర్నర్ ఈ సవరణలు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక నుండి ప్రత్యేక ప్రాజెక్టుల రూపకల్పన, అమలు బాధ్యతలు కూడా ఎజిఐసిఎల్ చూస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణం కోసం 2014 డిసెంబర్లో జిఓ ఇవ్వడంతోపాటు అప్పటి వరకూ ఉన్న ఉడాని క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సిఆర్‌డిఏ)గా మార్పు చేశారు. అనంతరం అమరావతి డెవలప్‌మెంట్ కంపెనీ, అమరావతి బిల్డింగ్ కనస్ట్రక్షన్ అండ్ మెయింటినెన్స్ కంపెనీ అమరావతి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ, అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్, స్కిల్ అకాడమీ, అమరావతి యుటిలిటీస్ కంపెనీ, అమరావతి గ్రోత్ కారిడార్ కంపెనీ, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ, యుటిలిటీస్ కంపెనీ, పవన్ కంపెనీ, అమరావతి అర్బన్ ప్లానింగ్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్ క్యాపిటల్ సిటీ డెవపల్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ సిసిడిఎంసి రవాణా కోసం అమరావతి మెట్రోరైల్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. వీటితోపాటు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎడిసిఎల్)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులను సిఆర్‌డిఏ, ఎడిసిఎల్ చూస్తున్నాయి. టెండర్లు, లావాదేవీలన్నీ కూడా ఆయా కంపెనీల ద్వారానే నిర్వహిస్తున్నారు. వీటితోపాటు గతేడాది అక్టోబరు ఏడోతేదీన ఎజిఐసిఎల్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొత్తగా ఈ సంస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించారు. దీంతో రెరా మాదిరిగానే ఇది కూడా స్వయంగా కార్యాకలాపాలు నిర్వహించనుంది. దీనికోసం ఇప్పటికే ఎమ్‌డిగా మాజీ ఐఎఎస్ శంటి వెంకట రత్న శ్రీనివాస్‌ను నియమించారు. ఎజిఐసిఎల్ ద్వారా రాజధాని పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, నీరుకొండలో ఎన్‌టిఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జి, స్పోర్ట్స్ సిటీ, రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, రోప్‌వే, ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. దీనిలో రివర్ ఫ్రంట్ ఏర్పాటుకు అవసరమైన డిపిఆర్ తయారీ కోసం కన్సల్టెన్సీని నియమించేందుకు టెండర్లను కూడా ఆహ్వానించారు.



# పిల్లలకు ధర్మం, సంస్కారం విలువలు నేర్పేది తల్లే

## - మహిళా దినోత్సవంలో టిటిడి జెఇఓ డాక్టర్ శరత్

**తిరుమల,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** కుటుంబ నిర్మాణం, సమాజ అభివృద్ధి, దేశ ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని టిటిడి జెఇఓ డాక్టర్ ఎ.శరత్ ఉద్ఘాటించారు. ప్రతి మనిషికి తల్లి మొదటి గురువని, పిల్లలకు ధర్మం, సంస్కారం, విలువలు నేర్పేది తల్లేనని పేర్కొన్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థకు మహిళ మూలస్తంభమని, పండితులకు వేదం ఎంత పవిత్రమో గృహాలకు గృహలక్ష్మి అంతే పవిత్రమని అభిప్రాయం వెలిబుచ్చారు. సోమవారం ఉదయం తిరుపతి మహతి కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని టిటిడి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెఇఓ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ తల్లి సద్గుణవంతురాలైతే కుటుంబం సుస్థిరంగా ఉంటుందని, కుటుంబం బాగుంటే సమాజం శాంతియుతంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సమాజం అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం కూడా ప్రగతి మార్గంలో ముందుకు సాగుతాయని అన్నారు. మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా మార్గదర్శకులుగా నిలుస్తారని వివరించారు. టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ సనాతన ధర్మంలో మహిళకు అత్యున్నత స్థానం కల్పించబడిందన్నారు. స్త్రీని దేవతగా పూజించే సంప్రదాయం భారతదేశానికి ప్రత్యేకమని తెలిపారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ సమాజ పురోగతికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. న్యూఢిల్లీకి చెందిన మిత్రావక్ , డిజిటల్ మహిళ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఓ ఆశ్లేష మాట్లాడుతూ మహిళల్లో అపారమైన శక్తి, చైతన్యం నిక్షిప్తమై ఉందన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ఉన్న గౌరవస్థానం ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. ఎక్కడ స్త్రీలను గౌరవిస్తారో అక్కడ సుఖశాంతులు, ఐశ్వర్యం వర్ధిల్లుతాయని పేర్కొన్నారు. డిఆర్‌డిఓ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రిక కౌశిక్ మాట్లాడుతూ సమాజంలో సానుకూల మార్పు రావాలంటే మహిళలు ముందుగా తమను తాము ప్రాధాన్యంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులు బాధ్యతలను పంచుకుంటే మహిళలపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఇంటి పనులు, పిల్లల సంరక్షణ వంటి బాధ్యతలను కుటుంబ సభ్యులు కలిసి పంచుకోవడం ద్వారా సమతుల్య జీవనం సాధ్యమవుతుందని సూచించారు. అనంతరం పద్మావతి అవార్డులు టిటిడిలోని పలు విభాగాల్లో విశేష సేవలు అందిస్తున్న 32 మంది మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా ప్రదానం చేశారు. వారిని శాలువాతో సత్కరించి, ఐదు గ్రాముల వెండి డాలర్ ,పద్మావతి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు.రాబోయే ఏడాది కాలంలో పదవీ విరమణ చేయనున్న 78 మంది మహిళా ఉద్యోగులను కూడా శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్, గాత్ర సంగీత పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కృష్ణవేణి, టిటిడి పిఆర్ఓ పి. నీలిమ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఓ ఆనందరాజు, పలువురు మహిళా డిప్యూటీ ఇఓలు, ఇతర అధికారులు ,మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# నేడు శృంగేరి మఠం భవనం ప్రారంభించనున్న కంచి స్వామి

**శ్రీకాళహస్తి,మార్చి 9 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కంచి స్వామి రెండు రోజుల పాటు పర్యటించనున్నారు.ఈ మేరకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తుంది. శృంగేరి శారదా పీఠాధిపతి అనంత శక్తి జగద్గురు శంకరాచార్య భారతీ తీర్థ మహాస్వామి అనుగ్రహంతో తత్కరకమల సంజాత అనంత విభూషిత జగద్గురు విధుశేఖర భారతీ స్వామి శ్రీకాళహస్తి విజయయాత్ర కార్యక్రమాలను ఖరారు అయినట్లు తెలిసింది.

**నూతన భవనం ప్రారంభం:** పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో గతంలో శివయ్య పాదాల చెంత కంచిపీఠానికి సంబంధించి వృద్ధాశ్రమాన్ని నిర్వహించే వారు.అయితే దేవస్థానం ప్రయోజనాల దృష్ట్యా ఈ స్థలాన్ని దేవస్థానంకు అప్పగించారు. ఇక్కడ ఉన్న వృద్ధులకు దేవస్థానం అతిథి గృహాల్లో నివాసం కల్పించారు. ప్రత్యామ్నాయంగా గంగా సదన్ వద్ద ప్రత్యేక వృద్ధాశ్రమం నిర్మిస్తామంటూ భరోసా ఇచ్చిన దేవాదాయ శాఖ ఏడేళ్ళు గడచిని పట్టించుకోవటం లేదు. అయితే ఇక్కడి శుకబ్రహ్మాశ్రమంకుస మీపంలో శృంగేరి పీఠం ప్రత్యేకంగా స్థలాన్ని కొనుగోలు చేసారు. ఇక్కడ ప్రత్యేక భవనం నిర్మించారు.ఈ భవనాన్ని పీఠాధిపతి పర్యటన సందర్భంగా ప్రారంభించనున్నారు. ఈ నేపధ్యంలో కార్యక్రమాలను ఖరారు చేసారు. భవిష్యత్తులో ఈ భవనం ద్వారా కంచిపీఠం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిసింది.ఇందులో వేదపాఠశాల,అమ్మవారి విగ్రహం, బ్రాహ్మణులకు భోజన వసతి కల్పించుటకు ప్రణాళికలు సిద్ధం చేసారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి పర్యటన ఇలా సాగనుంది. మంగళవారం సాయంత్రం 6గంటలకు జగద్గురు ఆగమనం, జలవినాయక ఆలయం వద్ద దేవస్థానం మర్యాదలతో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. స్వామి దేవాలయ ధూళి దర్శనం. తదనంతరం రాత్రి దేవస్థానంకు అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలోని గంగా సదన్‌లో జగద్గురు జరుపుకునే చంద్ర మౌళీశ్వరపూజలు మార్చి 11 బుధవారం ఉదయం 10గంటలకు శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం,విశేష అభిషేకాలు, అర్చనలు 11గంటలకు గంగా సదన్‌లో జగద్గురు వందన సభ అనుగ్రహ భాషణం, భక్తులకు దర్శనం,పాదపూజలు, మధ్యాహ్నం 12.30గంటల నఉంచి భక్తులకు భోజన ప్రసాదాలు,సాయంత్రం 5గంటలకు తిరుపతి పయనం ఏర్పాటు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు.



కంచి శృంగేరి పీఠాధిపతిచే ప్రారంభించనున్న భవనం

# జాతీయస్థాయిలో అత్యున్నత స్థానమే లక్ష్యం

## - వినియోగదారులకు మెరుగైన సేవల కోసం వ్యూహాత్మక కార్యాచరణ

**తిరుపతి,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నమ్మకమైన, అందుబాటు ధరలతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం, మెరుగైన సేవలను అందించాలన్న సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించిందని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్‌లోతేటి తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులను విస్తృతంగా ప్రోత్సహించేందుకు సమగ్ర వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించింది. శుభ్రమైన, పర్యావరణ హితమైన, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ సరఫరా అంశంలో జాతీయస్థాయిలో అత్యుత్తమ విద్యుత్ పంపిణీ సంస్థగా ఎదగాలనే లక్ష్యంతో ఎస్పీడిసిఎల్ పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో పిఎం కుసుమ్ 2పథకం కింద ఫీడర్ స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టుల అమలుకు 2026-27 నుంచి 2029-30 ఆర్థిక సంవత్సరాల వరకు ప్రతియేటా 550 మెగావాట్ల సామర్థ్యం ఏర్పాటుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు శివశంకర్ లోతేటి తెలిపారు. అదనంగా 500 మెగావాట్లు / 1000 మెగావాట్ గంటల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తొలి దశ అమలులో ఉందని ఆయన వెల్లడించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలు, పునరుత్పాదక ఇంధన వనరుల సాంకేతికతల ప్రభావంపై నిపుణుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి సిఎండి దేశంలోని ప్రముఖ ఇంధన సామర్థ్య నిపుణులు, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ, మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అజయ్ మాథూ ర్‌తో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్యతో పాటు చీఫ్ జనరల్ మేనేజర్లు, ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ మాథూర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఎస్పిడిసిఎల్ వంటి సమర్థ వంతమైన డిస్కమ్‌లకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహం, విద్యుత్ పంపిణీ సంస్థల సామర్థ్యాల బలోపేతం, ఇంధన సామర్థ్య సాంకేతికతల వినియోగం వంటి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గాన్ని దేశంలో తొలి నెట్-జీరో నమూనా నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నట్లు సిఎండి తెలిపారు. "మోడల్ గ్రీన్ నియోజక వర్గం"గా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రణాళిక ద్వారా పునరుత్పాదక ఇందన వనరుల స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యమన్నారు. కుప్పం మోడల్ గ్రీన్ నియోజకవర్గంలో చేపట్టిన ముఖ్య కార్యక్రమాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు లబ్ధి చేకూరేలా 4.36 మెగావాట్ల సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసి , 39.75 మెగావాట్ సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఏర్పాటు చేసి 40,671 బీసీ ,7,647 ఓసీ గృహ వినియోగదారులకు సేవలు అదేవిధంగా నెట్-జీరో ఉద్గారాలు సాధించడం జరుగుతుందన్నారు. పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచడం, ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రోత్సాహం, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ ,హరిత కవచం పెంపు వంటి పర్యావరణ లక్ష్యాలను కూడా ఈ కార్యక్రమం ద్వారా సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వాయు ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ మొబిలిటీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య తెలిపారు. రాష్ట్రంలో రవాణా రంగాన్ని ప్రోత్సహించేందుకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ అనేక ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టి కాలుష్యాన్ని తగ్గించడం, ఇంధన వ్యయాలను తగ్గించడంతోపాటు స్థిరమైన రవాణా దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడంలో సహకరిస్తోంది. వినియోగదారులకు మరింత సమర్థవంతమైన, మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు బిఇఇ, ఇఇఎస్ఎల్ ,రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ సంస్థలతో కలిసి ఆధునిక సాంకేతికతలను అమలు చేస్తున్నామన్నారు.




# అపోలో సహకారంతో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం

## - చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక ట్రామా కేర్, ఎమర్జెన్సీ విభాగాలను ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**చిత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త:** అపోలో సహకారంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిరపేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అపోలో సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక ట్రామా కేర్, ఎమర్జెన్సీ విభాగాలను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు చూపుతో రాష్ట్రంలో నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. ఇందులో భాగంగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అపోలో సంస్థ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. చిత్తూరులో ఆసుపత్రిలో సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలోనే కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రోగి ఆసుపత్రి చేరినప్పటి నుండి డిశ్చార్జ్ అయ్యే వరకు మెరుగ్గా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. పేదలకు ఎలాంటి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రమా దాలు, అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన బాధితులకు తక్షణమే నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఈ ట్రామా కేర్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఆధునిక సదుపాయాలతో అత్యవసరమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ విభాగంలో 60 పడకలను అత్యవసర వైద్య సేవల కోసం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, ఎఐఎంఎస్ఆర్ డీన్ అల్ఫ్రెడ్ జె ఆగస్టీన్, యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్, మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ రంగనాధ్, బిజి ఎఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్స్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, పెద్ద సంఖ్యలో వైద్యాధికారులు, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

# ట్రంప్ దురాక్రమణలను ప్రపంచ దేశాలు నిలువరించాలి

## - మాజీ శాసనసభ్యుడు యం.ఎ. గఫూర్

**విజయవాడ.మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ చమురు నిలవలున్న దేశాలను ఆక్రమించుకుని ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తూ ఇరాన్, వెనిజుల లాంటి దేశాలపై చేస్తున్న దుర్మార్గపు దాడులను ప్రపంచ ప్రజలు ఐక్యంగా నిరసించి, నిలువరించాలని మాజీ శాసనసభ్యులు యం. ఏ.గఫూర్ పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడలోని దాసరి భవన్‌లో జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ట్రంప్ విధ్వంసం మానవాళికి ప్రమాదం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. మాజీ శాసనసభ్యులు యం.ఎ. గఫూర్ ప్రసంగిస్తూ ప్రపంచంలో అత్యధిక అప్పులు గల దేశంగా ఉంటున్న అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని అధికమించడానికి అపారమైన చమురు నిల్వలున్న వెనుజుల, ఇరాన్ లాంటి సార్వభౌమ అధికారం గల దేశాలపై దాడులు చేస్తుందన్నారు. ఇరాన్ యుద్ధం ఫలితంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగి ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. గల్ఫ్ దేశాలలో ఉన్న కోటి మంది భారతీయుల ఉనికి ప్రమాదంలో పడిందని, గల్ఫ్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు తొలగిస్తేనే శాంతియుత వాతావరణం ఏర్పడుతుందన్నారు. విశ్వ గురువుగా ప్రకటించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ గాజ, వెనిజుల, ఇరాన్ లపై అమెరికా, ఇజ్రాయిల్ ల దాడులను ఖండించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు.లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఐఎఎస్ విజయ్ కుమార్ ప్రసంగిస్తూ విదేశాలతో సుహృద్భావ వాతావరణం కొనసాగించాలని, సఖ్యతను పెంపొం దించు కోవాలని భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 పేర్కొంటే నేటి కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అమెరికా, ఇజ్రాయిల్ లకు కొమ్ము కాస్తుందన్నారు. గతంలో నాటి భారత ప్రధానులు అలీన ఉద్యమానికి నాయకత్వం వహిస్తు చిన్నచిన్న దేశాలకు అండగా నిలిచారని, నేటి ప్రధాని నరేంద్ర మోడీ అనైతికత యుద్ధాలకు పాల్పడుతున్న దేశాలకు మద్దతు ఇవ్వడం శోచనీ యమన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అధికారం చేపట్టగానే 7 యుద్ధాలను ఆపానని, ప్రపంచశాంతి నోబెల్ బహుమతి తనకు ఇవ్వాలని పదేపదే కోరుతున్న ట్రంప్ అందుకు విరుద్ధంగా అనేక యుద్ధాలకు శ్రీకారం చుట్టి మానవ వినాశకుడిగా మారారన్నారు. వెనిజులా చమురుపై ఆధిపత్యం పొందాలనే దురాశతో సార్వభౌమాధికారం గల వెనిజుల పై దండెత్తి ఆ దేశ అధ్యక్షుడిని గద్దలా ఎత్తుకు వెళ్లి అమెరికా జైలులో నిర్బంధించారన్నారు. అలాంటి ప్రయత్నంలో భాగంగా అన్వాయిదాలు రూపొందిస్తున్నారనే నెపంతో ఆ దేశ అధ్యక్షుడు అయతుల్లా సయ్యద్ అలీ హుస్సేన్ ఖమేని తో పాటు 50 మంది ముఖ్య నేతలను ఇజ్రాయిల్ తో కలిసి హతమార్చారని తెలిపారు. డోనాల్డ్ ట్రంప్ ఏడాది పాలన లోనే కెనడాను 51 వ రాష్ట్రంగా చేయాలని, క్యూబాను అమెరికాలో కలుపుకోవాలని ఖనిజ సంపద గల గ్రీన్ ల్యాండ్ ను ఆక్రమించుకోవాలని, పనామా కాలువను స్వాధీన పరుచుకోవాలని భావిస్తునారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి ప్రసంగిస్తూ డాలర్ వ్యవస్థను బలోపేతం చేయాలనే కుటిల బుద్ధితో నేడు అమెరికా అవలంబిస్తున్న దుర్మార్గ విధానాలపై ప్రజాస్వామ్య వాదులందరూ గళం ఎత్తాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రసంగిస్తూ అమెరికా సామ్రాజ్యవాద దృక్పథంతో చిన్నచిన్న దేశాలపై 400 సార్లు దాడులు చేసిందని, 40 దేశాలలో 800 సైనిక స్థావరాలను ఏర్పరచుకుని ప్రపంచ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. సోషలిస్ట్ కూటమినాడు వలసవాదాన్ని అంతమొందిస్తే నేడు అమెరికా నయా వలస వాదంతో సార్వభౌమాధికారం గల చిన్న దేశాలపై దాడులు చేస్తూ వారి సహజ వనరులను దోచుకుంటుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర ప్రసంగిస్తూ స్పెయిన్, డెన్మార్క్ లాంటి చిన్నచిన్న దేశాలు అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తుందంటే ప్రపంచంలో అత్యధిక జనాభా గల భారత దేశం ఎందుకు మౌనం పాటిస్తుందని ప్రశ్నించారు.




ట్రంప్ విధ్వంసం మానవాళికి ప్రమాదం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న యం.ఎ. గఫూర్

# ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

**ఇంద్రకీలాద్రి, మార్చి 9, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై భద్రతా, పార్కింగ్ ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లు చేయడానికి విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆలయ ఈవో శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ గాంధీ ఆలయ ప్రత్యేక పరిశీలన చేశారు. కొండపై ప్రధాన ఆలయం, పరిసర ప్రాంతాలు, ఘాట్ రోడ్డుతో పాటు పలు కీలక ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఇంద్రకీలాద్రి కొండపై పలు ప్రాంతాలలో వాహనాల పార్కింగ్‌కు అనుకూలమైన ప్రదేశాలను పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యటన సందర్భంగా అదనపు డీసీపీలు, ఏసీపీలు, వన్‌టౌన్ సీఐతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు అనంతరం దేవస్థానం అధికారులతో సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై సమీక్ష చేశారు. పరిశీలన అనంతరం రాజశేఖర్ బాబు ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 19న ఉగాది పర్వదిన వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. 19వ తేదీ నుండి వసంత నవరాత్రులు సందర్భంగా 28 వరకు శ్రీ అమ్మవారికి ప్రత్యేక పుష్పార్చనలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు వర్ణమయ పుష్పాలతో అర్చించే ఈ సేవలో పాల్గొనదలచిన భక్తులు రు.2,500 ఉభయ రుసుము చెల్లించి ఆన్‌లైన్లో, శ్రీ అమ్మవారి ఆలయంలో కూడా టికెట్లు పొందవచ్చున్నారు. ఉగాది పర్వదినాన సాయంత్రం 6 గంటలకు వెండిరథంపై శ్రీ స్వామి అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు.



దాతకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

\- గోసంరక్షణకు రు.1,45,000 విరాళం: శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకం నిమిత్తం పశ్చిమ గోదావరి జిల్లా , వెలనపేట , పెంటపాడు వాస్తవ్యులు డి. వెంకటరావు, చిన్నమ్మ కుటుంబ సభ్యులు గో సంరక్షణ పథకం నిమిత్తం రు.1,45,000 ఆలయ అధికారులను కలిసి విరాళంగా అందజేశారు . దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

# కోళ్లను మింగేస్తున్న వైరస్ - వేల సంఖ్యలో మృత్యువాత

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పౌల్ట్రీ రంగంపై అంతు చిక్కని వైరస్ క్రమేపీ కోరలు చాస్తోంది. ఈ వైరస్‌తో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్త పల్లి మండలం చెన్నపురావుపల్లిలో బాయిలర్ కోళ్లు వేల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. రెండు ఫౌల్ట్రీ ఫామ్స్‌లో అంతుచిక్కని వైరస్‌తో పెద్దఎత్తున చనిపోతున్నాయి. గత మూడ్రోజులుగా వేల సంఖ్యలో కోళ్లు మరణించాయని పౌల్ట్రీ యజమానులు వాపోతున్నారు. ఇప్పటివరకు 10 వేల కోళ్లు మృత్యువాత పడినట్లు పేర్కొంటున్నారు. అయితే ఎందుకు చనిపోతున్నాయో తెలియడం లేదంటున్నారు. రోజురోజుకీ ఈ సంఖ్య పెరుగుతోందని, దీని గురించి అధికారులు చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. ఈ అంతుచిక్కని వైరస్‌తో తెలంగాణ వ్యాప్తంగా లక్షల కోళ్లు చనిపోయినట్లు ఫౌల్ట్రీ యజమానులు అంటున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం చిన్నపురావుపల్లిలో ఉన్న ఓ ఫారంలో 5 వేల కోళ్లు చనిపోగా, నాగర్‌కర్నూల్ మండలంలోని రాంరెడ్డిపల్లి తండాలో 1,500 కోళ్లు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మరో 4 వేల వరకు కోళ్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కోళ్ల మృతికి కారణమైన వైరస్‌ను గుర్తించేందుకు శాంపిళ్లను సేకరించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఫోరెన్సిక్ నిపుణుల బృందం కూడా కోళ్ల నమూనాలను సేకరించి, వైరస్ రకాన్ని నిర్ధారించేందుకు పూర్తిస్థాయిలో పరిశోధనలు జరపనుంది.

# ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై లోక్‌సభలో చర్చ జరపండి

## పార్లమెంట్ మెట్లపై కాంగ్రెస్ ఎంపిల ధర్నాలో ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై లోక్ సభలో చర్చ చేపట్టాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాం డ్ చేశారు. సోమవారం పార్లమెంట్ మెట్లపై కాంగ్రెస్ ఎంపిలు పన్నెండు మంది కలిసి ధర్నాచేసి నిరసన తెలిపారు. ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా కాకుండా ట్రంప్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి దిగుమ తులపై సుంకాలను వైట్‌హౌస్ నుంచి ట్రంప్ డిసైడ్ చేశారని అన్నారు. పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అంశాలను ట్రంప్ ఎట్లా డిసైడ్ చేస్తారని ఆయన నిలదీశారు. మోడీ ఎందుకు ట్రంప్‌తో కాంప్రమైజ్ అయ్యారో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. లోక్‌సభలో ఎనిమిది మంది ఎంపిలను సస్పెండ్ చేసిన అంశంపై చర్చ జరగాలని,

లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం సందర్భంగా ఎనిమిది మంది ఎంపిలకు ఓటువేసే అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అంటూ లోక్‌సభ మకర్‌ద్వార్ వద్ద తాము ధర్నా చేస్తూ ప్రజాసమస్యలపై మాట్లాడే అవ కాశం ఇవ్వాలని కోరుతున్నామని ఆయన వివరించారు. ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం,

ఏ దేశం పైన ఇండియా ఆధారపడాల్సిన అవసరం లేదని,

ఏ నాయకుడి ఆదేశాల మేరకు ఇండియా పని చేయవద్దని ఆయన కోరారు.

# సెల్ ఫోన్ స్పేర్స్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

## రూ. 50 లక్షల బిల్లులు లేని సరుకు పట్టివేత

**నెల్లూరు క్రైమ్, మార్చి 9, ప్రభాతవార్త:** నెల్లూరు నగరం లస్సీ సెంటర్ సమీపంలోని పలు మొబైల్ స్పేర్స్ దుకాణాలపై విజిలెన్స్ అధికారుల బృందం సోమవారం విస్తృత దాడులు నిర్వహించింది. విజిలెన్స్ సిఐ నరసింహారావు, డిసిటిఓ విష్ణురావు సిబ్బందితో కలిసి పలు మొబైల్ స్పేర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డూప్లికేట్ చార్జర్లు, ఇతర మొబైల్ స్పేర్ వస్తువులు ఉన్నట్లు అనధికారికంగా వ్యాపారం జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీటితోపాటు బిల్లులు లేని పలు మొబైళ్లను విచారించి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కంపెనీ పేరుతో పాటు నకిలీ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ. 50 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. దుకాణాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# 'కల్తీ'కి బాబుదే బాధ్యత: షర్మిల



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 9 ప్రభాతవార్త :** రాజమహేంద్రవరంలో చౌడేశ్వరి నగర్‌లో కల్తీ పాలు సేవించి పలువురు మృతి చెందిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కిమ్స్ ఆసుపత్రిలో కల్తీ పాల ఘటనలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన షర్మిల రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కల్తీ పాల ఘటనలో నిరక్ష ్యల్లో వరలక్ష్మి ్మ సంస్థతో పాటు ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని అన్నారు. 11 మంది మృతిపై ఇది ప్రభుత్వం చేసిన హత్యలేనని, దీనికి పూర్తి బాధ్యత చంద్రబాబు వహించాలని డిమాండ్ చేశారు. లైసెన్స్ లేకుండా 11 ఏళ్లుగా పాలు అమ్ముతుంటే తనిఖీలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు మొద్దు నిద్ర పోతున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌కి సైతాన్ సైన్యాన్ని పరామర్శించడం తప్ప ప్రజా సమస్యల కోసం బయటకు రారు అని ఏద్దావా చేసారు. రాష్ట్రంలో పాలు కల్తీ, నెయ్యి కల్తీ, మద్యం కల్తీ, వాగ్దానాలు కల్తీ మొత్తం పాలనే కల్తీ అని దుయ్యబట్టారు. ఇథలీన్ గ్లైకాల్ కలిసి 11 మంది కలిసి చనిపోవడం బాధాకరం 9 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు ఆరోగ్యంగా ఉండాల్సిన వారు వెంటిలేటర్ మీదున్నారు. ఇది యాదృచ్ఛికం కాదు.. ప్రభుత్వ నిరక్ష ్యల్లో అని అన్నారు. ఫుడ్ సేఫ్టీ శాఖ మొద్దు నిద్ర పోయింది కల్తీపై చర్యలు లేవు, తనిఖీలు లేవు రాజమండ్రిలో ఫుడ్ సేఫ్టీ అధికారి ఒకరే, అమే కూడా ఇక్కడ వుండరు. చంద్రబాబు ఏఐ గురించి చెప్తున్నారు ప్రజల ఆరోగ్యానికి ఇక్కడ దిక్కులేదు. ఇప్పుడు పాపులేషన్ పెంచండి అంటున్నారు ముగ్గురు లేదా నలుగురు సంతానానికి ప్రోత్సాహకాలు అంటున్నారు పాలల్లో యూరియా, డిటర్జెంట్లు కలుపుతున్నారు. పాల విషయంలో భద్రత ఇవ్వలేని ప్రభుత్వం ఉంటే ఎంత? ఊడితే ఎంత, రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ మొద్దు నిద్రపోయింది ఈ ఘటనతో నాలుగు రోజులు తనిఖీలు అంటూ హడావిడి చేశారు మళ్లీ యథా రాజా తథా ప్రజా అన్నట్లు వుంది అని ఆరోపించారు. నిఘా పెట్టడం ప్రభుత్వం భాధ్యత నిరంతరం తనిఖీలు చేస్తూ ఉంటే ఈ ఘటన జరిగేది కాదని అన్నారు. ఫుడ్ సేఫ్టీ సంస్థను బలోపేతం చేయాలని, ఆ సంస్థలో కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ ప్రభుత్వానికి స్కామ్స్, మాఫియాల మీద ఉన్న శ్రద్ధలో పావు వంతు ఆరోగ్యం, సంక్షేమాల, సామాన్యుల జీవితాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు పరిహారం 10 లక్షలు చాలవని, 25 లక్షలు ఇవ్వాలి అని షర్మిల డిమాండ్ చేసారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

**నెల్లూరు క్రైమ్, మార్చి 9, ప్రభాతవార్త:** మోటార్ సైకిల్‌పై వెళుతూ ఆటోను ఢీకొన్న సంఘటనలో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన నెల్లూరు రూరల్ మండల పరిధిలోని కాకుపల్లి సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కలివేలపాలెంకు చెందిన చెన్నారెడ్డి వివాన్(16) ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన తండ్రికి చెందిన మోటార్ సైకిల్ తీసుకుని స్నేహితులను కలిసేందుకు నెల్లూరు వెళ్ళాడు. తిరిగి వచ్చే క్రమంలో కాకుపల్లి నుండి నెల్లూరు వైపు వస్తున్న ఆటోను తన మోటార్ సైకిల్‌తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి

**చిల్లకూరు (నెల్లూరు), మార్చి 9 ప్రభాతవార్త:** మండలంలోని అపెక్స్ కంపెనీ ఎదురుగా జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రాంగ్ రూట్‌లో ఎదురుగా ట్రాక్టర్ వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దుత్తలూరు మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన జన్నమల హరిబాబు, చెన్నుపల్లి రవిలు తిరుపతి నుండి బైక్ పై బావా బామర్ధులు స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చెన్నుపల్లి రవి (34) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. జన్నమాల హరిబాబు కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మృతి చెందిన రవిని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ని అదుపులోకి తీసుకున్నారు.

# డిగ్రీలో తగ్గనున్న సిలబస్!

## రానున్న 2026-27 నుంచి 120 క్రెడిట్స్

### అంగీకరించిన యూనివర్సిటీల విసిలు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో సిలబస్ కొంత మేరకు తగ్గనుంది. 2025-26 విద్యా సంవత్సరం వరకు డిగ్రీలో కొనసాగిన సిలబస్ నుంచి కొంత తగ్గించాలని ఉపకులపతుల(వీసీ) మీటింగ్‌లో నిర్ణయించారు. ఇప్పటి వరకు డిగ్రీ కోర్సులో కోర్సు పూర్తయ్యే నాటికి 142 క్రెడిట్స్ కొనసాగుతుండగా.. ఇకపై 2026-27 విద్యా సంవత్సరం నుంచి క్రెడిట్స్‌ను 120కి తగ్గించాలని నిర్ణయించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి యూనివర్సిటీల వీసీలతో రెండు రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) నిబంధనలను ఎక్కడా మీరకుండా.. సిలబస్ తగ్గిస్తూ.. క్రెడిట్స్‌ను తగ్గించాలని నిర్ణయించారు. ప్రస్తుతం డిగ్రీ మూడు సంవత్సరాల కోర్సు 142 క్రెడిట్స్‌తో పూర్తి కానుంది. వాటిల్లో మొదటి సెమిస్టర్ నుంచి 4వ సెమిస్టర్ వరకు 25 క్రెడిట్స్ చొప్పున 100 క్రెడిట్స్ పూర్తవుతాయి. డిగ్రీ కోర్సు చివరి ఏడాదిలో సెమిస్టర్‌కి 21 క్రెడిట్స్ చొప్పున మరో 42 క్రెడిట్స్‌తో కలిపి మొత్తం 142 క్రెడిట్స్‌తో డిగ్రీ కోర్సును పూర్తి చేస్తున్నారు. అయితే 2026-27 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులో ప్రతి సెమిస్టర్‌కి 20 క్రెడిట్స్ చొప్పున మొత్తం 120 క్రెడిట్స్‌ను కొనసాగించాలని నిర్ణయించారు. అలాగే పీజీ కోర్సుల్లో కూడా ఇలాగే ప్రతి సెమిస్టర్‌కి 20 క్రెడిట్స్ చొప్పున మొత్తం 80 క్రెడిట్స్‌తో పీజీ కోర్సు పూర్తి కానుంది.




తల్లిదండ్రులతో కేయాన్ష్ (ఫైల్‌ఫోటో), వ్యాధితో బాధపడుతున్న దృశ్యం

# నిన్న పునర్విక.. నేడు కేయాన్ష్

- లేపాక్షిలో ఎస్ఎంఏ టైప్-2 వ్యాధికి గురైన బాలుడు
- రూ.16 కోట్ల ఇంజక్షన్ అవసరమన్న వైద్యులు
- ఆపన్న హస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు

**లేపాక్షి, మార్చి 9 ప్రభాతవార్త:** కోటి మందిలో ఒకరిని ఆశించే ఎస్ఎంఏ టైప్-2 వ్యాధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇద్దరికి సోకింది. కర్నూలు జిల్లా వెల్దుర్తి గ్రామానికి చెందిన పునర్విక మొదటి ఎస్ఎంఏ టైప్-2 బాధితురాలు కాగా సత్యసాయి జిల్లా లేపాక్షికి చెందిన నటరాజ్, శైలజల 8 నెలల కుమారుడు కేయాన్ష్‌కు ఎస్ఎంఏ టైప్-2 వ్యాధి సోకడం శోచనీయం. పునర్వికకు పలువురు దాతలతో పాటు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆపన్న హస్తం అందించారు. లేపాక్షికి చెందిన నటరాజ్, శైలజలు బ్రతుకుతెరువు కోసం బెంగళూరుకు వెళ్లి చిరుద్యోగం చేస్తున్నారు. గత కొంతకాలంగా తన కుమారుడు కేయాన్ష్ అనారోగ్యానికి గురికావడంతో ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. లక్షలాది రూపాయలు వెచ్చించినా తన కుమారుని ఆరోగ్యం కుదుటపడకపోవడంతో తల్లిదండ్రులు డాక్టర్‌ను మరిన్ని ఇతర పరీక్షలు చేయాలని అభ్యర్థించారు. ఇందులో భాగంగా చేసిన పరీక్షల్లో కేయాన్ష్‌కు ఎస్ఎంఏ టైప్-2 వ్యాధి ఉన్నట్టు నిర్ధారించారు. డాక్టర్లు తల్లిదండ్రులకు పలు రకాలుగా నచ్చజెప్పి వ్యాధి లక్షణాలను వివరించారు. 16 కోట్ల విలువైన ఇంజక్షన్ మీ కుమారుడికి అవసరమని తెలియచెప్పారు. దీంతో తన కుమారుడికి వచ్చిన వ్యాధిని చూచి తల్లిదండ్రులతో పాటు మధ్యతరగతి కుటుంబానికి చెందిన లేపాక్షిలోని డైరీ శ్రీరామప్ప కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ బిడ్డను రక్షించుకునేందుకు వారు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారు. తమకు అవసరమైన నిధుల సేకరణకు ప్రజలను, ప్రభుత్వాన్ని వేడుకోవడం అందరిని కలిచివేస్తోంది. తగిన సాయం అందించాలని వారు కోరుతున్నారు.

## రైతుల వ్యవసాయ పనుల్లో

# ముందస్తు ప్రణాళిక అవసరం

### ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. ఆర్. శారదా జయలక్ష్మి

**విజయవాడ, మార్చి9 ప్రభాతవార్తప్రతినిధి:** 2026 సంవత్సరంలో ప్రపంచ వాతావరణ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, ఎల్. నినో పరిస్థితుల నేపథ్యంలో, రైతులు వ్యవసాయ పనుల్లో ముందుస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డా. ఆర్. శారదా జయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు నివిళీవీ పరిస్థితులు న్యూట్రల్ (తటస్థ) స్థితిలో ఉండే అవకాశం ఉందని, ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో న్యూట్రల్ ఐఓడి పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాబోయే వేసవి మరియు నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ ఆగస్టు 2026) కూడా వాతావరణం సాధారణ స్థితిలో ఉండే అవకాశం (సుమారు 56 ) ఉన్నట్లు అంతర్జాతీయ అంచనాలు సూచిస్తున్నాయన్నారు.

అయితే 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో పరిస్థితులు మళ్ళీ అభివృద్ధి చెందే అవకాశం (సుమారు 60) ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారన్నారు. వాతావరణంలోని ఈ మార్పులు మన దేశ నైరుతి రుతుపవనాల సరళిపై ప్రభావం చూపే అవకాశం ఉందని, దీని ప్రభావం వల్ల వర్షాధార వ్యవసాయంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున, రైతులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ జారీ చేసే సూచనలను రైతులు ఎప్పటికప్పటి తప్పనిసరిగా గమనించాలన్నారు.

స్థానిక వ్యవసాయ కేంద్రాల సలహాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలన్నారు. వాతావరణ అనిశ్చితిని తట్టుకునేలా సాగులో శాస్త్రీయ పద్ధతులను, నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడానికి, దిగుబడి నష్టాలను నివారించడానికి రైతులు అప్రమత్తంగా ఉండి, శాస్త్రవేత్తల సలహాలను అనుసరించాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డా.ఆర్. శారదా జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.




# మానవీయ విలువలు పెంపొందించేది రంజాన్ ఉపవాసం: టిపిసిసి చీఫ్

**హైదరాబాద్, మార్చి 9,ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా మానవీయ విలువలు పెపొందించే విధంగా ఆధ్యాత్మక మాసం రంజాన్‌లో ఉపవాస దీక్షలు చేస్తారని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టిపిసిసిఅధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కూడా హాజరై ముస్లిం సోదరులతో ఆత్మీయంగా కలుసుకుని రమజాన్ శుభాకాంక్షలు తెలిపారు... ఈ సందర్భంగా టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ రమజాన్ నెల ఆత్మీయత, సహనం, సేవా భావానికి ప్రతీక, మరియు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

# ట్రంప్‌కు లొంగిన విదేశాంగ విధానం

## తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల కన్వీనర్ మల్లు రవి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో వేగంగా మారుతున్న పరిస్థితులపై పార్లమెంట్‌లో సమగ్రచర్చకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం కేవలం మన విదేశాంగ విధానం ట్రంప్‌నకు లొంగి ఉండటం వల్లే జరిగిందని నాగర్‌కర్నూల్ ఎంపి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల కన్వీనర్ డా. మల్లు రవి ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు భారత్ విదేశాంగ విధానం, ఆర్థిక స్థిరత్వం, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రతపై తీవ్రప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ సహా ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం సభ్యులకు ప్రశ్నలు అడిగే అవకాశం ఇవ్వకుండా విదేశాంగ మంత్రి ప్రకటనతో మాత్రమే సరిపెట్టడం ద్వారా చర్చను తప్పించుకోవడానికి ప్రయత్నించిందనీ అన్నారు.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకెన్ డ్రైవ్ దాడులు

## 445 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందుబాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 445 మంది మందుబాబులు పట్టుబడ్డారు. వీరిలో 377 మంది ద్విచక్ర వాహనదారులు, 22 మంది ఆటో డ్రైవర్లు, 46 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 100 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు, 191 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 84 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 39 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 12 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, తొమ్మిది మంది 251 నుంచి 300 పాయింట్ల వరకు, 10 మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించి నట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్‌డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

## మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి

# రావడం గొప్ప పరిణామం

### ప్రజలకు నిజాలు తెలిపే బాధ్యత మీడియాదే : పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** మావోయిస్టులు జనజీవన స్రవంతి లోకి రావడం గొప్పరాజకీయ పరిణామనీ, ప్రజలకు నిజాలు తెలిపే బాధ్యత మీడియాపై ఉందని సత్యనిష్టతో జర్నలిజం వృత్తిని కొనసాగించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇప్పించడానికి ప్రభుత్వంతో మాట్లాడుతానని హామి ఇచ్చారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇచ్చి ఆరోగ్యభద్రత కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు కృషిచేస్తానని అన్నారు. టిఆర్‌పి రేట్ కోసం వాస్తవాలు వక్రీకరణ చేయవద్దని ఆయన సూచించారు. ఒక నాయకుడు ఎదగడానికి పత్రికలు ఎంతో సహకారం ఇస్తాయనీ ఆయన వివ రించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయులు పేదల గొంతకలనీ వారి కలాలు, కెమెరాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు నిజాయితీగా తెలియజేసే బాధ్యత మీడియాపై ఉందని, ప్రజల సమస్యలను పాలకులకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక వంతు పోషిస్తున్నారని అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కొత్త కమిటీ జర్నలిస్టుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్య నారాయణ, నగర మేయర్ ఉమారాణి, డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నాయకులు నగేష్ రెడ్డి తదితరులు హాజరై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో గంజాయి పట్టివేత

## రూ.3.18 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

**రంగారెడ్డి అర్బన్, మార్చి 9, ప్రభాతవార్త:** శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. విదేశాల నుంచి అక్రమంగా మాదకద్రవ్యాలను తరలిం చేందుకు ప్రయత్నించిన ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి కోట్ల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం, హనోయ్ నుంచి కౌలాలంపూర్ మీదుగా ఎయిర్ ఏషియా ఏకే-069 విమానంలో హైదరా బాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో కస్టమ్స్ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. వారి లగేజీని స్కానింగ్ చేయగా అనుమానాస్పద వస్తువులు కనిపించాయి. దీంతో అధికారులు లగేజీని పూర్తిగా తనిఖీచేయగా అందులో నిషేధిత మాదకద్రవ్యం అయిన గంజాయిని దాచినట్లు గుర్తించారు. అధికారులు మరింత లోతుగా పరిశీలించగా 9.10 కిలోల గంజాయి స్వాధీనం అయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ మాదకద్రవ్యాల విలువ సుమారు రూ. 3.18 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు అంచనా వేశారు.



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

నిందితులు గంజాయిని ప్రత్యేక ప్యాకెట్లలో దాచి పెట్టి తరలించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను కస్టమ్స్ అధికారులు అరెస్టు చేసి వారి మీద కేసు నమోదు చేశారు. మాదక ద్రవ్యాలు ఎక్కడి నుంచి వచ్చాయి, వాటిని ఎవరికి అందించేందుకు ప్రయత్నించారు అనే కోణంలో అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వెనుక ఉన్న అంతర్జాతీయ ముఠా సంబంధాలపై కూడా విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవలి కాలంలో విదేశాల నుంచి విమానాల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు తనిఖీలను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు.

# శంకరాభరణం వెండితెర నవల ఆవిష్కరణ

## సింగపూర్‌లో ఘనంగా నిర్వహణ

### ప్రముఖుల హాజరుతో సందడి

**విజయవాడ, మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీ సాంస్కృతిక కళాసారథి- సింగపూర్ ఆధ్వర్యంలో "శంకరాభరణం వెండితెర నవల" పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రముఖ దర్శకులు కె. విశ్వనాథ్ తనయులు కె. నాగేంద్రనాథ్ చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం బర్గండీ లక్రిసెంట్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి దాదాపు 70 మంది దర్శకుడు కె. విశ్వనాథ్ అభిమానులు హాజరయ్యారు. సంస్థ అధ్యక్షులు రత్న కుమార్ కవుటూరు మాట్లాడుతూ, కె. నాగేంద్రనాథ్‌తో తనకు దాదాపు పదేళ్లకు పైగా అనుబంధం ఉందని తెలిపారు. సామవేదం షణ్ముఖ శర్మ 2017లో సింగపూర్ విచ్చేసిన సందర్భంగా నిర్వహించిన శివపదం కార్యక్రమానికి ఆయన అందించిన సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తక్కువ సమయంలో విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వీడియో సందేశాలు అందించిన పుస్తక రచయిత, ప్రముఖ దర్శకులు సీనియర్ డైరెక్టర్ వంశీకి శంకరాభరణం చిత్ర నిర్మాత ఏడిద నాగేశ్వరరావు తనయులు ఏడిద రాజా కి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్య అతిథి కె. నాగేంద్రనాథ్ మాట్లాడుతూ, ఈ పుస్తకాన్ని సింగపూర్‌లో ఆవిష్కరించాలని రత్న కుమార్‌తో చెప్పగానే అతి తక్కువ సమయంలో ఇంత చక్కగా ఏర్పాట్లు చేసినందుకు అభినందించారు. శంకరాభరణం చిత్రం విడుదల సమయంలో వచ్చిన ఈ పుస్తకం అప్పట్లో తెలుగు ప్రజల అభిమానాన్ని విశేషంగా పొందిందని తెలిపారు. ప్రస్తుతం పుస్తకం అందుబాటులో లేకపోవడంతో పుస్తక రచయిత, సీనియర్ డైరెక్టర్ వంశీ ని సంప్రదించి దీనిని పునర్ముద్రణ చేయించామని చెప్పారు. తమ తండ్రి కె. విశ్వనాథ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న హైదరాబాద్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించామని, దానికి విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమం అంతటా "శంకరాభరణం" చిత్రంలోని గీతాలు, విశేషాలు వినిపించడంతో ఇది ఒక అచ్చ తెలుగు పండుగలా అనిపించిందని తెలిపారు.



సింగపూర్‌లో శంకరాభరణం వెండితెర నవల పుస్తకావిష్కరణ దృశ్యం



# సూర్య బిందాస్

## టీమిండియా సక్సెస్ మంత్ర ◊ కెప్టెన్‌గా రికార్డు విజయాలు

*టీమిండియా కెప్టెన్లలో సౌరవ్ గంగూలీ, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ... ఒక్కొక్కరిదీ ఒక్కో స్టయిల్. రెండేళ్లలోనే వీరందరి దాటేశాడు సూర్యకుమార్ యాదవ్. ధోనీ కూల్ అండ్ కామ్ అయితే, గంగూలీ అగ్రెసివ్... ఈ రెండూ కలిసిన సూర్య బిందాస్ కెప్టెన్‌గా పేరు గడించాడు. 88.60 గెలుపు శాతంతో మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. రోహిత్ సెట్ చేసిన టీమ్‌తోనే అద్భుత విజయాలు అందిస్తున్నాడు. వరుసగా 8 సిరీస్ విజయాలు, ఆసియాకప్, ఇపుడు టీ20 ప్రపంచకప్.. వెరసి భారత టీ20 క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం మొదలుపెట్టాడు. దూకుడైన ఆటతీరు, తెలివైన వ్యూహాలు, ఆటగాళ్లపై నమ్మకం ఇవే సూర్యకుమార్‌ను ది బెస్ట్ కెప్టెన్‌గా నిలబెట్టాయి.*

**(వార్త క్రీడా విభాగం)**

భారత టీ20 క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో భారత్ తరఫున అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా గుర్తింపు పొందాడు. ధోనీ, రోహిత్ శర్మ సరసన సగర్వంగా నిలిచాడు. గెలుపు శాతం పరంగా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను అధిగమించి కొత్త రికార్డు సృష్టించాడు. సూర్యకుమార్ 52 టీ20 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించి అందులో 40 మ్యాచ్‌ల్లో జట్టును విజయం వైపు నడిపించాడు. దీంతో ఆయన గెలుపు శాతం 88.67 శాతంగా నమోదైంది. సూర్య కెప్టెన్సీలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వంటి బలమైన జట్లపై టీమిండియా సిరీస్ విజయాలు సాధించింది. అంతేకాకుండా 2025ఆసియా కప్‌తో పాటు తాజాగా టీ20 ప్రపంచ కప్ అందించాడు.

టీమిండియా టీ20 క్రికెట్‌లో కెప్టెన్ సూర్య నాయకత్వం కొత్త దిశను చూపిస్తోంది. దూకుడైన ఆటతీరు, తెలివైన వ్యూహాలు, ఆటగాళ్లపై నమ్మకం ఇవే సూర్య సక్సెస్ మంత్ర. ఈ లక్షణాల వల్లే టీమిండియా టీ20ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేస్తూ విజేతగా నిలిచింది. ఎప్పుడూ దూకుడుగా ఆడటం సూర్య ప్రత్యేకత. బ్యాటింగ్‌లో వేగం, బౌలింగ్ మార్పుల్లో తెలివితేటలుజట్టుకు మంచి ఫలితాలు తెచ్చాయి. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సూర్య ప్రత్యేకత. అలాగే యువఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడం కూడా సూర్య నాయకత్వంలోని మరో బలం. ఆటగాళ్లపై నమ్మకం ఉంచివారిని ప్రోత్సహించడం వల్ల జట్టులో ఉత్సాహం పెరిగింది. అదనంగా జట్టులో సానుకూల వాతావరణం ఉండేలా చూసుకోవడం, ఆటగాళ్లతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేస్తుంటారు. ఈవ్యూహాలు, సమిష్టి కృషి కలిసి టీమిండియాను టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలబెట్టింది.

### సూర్య ది బెస్ట్

**టీ20 మ్యాచ్‌లు- 52**
**గెలుపు - 40; ఓటమి - 8**
**టై - 2; నో రిజల్ట్-2**
**గెలుపు శాతం : 80.76**
**2026: టీ20 ప్రపంచకప్**
**2025: ఆసియాకప్**
**2026: కివీస్‌పై 4-1 విక్టరీ**
**2025: సౌతాఫ్రికాపై 3-1 విక్టరీ**
**2025: ఇంగ్లాండ్‌పై 3-1 విక్టరీ**
**2024: సౌతాఫ్రికాపై 3-1 విక్టరీ**
**2024: బంగ్లాదేశ్‌పై 3-0 విక్టరీ**
**2024: శ్రీలంకపై 3-0 విక్టరీ**
**2023: ఆస్ట్రేలియాపై 4-1 విక్టరీ**



**సంజూ శాంమ్సన్..** వరల్డ్‌కప్ జట్టుకు ఎంపికవడమే సర్‌ప్రైజ్. సంజూ కోసం కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్య పట్టుబట్టడంతోనే రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. అభిషేక్ ఆబ్సెంట్‌లో నమీబియాపై ఆడాడు. ఆ తర్వాత సేమ్ సీన్. అభిషేక్ పూర్ ఫామ్‌తో నాకౌట్ నుంచి రెగ్యులర్ ప్లేయర్ అయ్యాడు. సూపర్8లో జింబాబ్వేపై 24, విండీస్‌పై 97 నాటౌట్, సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89... 5 మ్యాచ్‌ల్లో 321 రన్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా సంజూ శాంమ్సన్ నిలిచాడు.



**అభిషేక్ శర్మ...** వరల్డ్‌కప్‌కు ముందు భారీ అంచనాలు. ప్రారంభమైన తర్వాత మూడు సార్లు గోల్డెన్ డక్. సూపర్8లో సౌతాఫ్రికాపై 15రన్స్ వైఫల్యం. తుది జట్టు నుంచి తప్పించాలని మాజీల డిమాండ్. అయినా సూర్య నమ్మకం ఉంచాడు. జింబాబ్వేపై 55రన్స్ చాలలేదు. మళ్లీ విండీస్, ఇంగ్లాండ్‌పై వైఫల్యం. ఫైనల్‌కు అభి వద్దే వద్దు అన్నారు. అయినా అతన్ని సూర్య నమ్మాడు. ఆ నమ్మకం విలువ ఫైనల్లో తెలిసొచ్చింది. కివీస్ బౌలర్లపై విధ్వంసంతో 18 బంతుల్లో 52రన్స్ మ్యాచ్‌నే తిప్పేసింది.



**ఇషాన్ కిషన్..** టీమిండియాకు రేండేళ్లపాటు దూరం. శుభ్‌మన్ ఫెయిల్యూర్‌తో సూర్య చాయిస్‌గా జట్టులోకి ఎంట్రీ. కివీస్‌పై హోమ్ సిరీస్‌లో సూపర్ సక్సెస్‌తో వరల్డ్‌కప్‌కు ఎంపికయ్యాడు. విజయాల్లో కీరోల్ పోషించాడు. నమీబియాపై 77, పాకిస్థాన్‌పై 77, జింబాబ్వేపై 38, ఇంగ్లాండ్‌పై 39, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 54... మొత్తం మూడు హాఫ్ సెంచరీతో 9 మ్యాచ్‌ల్లో 317 రన్స్. టాప్4 అత్యధిక రన్స్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. సంజూ శాంమ్సన్‌తో కలిసి విలువైన భాగస్వామ్యాలు అందించాడు.



**వరుణ్ చక్రవర్తి...** టీమిండియా ఏస్ స్పిన్నర్. వరల్డ్‌కప్ గ్రూప్ స్టేజ్‌లో అంచనాలకు తగ్గట్లే వికెట్ల పంట పండించాడు. నమీబియాపై 3, పాకిస్థాన్‌పై2, నెదర్లాండ్‌పై3 వికెట్లు..4 మ్యాచ్‌ల్లో 9వికెట్లు తీశాడు. సూపర్8లో సౌతాఫ్రికా, జింబాబ్వే, విండీస్‌లపై ఒక్కో వికెట్ తీశాడు. సెమీస్‌లో వికెట్ దక్కినా ఏకంగా 64 రన్స్ ఇచ్చాడు. దీంతో ఫైనల్లో వరుణ్‌ను తప్పించాలని మాజీల డిమాండ్. అయినా సూర్య ఫైనల్‌కు కొనసాగించాడు. మొత్తానికి 14 వికెట్లతో బుమ్రాతో కలిసి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు.




## మహిళల ప్రపంచకప్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ

# స్కాట్లాండ్‌తో డ్రాగా ముగించిన భారత్

**హైదరాబాద్, మార్చి 9(వార్త ప్రతినిధి):** గచ్చిబౌలీ జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతున్న మహిళల ప్రపంచకప్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు జోరు చూపుతోంది. తొలి మ్యాచ్‌లో ఉరుగ్వేను 4–0 గోల్స్‌తో ఓడించి శుభారంభం చేసిన భారత మహిళల హాకీ జట్టు... సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌ను స్కాట్లాండ్‌తో 2–2 గోల్స్‌తో డ్రాగా ముగించింది. తొలి క్వార్టర్‌లో స్కాట్లాండ్ గోల్ చేసి ఆధిక్యం చాటింది. అయితే రెండో క్వార్టర్‌లో భారత మహిళలు అటాకింగ్ గేమ్‌తో స్కాట్కాండ్ గోల్ పోస్ట్‌పై పదే పదే దాడులు చేశారు. నవ్‌నీత్ కౌర్, కెప్టెన్ సునెలిటా టొప్పొ చెరో గోల్ అందించడతో భారత్ 2–1 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో స్కాట్లాండ్ మరో గోల్ చేసి 2–2తో సమవుజ్జీగా నిలిచింది. నాలుగో క్వార్టర్‌లో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్కాట్లాండ్ తరపున మెక్వాన్, బెర్నెట్ గోల్స్ సాధించారు. మూడు పాయింట్లతో పూల్–బిలో అగ్రస్థానంలో భారత్ కొనసాగుతోంది. మిగతా మ్యాచ్‌ల్లో ఇటలీ 3–0తో ఆస్ట్రియాపై, ఇంగ్లాండ్ 3–0గోల్స్ తేడాతో కొరియాపై, ఉరుగ్వే 3–2 గోల్స్ తేడాతో వేల్స్‌పై గెలుపొందాయి.

ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో మూడు బెర్తల కోసం మొత్తం 8 జట్లు పోటీపడుతున్నాయి. 8 జట్లను రెండు పూల్స్‌గా విభజించారు. పూల్–ఎలో ఇంగ్లండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా... పూల్–బిలో భారత్, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ ఉన్నాయి. రెండు పూల్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్ మార్చి 13న... మూడో స్థానం కోసం మ్యాచ్, ఫైనల్ మ్యాచ్ మార్చి 14న జరుగుతాయి. ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

# స్విస్ ఓపెన్ నుంచి వైదొలిగిన సింధూ

**హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధూ కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధూ.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల పాటు దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తాను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్ నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొంది. భారత బ్యాడ్మింటన్ సమాఖ్య కార్యదర్శి సంజయ్ మిశ్రా ఈ పరిణామాన్ని ధృవీకరించారు. సింధూ కొంత సమయం కోరినట్లు పేర్కొన్నారు.




స్విట్జర్లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో నేటి నుంచి ప్రారంభమయ్యే స్విస్ ఓపెన్ మార్చి 15 వరకూ జరుగనుంది. భారత్ షట్లర్లు ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగుతున్నారు. 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత ప్రణయ్... జపాన్‌కు చెందిన కోకి వటనాబేతో తొలి రౌండ్‌లో తలపడతాడు. తరుణ్ మన్నెపల్లి మరో జపాన్ ఆటగాడు కెంటా నిషిమోటోతో. ఆయుష్ శెట్టి కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌తో పోటీపడతారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి... మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, మాల్వికా బన్సోద్.. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ, గాయత్రి జోడీ బరిలో ఉన్నారు.

**వాణిజ్యం**

# రూ.14 లక్షలకోట్లు ఇన్వెస్టర్లకు లాస్!

## దలాల్‌స్ట్రీట్‌లో వెల్లువలా షేర్ల పతనం

## భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, మార్చి 9:** అమెరికాఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో దలాల్ స్ట్రీట్‌లో భారీ అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,352.74 పాయింట్లు పతనమై 77,566.16 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 422.40 పాయింట్లు నష్టపోయి 24,028.05 వద్ద ముగిసింది. ముఖ్యంగా నిఫ్టీ తన ఆల్ టైమ్ గరిష్టం నుంచి 10 శాతానికి పైగా పడిపోయింది. జనవరి 5న నిఫ్టీ 26,373 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. ఈ భారీ పతనం కారణంగా ఇన్వెస్టర్ల సంపద దాదాపు 14 లక్షల కోట్ల రూపాయలు తుడిచిపెట్టుకుపోయింది. ముఖ్యంగా టాటా స్టీల్, ఎల్ అండ్ టి, ఎస్బీఐ, మారుతీ సుజుకీ వంటి దిగ్గజ సంస్థల షేర్లు 5 శాతం మేరా పడిపోయాయి. మార్కెట్ పేకమేడలా కూలిపోవడానికి ప్రధానంగా కొన్నికారణాలు కనిపిస్తున్నాయి. అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. అమెరికా దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించారనే వార్తలు రావడంతో పరిస్థితులు మరింత విషమించాయి. ఇరాన్ కూడా డ్రోన్ దాడులతో విరుచుకుపడుతోంది. ఈ అనిశ్చితి ప్రపంచ ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికాఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ముడి చమురు సరఫరా ఆగిపోతుందనే భయం నెలకొంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా 30 శాతం పెరిగి బ్యారెల్ కు 118 డాలర్లుపైకి చేరింది. 2022 రష్యాఉక్రెయిన్ యుద్ధం తర్వాత చమురు ధరలు మళ్లీ 100 డాలర్ల మార్కును దాటడం ఇదే మొదటిసారి. విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ నుండి నిధులను భారీగా వెనక్కి తీసుకుంటున్నారు. మార్చి మొదటి వారంలోనే దాదాపు 16 వేల కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించారు. గడిచిన నాలుగు రోజుల్లోనే సుమారు 21,829 కోట్ల రూపాయల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. చమురు ధరల పెరుగుదల భారత రూపాయిపై తీవ్ర ప్రభావం చూపింది. డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 0.5 శాతం బలహీనపడి చారిత్రాత్మక కనిష్ట స్థాయి 92.19 వద్దకు పడిపోయింది. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికాలో ట్రెజరీ బాండ్లపై వడ్డీ రేట్లు పెరిగి 4.2 శాతానికి చేరాయి. ప్రభుత్వ బాండ్లలో సురక్షితమైన, ఎక్కువ రాబడి వస్తున్నప్పుడు ఇన్వెస్టర్లు రిస్క్ ఎక్కువగా ఉండే స్టాక్ మార్కెట్ నుండి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. భారత మార్కెట్ ఒక్కటే కాకుండా ఆసియాలోని ఇతర ప్రధాన మార్కెట్లు కూడా కుప్పకూలాయి. జపాన్ నిక్కీ 6 శాతం, దక్షిణ కొరియా కోస్పి 8 శాతం వరకూ నష్టపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భయానక వాతావరణం భారత మార్కెట్లపై ప్రతిబింబించింది.

యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే ముడి చమురు ప్రభావంతో భారత్ లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయి. ఇది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఫలితంగా ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉండదు. దీనివల్ల సామాన్యుడిపై భారం తప్పదని తెలుస్తోంది. సెషన్ మధ్యలో ముడిచమురు ధరలు కాస్త తగ్గడంతో మార్కెట్లు ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి కొంతమేర కోలుకున్నాయి. కనిష్ఠ స్థాయి 23,868 నుంచి నిఫ్టీ 160 పాయింట్లు, 76,424 నుంచి సెన్సెక్స్ 1,142 పాయింట్లు రికవరీ అయ్యాయి. విస్తృత మార్కెట్లలో సైతం నష్టాలు తప్పలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.97 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.22 శాతం మేర క్షీణించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా 3.97 శాతం పతనమైంది. మరోవైపు, ఐటీ రంగం మాత్రం సానుకూలంగా స్పందించి 0.08 శాతం స్వల్ప లాభంతో ముగిసింది.



# భారీగా తగ్గిన పసిడి, వెండి ధరలు

**ముంబయి, మార్చి 9:** కొంతకాలంగా నిలకడగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు సోమవారం ఒక్కసారిగా కుప్పకూలాయి. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ కీలకమైన లోహాల ధరలు తగ్గడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ రోజు బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. సోమవారం ఉదయం 10:30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1960 తగ్గి రూ. 1,61,680కి చేరుకుంది. అలాగే, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1800 తగ్గి రూ. 1,48,200 వద్ద నిలిచింది. దీంతో పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి కాస్త ఊరట లభించినట్లయింది. మరోవైపు వెండి ధరలోనూ భారీ తగ్గుదల నమోదైంది. ఇవాళ ఒక్కరోజే కిలో వెండిపై ఏకంగా రూ. 5 వేలు తగ్గింది. ఈ తగ్గుదల తర్వాత హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 2.90 లక్షలకు చేరగా, దేశ రాజధాని ఢిల్లీలో రూ. 2.80 లక్షలుగా ఉంది. స్థిరంగా సాగుతున్న ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గడంతో మార్కెట్లో ఆసక్తి నెలకొంది.

## మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలతో

# భగ్గుమంటున్న చమురు ధరలు

**న్యూఢిల్లీ, మార్చి 9:** మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్యారెల్ ధర 110 డాలర్లను దాటినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రస్తుతానికి ఈ భారాన్ని ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు భరించాలని, రిటైల్ ధరలను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.




మధ్య ప్రాచ్యంలో నెల కొన్న తీవ్ర ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి వద్ద సరఫరాకు అంతరాయాలు ఏర్పడటంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ 28 శాతం పెరిగి 116 డాలర్లకు, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 27 శాతం పెరిగి 116 డాలర్లకు చేరుకుంది. 2022 తర్వాత ఈ రెండు బెంచ్‌మార్క్‌లు 100 డాలర్ల మార్కును దాటడం ఇదే మొదటిసారి. సాధారణంగా అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా మన దేశంలో ఇంధన ధరలను సవరిస్తుంటారు. మార్కెట్‌లో తీవ్రమైన ఒడుదొడుకులు ఉన్నప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని, చమురు కంపెనీల ద్వారా వినియోగదారులపై భారం పడకుండా చూస్తుంది.



## వార్ ఎఫెక్ట్: ఎగుమతుల్లో

# 10 బిలియన్ డాలర్ల నష్టం!

**న్యూఢిల్లీ, మార్చి 9:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంతో భారత్ ఎగుమతులకు సుమారు 8 నుంచి 10 బిలియన్ డాలర్లమేర గండిపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇప్పటికే తమవద్ద ఉన్న ఆర్డర్లను దెబ్బతీస్తున్నాయని, షిప్పింగ్‌ఖర్చులు పెరుగుతున్నాయని, కార్గో కదలికలు కూడా తగ్గాయని ఎగుమతిదారుల సంఘాలు చెపుతున్నాయి. పారిశ్రామిక ప్రతినిధులు మాట్లాడుతూ మార్చి నెల షిప్‌మెంట్లలో ఈ ధోరణులు మరింత స్పష్టం అవుతున్నట్లు తెలిపారు. మధ్యప్రాచ్య దేశాలనుంచి అందిన ఆర్డర్లను రద్దుచేస్తున్నారని తెలిపారు. అనేక భారతీయ ఉత్పత్తులకు ఇచ్చిన ఆర్డర్లన్నింటినీ ప్రస్తుతపరిస్థితులవల్ల రద్దుచేసుకుంటున్నారని, అలాగే రవాణా మార్గాల్లో కూడా పెరుగుతున్న అనిశ్చితి ఇందుకు దోహదంచేస్తోందని చెప్పారు. రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి, షిప్పింగ్‌కంపెనీలు అదనపు సర్‌ఛార్జిలు విధిస్తున్నాయని 1500 డాలర్లనుంచి నాలుగువేల డాలర్లవరకూ షిప్‌మెంట్‌కు అదనపు ఖర్చు అవుతున్నదని చెపుతున్నారు. దీనికి కారణం నౌకల రూటు మార్పిడి, లేదా జాప్యం వల్ల కొంత తీవ్రస్థాయిలోభద్రతా సమస్యలు, నిర్వహణ పర్యవేక్షణల్లో విఘాతాలు వంటివికూడా ఉన్నాయి. సంక్లిష్ట జలరూట్లలోనే ఈ పరిస్థితి ఎదురవుతోంది. సర్‌ఛార్జిలను కొంతవరకయినా తగ్గించాలని ఎగుమతిదారులు కోరుతున్నారు.

# డాలర్ వర్సెస్ రూపాయి 92.35

**ముంబయి, మార్చి 9:** పశ్చిమాసియాలోనెలకొన్న ఉద్రిక్తతలకారణంగా దిగమతులకు చెల్లింపులన్నీ డాలర్లలోనే జరపాలిస రావడంతో డాలర్ మరింత పటిష్టపడింది. భారత రూపాయి మరింతగా క్షీణించింది. సోమవారం కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి ఒకేసారి 53 పైసలు క్షీణించి 92.35కిచేరింది. ప్రపంచ మార్కెట్లలోముడిచమురుదరలు భారీగా పెరగడం, దీనికితోడు చెల్లింపులన్నీ డాలర్ ప్రామాణికంగా జరగడం వల్లనే రూపాయి మరింతగా క్షీణించింది. దీనికితోడు సెన్సెక్స్, నిఫ్టీలనుంచి భారీగా విదేశీ నిధులు వెనక్కిమళ్లాయి.



దేశీయ మార్కెట్లలో షేర్లలో అమ్మకాల ఒత్తిడిపెరిగింది. దీనితో రూపాయి మరింత క్షీణించినట్లు ఫోరెక్స్ ట్రేడర్లు చెపుతున్నారు. ఇంటర్‌బ్యాంకు ఫోరెక్స్ ఎక్స్ఛేంజి కౌంటర్‌వద్ద రూపాయి 92.22 వద్దట్రేడింగ్‌ప్రారంభం అయి ఇంట్రాడే సమయానికి 92.15వద్ద కొంతమేర పటిష్టం అయిందనిభావించినా తర్వాత వెనువెంటనే క్షీణించింది. 92.35 వద్దముగిసింది. ముందురోజుకంటే 53 పైసలు క్షీణించింది. అంతకుముందు వారాంతంలో రూపాయి 91.82 వద్ద ట్రేడింగ్‌జరిగింది. గ్లోబల్‌మార్కెట్లలో కూడా బలహీనత కనిపించింది. రాత్రికిరాత్రే ముడిచమురుదరలుపెరిగిపోయాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు పెట్టుబడులను విత్‌డ్రాచేసుకుంటుండటంతో రూపాయిపై ఒత్తిడిపెరిగిందని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చి విశ్లేషకుడు అఊజ్‌చౌదరి పేర్కొన్నారు.




# 2028 కల్లా భారత్‌లో ఎంబ్రాయిర్ జెట్ తయారీ!

**బ్రాసిలియా, మార్చి 9:** బ్రెజిల్ విమానతయారీ సంస్థ ఎంబ్రాయిర్ ఇ175 విమాన తయారీని భారత్‌లో 2028 నుంచి ప్రారంభించగలమని, అయితే కనీసం తమకు 200 విమానాలు ఆర్డర్లు ఉంటే భారత్‌లో తయారీకి వీలవుతుందని కంపెనీ సిఇఒ ఫ్రాన్సిస్కో గోమ్స్ నెటో వెల్లడించారు. అంతకుముందు ఈ ఏడాదే ఎంబ్రాయిర్ కంపెనీ భారత్‌లోని ఆదానిగ్రూప్‌తో కలిసి భారత్‌లో అసెంబ్లింగ్‌యూనిట్‌ఏర్పాటుకు ఎంఒయులు కుదుర్చుకున్నాయి బ్రెజిల్ విమానసంస్థ తొలితరం జెట్‌లైనర్లను భారత్‌లోనే అసెంబ్లింగ్‌చేసేందుకు ఈ ఒప్పందం జరిగింది. మేకిన్ ఇండియా కార్యాచరణకు అనుగుణంగా కేంద్రం విదేశీ జెట్ తయారీ సంస్థలను భారత్‌లోనేతమ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఇచ్చిన పిలుపుమేరకు ఎంబ్రాయిర్ ముందుకువచ్చింది. ప్రస్తుతం వాణిజ్య విమానాలను బ్రెజిల్‌లోనే తయారుచేస్తోంది.

అయితే తాము భారత్‌లో అసెంబ్లింగ్‌చేయాలన్నా తమకు కనీసం 200వరకూ విమానాలు ఆర్డర్లు ఉండాలని అప్పుడే భారత్‌లో తయారీకి వీలవుతుందని చెప్పారు. 2026 నాటికల్లా ఈ ఆర్డర్లు వస్తే విమానాలను 2028లోనే కంపెనీ డెలివరీ ఇస్తుందని స్పష్టంచేసారు. భారత్‌లో ప్లాంట్ ఏర్పాటుతో ఎంబ్రాయిర్ ఉత్పత్తికి మంచి బూస్ట్ వస్తుందని, కొత్త ఈ2 తరం విమానాల తయారీకి వీలవుతుందన్నారు.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | మంగళవారం 10 మార్చి 2026 | I


# పులి ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి.. సబ్ డిఎఫ్ఓ



**రాజవొమ్మంగి, మార్చి 09, ప్రభాత వార్త** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలంలో సోమవారం పులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని అడ్డతీగల సబ్ డి. ఎఫ్. ఓ సుబ్బారెడ్డి ప్రజలకు సూచించారు. బోర్నగూడెం, ఊర్లకులపాడు మీదుగా మిరియాలవీధి గ్రామ సమీప ప్రాంతానికి వచ్చినట్లు జి. పి. ఎస్ ద్వారా అధికారులు గుర్తించి ఆగ్రామ ప్రాంతానికి వెళ్లి చూసారు. అనంతరం సబ్ డిఎఫ్ఓ సిబ్బంది పలు సూచనలు ఇచ్చారు. బోర్నగూడెం, ఊర్లకులపాడు, సంజీవనగరం, చెరుకుంపాలెం, మిరియాలవీధి, గవరయ్యపేట పలు గ్రామాలలో పులి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దండోరా వేయించి అప్రమత్తత తెలుపాలన్నారు. రాత్రి వేళల్లో పశువులను పొలాల్లో విడిచి పెట్టడంతో బాటు వాటి వెంట ఉండకుండా ఇళ్ళ వద్దే పశువులను కట్టే విధంగా తెలుపాలన్నారు. అటవీ సిబ్బంది బృందాలుగా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు నేరుగా అధికారులకు సమాచారం ఇచ్చే విధంగా అవగాహన కల్పించా లన్నారు. పులిని పట్టుకోవడానికి శ్రీశైలం నుండి ప్రత్యేక బృంధాలు వచ్చాయి. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఊర్లకులపాడు గ్రామ సమీపంలో జామాయిల్ ప్లాంటేషన్ నుండి పులి రోడ్డు దాటే ప్రయత్నంలో వాహనాల రాకపోకలు చూసి వెనుదిరిగి వెళ్ళిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈకార్యక్రమంలో రేంజర్ ఉషారాణి, తహసీల్దారు ఏ. సత్యనారాయణ, జడ్డంగి ఎస్. ఐ చినబాబు, వీఆర్వోలు నానాజీ, నాగేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్స్ సుబ్బయ్యమ్మ, బాలాజీ, బీట్ ఆఫీసర్స్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద ప్రజలకు మేలు

### కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు





**రావులపాలెం, మార్చి 09, (ప్రభాతవార్త) :** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన 73 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.51,32,571 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య అవసరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతికి ఎముక లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం సహాయనిధి సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్తపేట నియోజకవర్గంలోనే సుమారు రూ.8 కోట్ల మేర సహాయం అందజేసినట్లు చెప్పారు. మానవసేవే మాధవసేవ అనే భావనతో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసిన వారికి ఆసుపత్రి బిల్లులు సమర్పించిన వెంటనే సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో ఎవరికైనా సీఎం రిలీఫ్ ఫండ్ అవసరమైతే తనను సంప్రదిస్తే అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో కొద్దిమందికే పరిమితమైన ఈ సహాయం, ప్రస్తుతం ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ అందుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 24 మందికి రూ.22,49,532, రావులపాలెం మండలానికి చెందిన 20 మందికి రూ.12,07,081, కొత్తపేట మండలానికి చెందిన 17 మందికి రూ.9,86,235, ఆలమూరు మండలానికి చెందిన 12 మందికి రూ.6,89,723 చొప్పున చెక్కులు అందజేశారు. మొత్తం 66 రీయింబర్స్‌మెంట్‌లు, 7 ఎల్‌వోసీలు కలిపి రూ.51,32,571 విలువైన సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు.

## స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అయినవిల్లి మార్చి 9 ప్రభాతవార్త** పారిశుధ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందని పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అన్నారు సోమవారశీ అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ వాహనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు స్వచ్ఛ రథం వారానికి ఒకసారి ప్రతి ఇంటికి వస్తుందని ప్లాస్టిక్ చెత్త వేరు చేసి ఈ రథానికి అందిస్తే దానికి విలువ కట్టి కొన్ని రకాల సరుకులు అందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు అవగాహనతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని ఆయన పిలుపునిచ్చారు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తుందన్నారు మండల ఎంపీపీ వీ.నాగ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు అంబాజీపేట మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్ ఎంపీడీవో సరోవరరావు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు అనంతరం మండలంలోని సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు సమస్యలపై దృష్టి పెట్టి పదవి కాలాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రశంసించారు

## విద్యతోనే అనుకున్న లక్ష్యాలు : టిడిపి నేత సురేష్



**శంఖవరం మార్చి 9 ప్రభాతవార్త** విద్య తోనే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని సీనియర్ టిడిపి నేత పర్వత సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రం శంఖవరంలో గల ఎపి మోడల్ స్కూలుకు చెందిన 6గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ లో ప్రతిభ చాటగా, వారిని మరింతగా ప్రోత్సాహించేందుకు ప్రత్తిపాడు నియోజకవర్గం టిడిపి సీనియర్ నేత పర్వత సురేష్ కొంత నగదును బహుమతిగా అందించారు. స్థానిక మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ ఏ వీరరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సమావేశానికి పర్వత సురేష్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ లో ప్రతిభ చాటడం ద్వారా శంఖవరం గ్రామానికి, మోడల్ స్కూలుకు పేరు, ప్రఖ్యాతలు తీసుకొచ్చారని, ఇదే స్పూర్తిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టి కృషితో విద్యార్జనలోనూ తమ ప్రతిభ చూపడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ సూచనల మేరకు ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందిస్తామని, సంఖ్య పెరిగేకొద్దీ ప్రోత్సాహ బహుమతి పెంచుతానన్నారు. ఈ ఏడాది ఎన్ఎంఎంఎస్ లో ప్రతిభ చాటిన 6మంది, వచ్చే ఏడాదికి 60మంది కావాలని, దీనికి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మౌళిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో లో మహిళా దినోత్సవ వేడుకలు



**అమలాపురం,మార్చి9,ప్రభాతవార్త** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో గ్యారేజ్ నందు ఆర్టీసీ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండారు సుభాషిణి, ప్రధాన ఉపాధ్యాయిని,జెడ్పీ హైస్కూలు బోడసకుర్రు వారు విచ్చేసి మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారని, మహిళలకు ఉన్నత విద్యతో సాధికారత లభిస్తుందని తెలియజేశారు.జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఉత్తమ మహిళా ఉద్యోగులను నగదు బహుమతితో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డిపో మేనేజర్ డివిఎల్ ఎన్ శర్మ, రామచంద్రపురం డిపో మేనేజర్ భాస్కర రావు,రాజోలు డిపో మేనేజర్ జేమ్స్,రావులపాలెం డిపో మేనేజర్ కుమార్,అసిస్టెంట్ ఇంజనీర్ గంగుమళ్ల రామలక్ష్మి దేవి,అసిస్టెంట్ మేనేజర్లు ప్రతిమాకుమారి,అచ్యుతాంబ, నాలుగు డిపోల సూపర్వైజర్లు మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**రావులపాలెం, మార్చి 09 (ప్రభాతవార్త)** :స్థానిక సత్య సాయి సేవ మందిరం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించి వాసవి క్లబ్ నిర్వాహితులు పులవర్తి గోపాల కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో గ్రామంలో 70 వసంతాలు పూర్తి చేసుకున్న 6 గురు సమయమంతుల వేంకట లక్ష్మి మంగతాయారు, దొండపాటి లక్ష్మి నరసమ్మ, తుమ్మలపల్లి సుబ్బలక్ష్మి , బోడ గౌరీ మహాలక్ష్మి , గాదె ఇందిరా రాణి, సత్తి సూర్యావతి లను దుశ్శాలువాతో, పూల దండలతో సత్కరించి, చీర పండ్లు అందజేశారు. అనంతరం కేకు కట్ చేసి మహిళా మణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళల ఔన్నిత్యాన్ని, చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యలమర్తి రాంబాబు, సమయమంతుల హనుమంత రావు, పచ్చిపులుసు నారాయణ మూర్తి, మన్యం పర్వత వర్ధన రావు, కొల్లేపర నరసింహ మూర్తి,బోడ బాబు, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్య ప్రవేశాలకు దరఖాస్తులు

**రావులపాలెం, మార్చి 09 (ప్రభాతవార్త) :** కార్పొరేట్ విద్యాసంస్థ ల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు స్పృహ ఎడ్యుకేషనల్ ఎంపార్మెంట్ ట్రస్ట్ (ఎస్ ఈ ఈ టి) ట్రస్టీ మరియు ప్రధాన కార్యదర్శి నక్కా డేవిడ్ రాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు దొండపాటి రమేష్ బాబు, గెద్దం రూపరాజు, నక్కా వీర వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషితో లబ్ధి పొంది, ఆయన ఆశయ సాధనకై పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో 2025– 26 లో పదవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ కేటగిరీల విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలు 500కు పైగా మార్కులు సాధించాల్సి ఉంటుందని వివరించారు. వీరికి వివిధ కార్పొరేట్ విద్యాసంస్థల్లో రెసిడెన్షియల్ విధానములో ఐఐటి, నీట్ విభాగాల్లో ఉచితంగా ఇంటర్మీడియట్ చదివించేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులైన వారి నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ తూర్పుగోదావరి, కాకినాడ పశ్చిమగోదావరి, ఏలూరు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పదవ తరగతి ప్రీ ఫైనల్ మార్కులు జాబితా జత చేయాలన్నారు. ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియచేశారు. (https://spruhatrust.org/ ) నందు ఆన్లైన్ లో దరఖాస్తు చేయవలెను.ఏప్రిల్ 2 తేదీన రాజమహేంద్రవరంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 7981696481, 9390059900, 9959507507 ఈ నంబర్లను సంప్రదించవచ్చునన్నారు

## గ్రామీణ ప్రజల ఆరోగ్య సేవలకు శ్రీకారం

**- రూ.2 కోట్లతో మూడు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం - మంత్రి సుభాష్ సంకల్పానికి కియా సంస్థ చేయూత**



**రామచంద్రపురం,మార్చి09 (ప్రభాతవార్త):** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతకు మరో కీలక అడుగు పడింది. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో ద్రాక్షారామం,కె గంగవరం,కాజులూరు మండలాల్లో మూడు కంటైనర్ ఆసుపత్రి క్లినిక్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్,కియా మోటార్స్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టీ హూ ఇన్ కిమ్,సీనియర్ లీగల్ అడ్వైజర్ జింగో యాన్,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం లు కంటైనర్లు ప్రారంభించారు.అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తాను కలగన్న స్వప్నం నేడు కార్యరూపం దాల్చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కంటైనర్ హెల్త్ క్లినిక్‌లు, సంచార వైద్యశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు కేవలం ఒక మిస్డ్ కాల్ ఇస్తే ఎలక్ట్రికల్ ఆటో వారి ఇంటి వద్దకు వెళ్లి రోగులను ఆసుపత్రికి తీసుకువస్తుందని,అక్కడ వైద్యుల పరీక్షలు,మందులు, రక్త పరీక్షలు తక్షణమే పూర్తి చేస్తామని మంత్రి వివరించారు. అధునాతన టెక్నాలజీ అయిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టెతస్కోప్ సహాయంతో గుండె సంబంధిత వ్యాధులను తక్షణమే గుర్తించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ పరీక్షల వివరాలు మొబైల్ యాప్ ద్వారా ముంబై,హైదరాబాద్ నగరాల్లో ఉన్న గుండె నిపుణుల వైద్యులకు వెంటనే చేరి,వారు పరిశీలించి సకాలంలో చికిత్స సూచనలు అందిస్తారని మంత్రి సుభాష్ తెలిపారు.కేవలం నామమాత్రపు చార్జీలతో ఈ కంటైనర్ హెల్త్ క్లినిక్‌లు పనిచేస్తాయని మంత్రి అన్నారు. ఈ సేవల కోసం కియా మోటార్ సంస్థ తమ సిఎస్ఆర్ నిధుల ద్వారా రెండు కోట్లు కేటాయించినందుకు సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి కంటైనర్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందిస్తారని అన్నారు.గత 19 నెలల్లో తన నియోజకవర్గంలో సుమారు 450 మంది గుండెపోటుతో మరణించారని,అలాంటి మరణాలను నివారించడమే లక్ష్యంగా ఈ కంటైనర్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించామని మంత్రి పేర్కొన్నారు. సంచార వైద్యశాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,తెదేపా పార్టీ సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను),స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్,అనకాపల్లి బిజెపి ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు,ఆయా మండలాల కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## వాడపల్లి 'వెంకన్న' అష్టోత్తర పూజలో కొవ్వూరు ఎమ్మెల్యే,



**ఆత్రేయపురం, మార్చి, 09,(ప్రభాత వార్త )** ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం సోమవారం వేలాది మంది భక్తులతో కిట కిటలాడింది.ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఏడు వారాలు ఆచరించి పూర్తయిన సందర్భంగా సోమవారం కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ స్వామి వారి అష్టోత్తర శతనామావళి పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.వారికి ఆలయఅర్చకులు, వేద పండితులు వేద అశీర్వచనం అందించగా దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ )డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావు లు స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.

## నగీన మసీదు ఇఫ్తార్ విందులో సిటీ ఎమ్మెల్యే కొండబాబు

### --ముస్లిం మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి 9 (ప్రభాతవార్త):**స్థానిక కొత్తపేట నగీన మసీదు కమిటీ నిర్వహించిన ఇఫ్తార్ విందులో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుపాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఆధునికరించిన కొత్తపేట నగీన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ముస్లిం మైనారిటీలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆ అల్లా ఆశీసులు అందరిపై ఉండాలని వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయని, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలనే సత్యాన్ని రంజాన్ మాసం బోధిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగీన మసీదు కమిటీ అధ్యక్షులు ఇక్బాల్ ఆలీ, ఎం.డి. అలీ ఖాన్, ముస్తఫ అలీ ఖాన్, మదని హుస్సేన్ ముదిద్దీన్ ఖాన్, సయ్యద్ రఫీబ్ అలీ అహ్మద్, మైనార్టీ నాయకులు ఎం.డి ఖాన్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ ఫీజు కట్టలేదని టీసీ నిరాకరణ...

### కలెక్టరేట్‌లో బాధితుల ఫిర్యాదు

**అమలాపురం,మార్చి9, ప్రభాతవార్త.** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక కుటుంబాన్ని ఆదుకోవాల్సింది పోయి,పాత బకాయిల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న అమలాపురం సీబీఎస్సీ ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం తీరుపై బాధితులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.?అమలాపురానికి చెందిన బాధితులు గతంలో బట్టల వ్యాపారం చేసేవారు. అయితే, వ్యాపారంలో తీవ్ర నష్టాలు రావడంతో ఆర్థిక స్తోమత సరిపోక, తమ పిల్లలను శ్రీ చైతన్య స్కూల్ నుండి వేరే సామాన్య పాఠశాలకు మార్పించాలని నిర్ణయించుకున్నారు. గత విద్యా సంవత్సరంలో చెల్లించాల్సిన ఫీజు బకాయిలు ఉండటంతో, వాటిని కట్టలేదన్న నెపంతో స్కూల్ యాజమాన్యం పిల్లలకు టీసీ ఇవ్వకుండా నిరాకరిస్తోంది. ?గత ఏడాది కాలంగా టీసీ కోసం పాఠశాల చుట్టూ తిరుగుతున్నా, యాజమాన్యం కనికరించకుండా వేధిస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.టీసీ లేకపోవడంతో పిల్లల విద్యా సంవత్సరం వృథా అవుతోందని, ఇది విద్యార్థుల ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని వారు వాపోతున్నారు. స్థానిక పాఠశాల యాజమాన్యం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో, బాధితులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ నందు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని, వెంటనే స్కూల్ నుండి టీసీ ఇప్పించి పిల్లల చదువు కొనసాగేలా చూడాలని కలెక్టర్ ని వేడుకున్నారు.

## రోడ్డుపై ఉన్న మెటల్ కంకరను తొలగిస్తున్నారు..

### వార్త కథనానికి స్పందన



**రామచంద్రపురం,మార్చి09 (ప్రభాతవార్త):** నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రామచంద్రపురం – ద్రాక్షారామ రోడ్డు మార్గంలో గుట్టలు గుట్టలుగా మెటల్ కంకర రోడ్డుమీద యార్డ్ గా ఉంచడం.రోడ్డు మీద కంకర వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న కారణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో శనివారం వార్త పత్రికలో ఈ కథనం ప్రచురితమైంది.ఈ కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు.రోడ్డు మీద గుట్టల గుట్టలుగా ఉన్న మెటల్ కంకర ను తొలగించే పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వాహన చోదకులు,స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

## అయితాబత్తుల బాధ్యతల స్వీకారం



**అమలాపురం, మార్చి9, ప్రభాతవార్త.** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రైమ్ ఎస్సైగా అయితాబత్తుల బాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా బాలకృష్ణ ని అభినందనలు తెలిపి సన్మానించిన అమలాపురం వర్తక సిబ్బంది.

## ఎస్టీ కమిషన్ బొజ్జి రెడ్డికి ఘన స్వాగతం.

### చింతూరు ఐటీడీఏలో ప్రజాదర్బార్



**.చింతూరు మార్చి 9 ప్రభాత వార్త.** ఏ పి,ఎస్ టీ కమిషన్ చైర్మన్ సోల్లా బొజ్జి రెడ్డికి చింతూరు లో ఘన స్వాగతం లభించింది. చింతూరు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ జమాల్ ఖాన్ ఆయనకు ఘన స్వాగతం పలికారి. నాలుగు మండలాలకు చెందిన ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చింతూరు ఐ. టీ. డి. ఏ లో నిర్వహించారు.ప్రజలు తమ సమస్యలను ప్రత్యక్షంగా ఆయన దృష్టికి తీసుకొని వెళ్లగా వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని చైర్పర్సన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్ల సునీత , ఏపీవో ఐ టీ డి ఏ రామా తులసి ,కూనవరం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర రావు, రంపచోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుపులేటి సాల్మన్ రాజు ,మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు మంగ వేణి , ప్రధాన కార్యదర్శి సావిత్రి ,బిజెపి మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ ,బిజెపి మండల పార్టీ మాజి అధ్యక్షులు చిట్టి బాబూ , జనసేన నాయకులు తీగల రవి , చింతూరు బిజెపి నాయకులు నామ శ్రీనివాస రావు , తమ్మినేని రామారావు , చింతూరు టిడిపి నాయకులు అనిగి చంద్రయ్య, తుర్రం ముత్తయ్య, లక్ష్మణ్, కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటనకు అధికారుల డుమ్మా.

### మూడు రోజుల క్రితమే అధికారిక పర్యటన ఖరారు.

**.చింతూరు మార్చ్ 9 ప్రభాతవార్త.** ఎస్టీ కమిషన్ చైర్మన్ సోల్ల బుజ్జి రెడ్డి పర్యటనకు అధికారులు డుమ్మా కొట్టడంతో దొమారం చెలరేగుతుంది. గత మూడు రోజుల క్రితమే ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బుజ్జి రెడ్డి చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ సమస్యలపై ప్రజావేదిక నిర్వహిస్తారని ప్రచారం జరిగింది. షెడ్యూల్ ప్రకారమే ఆయన చింతూరు పర్యటనకు సోమవారం వచ్చిన సంబంధిత అధికారులు మొత్తం ముఖం చాటేశారు. ఆర్ అండ్ ఆర్ అధికారులు కానీ రెవెన్యూ అధికారులు గానీ నాలుగు మండలాల నుంచి పెద్దగా ఆయన ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ఆయన అభిమానులు కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పర్యటన కార్యక్రమంలో అధికారులు డుమ్మా కొట్టడంతో ఆయన సైతం ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం.

## అధికారులు విశ్వసనీయతను చాటాలి కలెక్టర్ మహేష్



**అమలాపురం కలెక్టరేట్, మార్చి 09 (ప్రభాతవార్త)** సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవనం సమావేశం హాలు నందు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి "పీజీఆర్ఎస్" వేదిక ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న విశ్వసనీయ వేదికని, "పీజీఆర్ఎస్" కి వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు పరిష్కారం చూపాలని, అధికారులు విశ్వసనీయతను చాటుకుని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని, అర్జీలు పునరావృతం కాకుండా, ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఫిర్యాదుల పరిష్కారానికి,సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని, వేసవి దృష్ట్యా త్వరితగతిన ప్రజలను తిరిగి ఇంటికి పంపించానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు డ్వామా పథక సంచాలకులు ఎస్ మధుసూదన్, సమగ్ర శిక్ష ఏపీసి జి మమ్మీ, డిఆర్డిఏ పి డి డి శ్రీనివాసరావులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 180 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ, పురపాలక, పట్టణాభివృద్ధికి పోలీస్, పంచాయతీరాజ్ మార్కెటింగ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విద్యుత్, పౌర సరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, వైద్య ఆరోగ్యశాఖ, ఇరిగేషన్ ఎక్సైజ్, విద్య, గృహ నిర్మాణం, మైన్స్, నైపుణ్య అభివృద్ధి, ఎండోమెంట్, పశు సంవర్ధక, ఆయుష్, బ్యాంకింగ్ సేవలు, డీఆర్డీఏ, ఐసీడీఎస్, కార్మిక శాఖకు చెందిన అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వరరావు జిల్లా కలెక్టరేట్ సూపర్టెంట్లు, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు

## పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

### డిటివో గణేష్, ఎస్ టివో శ్రీనివాస్ కు సన్మానం



**తుని, మార్చి 9,( ప్రభాతవార్త)** తుని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం కార్యదర్శి వి ఎస్ ఆర్ ఆంజనేయ ప్రసాద్ నేతృత్వంలో అధ్యక్షులు ఎమ్.త్రిమూర్తులు అధ్యక్షతన పట్టణంలోని కొత్తపేటలో గల పెన్షనర్స్ అసోసియేషన్ భవనములో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవిసి పై చర్చ ఇతర సమస్యలు లపై చర్చ జరిగింది.జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్లు మార్చి 20 వరకు పొడిగించాలని,ఇంకా జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయని పెన్షనర్స్ తప్పకుండాఎస్ టి ఓ పరిధిలో సబ్మిట్ చేయాలని తెలియజేశారు.డిటివో గణేష్ ని కలిసి పెన్షనర్స్ సమస్యలపై చర్చించారు.డిటివో పెన్షనర్స్ సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరిస్తామనని తెలియజేశారని తెలిపారు. అనంతరం డిటివో ఎ.గణేష్, ఎస్.టి.వో శ్రీనివాస్ ను పెన్షనర్స్ అసోసియేషన ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో కాకినాడ అంజు ఐ హాస్పిటల్ డాక్టర్లచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు పెన్షనర్స్ కు కంటి పరీక్షలు నిర్వహించారు. 58 మంది పెన్షనర్లు ఇతర సభ్యులు పాల్గొన్నారు. పదిమందికి ఆపరేషన్, ఆరుగురికి గ్లూకోమా కంటి వైద్య చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు త్రిమూర్తులు, కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్,కోశాధికారి జి కృష్ణ,అప్పలకొండ,డేనియల్ జోసెఫ్, శ్రీరామశర్మ, రాజు, నేత్రవైద్యులు డాక్టర్ సంహిత, మేనేజర్ అబుల్ కలాం, ఆప్తాలమిస్ట్ కుమారి, విజయ, మహేష్, కృష్ణ., అధిక సంఖ్యలో పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు

## అడవుల్లో తాగునీటి కోసం
# అల్లాడుతున్న గిరిజనం..





**రాజవొమ్మంగి, మార్చి 09, ప్రభాతవార్త** ఎండలు తీవ్రంగా ఉన్నాయి. త్రాగునీరు లేక గిరిజనులు విలవిల్లాడుతున్నారు. అటవీప్రాంతం మధ్యలో త్రాగునీటి కోసం గిరిజనులు అల్లాడుతున్నారు. రాజవొమ్మంగి మండలం గడుఓకుర్తి పంచాయితీ బోనంగిపాలెం గ్రామంలో నెల రోజులు క్రితం త్రాగునీటి పదకం మరమ్మత్తులకు గురైంది. విద్యుత్ మోటార్, విద్యుత్ మీటర్, వైర్లు కాలి పోయాయి. గ్రామానికి రెండు ప్రక్కల సమీపంలో ఒక్క గ్రామం కూడా లేదు..ఆర్. డబ్ల్యూ. ఎస్. అధికారులు యం. బుక్ చేసినా బిల్లులు చేయడానికి పంచాయితీ కార్యదర్శి ఉన్నత స్థాయి ఉద్యోగానికి ఎంపిక అయ్యి వెళ్లిపోవడం జరిగిందని సర్పంచ్ సవిరాల చంద్రుడు సోమవారం సమస్యను ప్రభాతవార్త వివరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ అన్నారు. అడ్డతీగల.. రాజవొమ్మంగి మండలాలు మధ్య అటవీ ప్రాంతంలో నీటికోసం అల్లాడుతున్న గిరిజనుల త్రాగునీటి సమస్యను ఇప్పటికైనా తీర్చాలని కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వానికి మహిళా సాధికారత
### పదం పలికే అర్హత లేదు



**కాకినాడ రూరల్ , మార్చి 9(ప్రభాతవార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన ప్రజలను మోసం చేస్తూ 'డ్రామాలు' ఆడుతోందని , ఎన్నికల ముందు అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మహిళా సాధికారత అనే పదం పలికే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి తీవ్రస్థాయిలో విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సభపై ఆమె మండిపడ్డారు. ఎన్నికల ముందు 18 నుండి 59 ఏళ్ల లోపు ఉన్న కోటి 80 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 1,500 (ఏడాదికి రూ. 18,000) ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విదిల్చలేదని నాగమణి విమర్శించారు. మూడేళ్లు గడిచినా ఈ బాకీ ఎప్పుడు చెల్లిస్తారని ఆమె నిలదీశారు. అలాగే, 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలను నిలువునా వంచించారన్నారు. సూపర్ సిక్స్ లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చకుండా రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీశారని, ఈబిసీ నేస్తం పథకం అమలు చేయకుండా కాపుల్ని మభ్యపెట్టి కాపు నేస్తం పథకాన్ని అటకెక్కించారని, రాష్ట్రంలో దుశ్శాసనపర్వం నడుస్తుందని జమ్మలమడక ఆవేదన వ్యక్తం చేశారు.

## 5 గ్రామాల్లో 45 లీటర్ల సారాతో ఆరుగురు అరెస్టు..
### పాత కేసుల్లో ముగ్గురికి రిమాండ్. - ఐదుగురు ముద్దాయిలు తహసీల్దారు ముందు హాజరు



**రాజవొమ్మంగి, మార్చి 09, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో సారా నిర్మూలనలో భాగంగా విస్తృతంగా దాడులను చేసి ఐదు గ్రామాల్లో ఆరుగురు వ్యక్తుల నుండి 45 లీటర్ల నాటుసారాతో పట్టుకొని కేసు నమోదు చేసామని రంపచోడవరం ఎక్సైజ్ సి. ఐ శ్రీధర్ అన్నారు. గత 10 రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమాలను ఆయన వెల్లడించారు. వట్టిగడ్డ గ్రామంలో ఐదు లీటర్ల నాటుసారాతో ఒక మహిళ, రేవటిపాలెం గ్రామంలో 5 లీటర్ల సారాతో ఒక వ్యక్తి, దోనేలపాలెం గ్రామంలో ఐదు లీటర్ల నాటు సారాతో ఇంకొక ముద్దాయిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనకాపల్లి వారి సిబ్బంది జరిపిన దాడులలో లాగరాయి గ్రామంలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తి, రాజవొమ్మంగి గ్రామంలో 10 లీటర్లు సారాతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు. పాత కేసులలో అరెస్టు కాకుండా ముద్దాయిలుగా ఉన్న మారేడుబాక , రేవటిపాలెం, అమీనాబాద్ గ్రామాలతో కలిపి ముగ్గురిని అదుపులోనికి తీసుకొని రిమాండ్ కు సోమవారం పంపించామన్నారు. మరో ఐదుగురు ముద్దాయిలను రాజవొమ్మంగి తహసిల్దార్ వారి ఎదుట బైండోవర్ నిమిత్తం ప్రవేశపెట్టామన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి - ఎంపిడిఓకు పిర్యాదు



**శంఖవరం మార్చి 9 ప్రభాతవార్త** మండల కేంద్రమైన శంఖవరం లో ప్రజలు తాగునీటికి అల్లల్లాడుచున్నారు. ప్రతీ ఏడాది ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమ వలన ప్రజలకు తాగునీటి కష్టాలు చూపిస్తున్నారు. దీనిపై శంఖవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మేకల కృష్ణ, బొమ్మిడి చిట్టిబాబు స్థానిక ఎంపిడిఓ కిశోర్ కు సోమవారం పిర్యాదు చేసారు. వివరాలలోకి వెళ్తే... మండల కేంద్రం శంఖవరంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల వాటర్ ట్యాంక్ నుండి సిబ్బంది వీధి, కృష్ణాలయం వీధి, మధ్యవీధి ప్రజలకు ప్రతీ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో మోటార్లు రిపేర్లు అని, ఎండల వల్ల టాంకులకు నీరు అందడం లేదనే నెపంతో వారం నుండి పది రోజుల పాటు తాగునీరు అందించడం లేదని కృష్ణ ఆరోపించారు. ఇప్పటికే శంఖవరం గ్రామంలో గడిచిన పది రోజులుగా తాగునీరు లేక పైన పేర్కొన్న మూడు వీధుల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేదని, సంబంధిత ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు గ్రామంలో ప్రజల తాగునీటి కష్టాలు పట్టించుకున్న దాఖలాలు కనపడలేదని కృష్ణ, చిట్టిబాబు ఎంపిడిఓకు పిర్యాదు చేసారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, శంఖవరం ప్రజల తాగునీటి కష్టాలను గుర్తించి, తక్షణమే పనులు చేపట్టి, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కృష్ణ కోరారు.

## 65 మంది గర్భిణీలకు అల్పాహారం పంపిణీ



**రాజవొమ్మంగి, మార్చి 08, ప్రభాతవార్త** జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా పి. హెచ్. సి వైద్యాధికారులు డా. నాగార్జున, డా. పావని లు సంయుక్తంగా 65 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలను చేసి మందులను ఇచ్చారు. స్కానింగ్, ఎత్తు, బరువు, హెచ్. బి., బి. పి. అన్ని రకాల పరీక్షలను చేసారు. గర్భిణీలకు జాతీయ మానవ హక్కుల సంఘ మండల అధ్యక్షురాలు లింగేటి గౌరీశివలక్ష్మి, సభ్యులు కుంజం జగన్నాధస్వామి లు పండ్లు, త్రాగునీరు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్న రీత్యా రోజూ మూడు లీటర్ల నీటిని తీసుకోవాలని డా. పావని అవగాహనను కల్పించారు. ఈకార్యక్రమంలో డా. పావని, డా. నాగార్జున, జాతీయ మానవ హక్కుల సంస్థ లింగేటి గౌరీ శివలక్ష్మి, కుంజం జగన్నాదస్వామి, సురేష్, అరవింద్ కుమార్, మణికంత, యం. పి. హెచ్. ఇ. ఓ గొడుగు నాగవాసు, హెచ్. వి లు భూముల వెంకటరమణ, నీలాద్రి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ కంచెం శ్యామ్యూల్, యం. ఎల్. హెచ్. పి లు, ఏ. ఎన్. యం లు, అంగన్వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ లకు అభినందనల వెల్లువ



**కొత్తపేట,మార్చి 9,(ప్రభాతవార్త)** కొత్తపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన పల్లి మంగాదేవి వైస్ చైర్మన్ గా నియమితులైన కంఠం శెట్టి శ్రీనివాసరావులను మర్యాదపూర్వకంగా మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆఫీసు సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు ఇరువురిని వారి వారి స్వగృహాలకు వెళ్లి ప్రత్యేకంగా కలిశారు అదేవిధంగా పలివెల గ్రామ టిడిపి నాయకులు గౌడ సంఘ నాయకులు అత్తిలి వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలియజేశారు వీరికి సాలువ కప్పి సత్కారం చేశారు

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "మహిళా దినోత్సవ వేడుకలు



**గండేపల్లి మార్చి 9 (ప్రభాతవార్త):** "అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని" పురస్కరించుకుని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టి.సి.ఎస్ క్యాంపస్ లీడ్ టెక్నికల్ ఐ.టి స్పెషలైజ్డ్ హైరింగ్ పరుచూరి రాజశ్రీ ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా ఉండే మహిళలకు తమ కళాశాల మహిళా సిబ్బందికి తన హృదయపూర్వక శుభాభివందనలు తెలిపారు.ఈ సందర్భంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనపరచిన విద్యార్థినులను ప్రశంసించారు. ముఖ్య అథిది రాజశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ సమాజంలో మహిళా శక్తి అన్ని రంగాలలో విస్తరించి ప్రపంచ పురోగతిలో కీలకపాత్ర వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆత్మ విశ్వాసం ఆత్మ గౌరవం తో వారి నైపుణ్యాలను మెరుగుపరచుకుని ఉన్నత విద్య ఉద్యోగావకాశాలు వంటి వాటిలో ముందంజ వేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎం.వి.హరనాధ్ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరక్టర్–అకడమిక్స్ డాక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వై.జయబాబు, డీన్–సి.డి.సి. డాక్టర్ ఎం. రాధికామణి, ఉమెన్ ఎంపవర్మెంట్ గ్రీవెన్స్ సెల్ సభ్యులు, వివిధ విభాగాధిపతులు, కళాశాల మహిళా ఉద్యోగినులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు
## పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి



**అయినవిల్లి మార్చి 9 ప్రభాతవార్త** ప్రస్తుతం జరుగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు అక్కడ నిర్వహిస్తున్న పరీక్షలు పనితీరుపై జిల్లా విద్యాశాఖ అధికారి పి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు అయినవిల్లి మండలంలో సిరిపల్లి నేదునూరు కే జగన్నాధపురం వీరవెల్లి పాలెం కొండకుదురు గ్రామాల్లో ఐదు పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు సిరిపల్లి నేదునూరు కే జగన్నాధపురం కేంద్రాలను ఆయన పరిశీలించారు 10వ తరగతి మండలంలో 520 మంది ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు 84 మంది ప్రైవేటు విద్యార్థులు మొత్తం 604 మంది పరీక్షలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు విద్యార్థులతో ఆయన నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసావం తల్లి,బిడ్డకు శ్రేయస్కరం



**వి.ఆర్.పురం,మార్చి 9,ప్రభాతవార్త** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసావం తల్లి,బిడ్డకు సురక్షితంతోపాటు ఎంతో ఉపయోగమని, ఎంపిపి కారం.లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపిపి లక్ష్మి సోమవారం జీడిగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో డెలివరి అయిన ఎ.ఎన్.సి లకు బట్టలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్యసేవలు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, గర్భిణీలు తప్పక ఆసుపత్రుల్లోనే ప్రసవం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ కుమార్, స్టాఫ్ నర్సులు కె.చిరంజీవి, ఎన్ .వీరమ్మ, కె.భాగ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఎం.మార్కండేయులు, హెల్త్ అసిస్టెంట్లు పి.రామారావు, ఎ.ఎన్.ఎం ఆర్.బూబమ్మ, కె.రాజ్యలక్ష్మి, జి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

## షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి..
### కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వినోద్ కుమార్..



**అంబాజీపేట, మార్చి 9, (ప్రభాతవార్త):** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)అధ్యక్షురాలు వైయస్ షర్మిల అమలాపురంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర,రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు దొమ్మేటి వినోద్ కుమార్ కోరారు.అంబాజీపేటలో పార్టీ మండల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ పేదలు,నిరుపేదల ఉపాధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) ను కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పథకం పేరు మార్చి నిర్వీర్యం చేసిందన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ ఉపాధి హామీ పథకంను యధావిధిగా అమలుపరిచేందుకు, పరిరక్షించేందుకు పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి జిల్లాల పర్యటన చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బట్నవిల్లి వై జంక్షన్ హోండా కార్ షోరూం సమీపంలో ఈ నెల 10న (నేడు) నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రచ్చబండ కార్యక్రమంలో షర్మిలరెడ్డితో పాటు సిడబ్ల్యుసి మెంబర్ గిడుగు రుద్రరాజు,వర్కింగ్ ప్రెసిడెంట్ జెడి శీలం తదితరులు పాల్గొంటారని వినోద్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహన్రావు, కొల్లు సరోజిని,నెల్లి వెంకటరమణ, ఎండి ఇస్మాయిల్, ఆదుర్తి నారాయణమూర్తి, మహమ్మద్ హబీబ్ తదితరులు ఉన్నారు.

## 11న రాష్ట్ర ఎస్సీ సెల్ సమావేశం



**గోపాలపురం మార్చి 09, (ప్రభాతవార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 11వ తేదీన కాకినాడలో జరగనున్నదని తూ.గో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు గోపాలపురంలో విలేకరులకు తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఎస్సి సెల్ అధ్యక్షులు టిజేఆర్ సుధాకర్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు ఆధ్వర్యంలో కాకినాడ సూర్య కళామందిర్ నందు ఉ.8గం.ల నుంచి, సా.5గం.ల వరకు ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాలోని 7 నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుల్లు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, అధికార ప్రతినిధులందరు హాజరయ్యి విజయవంతం చెయ్యాలని వేణు కోరారు.

## బెస్ట్ సర్వీస్ అవార్డు పొందిన మహిళలకు సత్కారం



**కె.గంగవరం, మార్చి 09, (ప్రభాతవార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని విద్యాశాఖ అధికారి అందించిన బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్న సత్యవాడ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని కామేశ్వరి ని, ఎంఈఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న మణి ని పలు విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే గంగవరం మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయిని లకు చిరు సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళలు విద్య క్రీడా రంగాల్లో అందిస్తున్న సేవలను సేవలు అభినందనీయమమని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని పలువురు ప్రసంశించారు.ఈ కార్యక్రమానికి మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సురేష్, అధ్యక్షత వహించగా జిల్లా సైన్స్ అధికారి జి వి ఎస్ సుబ్రహ్మణ్యం, డివిజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగరాజు, పి డి లు మహిళా వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతులు
## ఎంపిపి జి. వెంకటలక్ష్మి



**రాజవొమ్మంగి, మార్చి 09, ప్రభాతవార్త** గ్రామాల్లో త్రాగునీటి చేతిపంపులు మరమ్మత్తులకు గురైతే వెంటనే మండల పరిషత్ కార్యాలయంకు వచ్చి పిర్యాదులు పుస్తకంలో నమోదు చేయించి ఎంపిడిఓ కు వినతిపత్రంను ఇవ్వాలని ఎంపిపి గోము వెంకటలక్ష్మి ప్రజలకు తెలియజేస్తున్నారు. సమస్యను స్థానిక ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చొరవతో క్రాస్ పోగ్రామ్ లో భాగంగా 2026..27 సం. బడ్జెట్ మొదటి విడత విడుదల అయ్యిందని అన్నారు. చేతిపంపులు మరమ్మత్తులు, ప్రేస్సింగ్ కోసం నిధులను వెచ్చించడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యక్రమ ప్రారంబాన్ని సోమవారం జెండా ఊపి ఎంపిపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆర్. డబ్ల్యూ. ఎస్. జె. ఈ సీతారాంనాయక్, సీనియర్ అసిస్టెంట్ పౌల్, సిబ్బంది లక్ష్మి, సురేష్, అనిత పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు సాధన చేయాలి
# జిల్లాఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం కలెక్టరేట్, మార్చి 09 (ప్రభాతవార్త)** మహిళలు తాము సాధికారతను సాధించాలంటే ఆ దిశలో నిరంతరం కృషి, సాధన అవసరం అని, మహిళా సాధికారత కు ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతీ మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు డి ఆర్ డి ఎ ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా ఎస్పీ జ్యోతిని ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నదని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతీ మహిళా ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నారు. ప్రతీ మహిళా రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన హక్కులను తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల ఆర్థికాభివృ ద్ధికి జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు 1,290 కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజి రుణాలుగా మంజూరు చేశామన్నారు చెప్పారు. ఏ రంగంలో చూసినా నేడు మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. విమానాలు నడపడం నుండి, సరిహద్దుల్లో దేశాన్ని కాపాడటం వరకు, పాలనలో నిర్ణయాలు తీసుకోవడం నుండి, శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుతాలు సృష్టించడం వరకు మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు ప్రసంగిస్తూ? జిల్లా యంత్రాంగంలో భాగంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళా ఉద్యోగుల పాత్ర, అలాగే గ్రామీణ స్థాయిలో స్వయం సహాయక సంఘాల మహిళల పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ కే డి వి ప్రసాద్ ప్రసంగిస్తూ సమాజంలో? కుటుంబాన్ని చక్కదిద్దడంలోనే కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధిలో కూడా మహిళల పాత్ర అమోఘమన్నారు అడ్మిన్ ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు ఆపద సమయంలో 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శాంత లక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర, ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ బి రాజేశ్వరి, సహాయ లేబర్ కమిషనర్ టీ నాగలక్ష్మి, ఐసిడిఎస్ పిడి నాగమణి డిఆర్డిఏ పి డి డి. రాంబాబు, సమగ్ర శిక్ష ఏపీసి జి మమ్మీ, మార్క్ ఫెడ్ సహాయ సంచాలకులు మంజుల, ఎల్ డి ఎం కేశవ్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

### విద్యా బాల మందిర్ లో మహిళా
## దినోత్సవ వేడుకలు



**కొత్తపేట, మార్చి 09,(ప్రభాతవార్త)** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు కరస్పాండెంట్ రామోజు అనురాధ మాట్లాడుతూ ఈనాటి సమాజంలో ప్రతి విషయంలో మహిళలు ముందున్నారు అని మహిళలు చైతన్యం వతంగా ఉంటే సమాజం బాగు పడుతుం దన్నారు ఈనాడు మహిళలు రాజకీయ ఆర్థిక వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధించారని తెలిపారు మహిళా ఉపాధ్యాయులను కరస్పాండెంట్ రామోజు అనురాధ విద్యార్థులు సన్మానించారు అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు కరస్పాండెంట్ ను షాలు దండ మోమెంటో తో సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రదాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు

మరిన్ని వార్తలు 6లో

# ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు..

## డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం



**ఆత్రేయపురం, మార్చి, 09,(ప్రభాత వార్త )** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఏడు శనివారాల నోము ఆచరించే భక్తులు రోజు రోజు కు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. సోమవారం ఆలయంలో క్యూ లైన్లు ఏర్పాట్లు,అలాగే వచ్చే వేసవి ని దృష్టి లో పెట్టుకొని చలువ పందిళ్ళు,క్యూ లైన్ లో భక్తులు సౌకర్యార్థం కూలర్స్, ఫ్యాన్ లు, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలే కాక వివిధ రాష్ట్రాలనుండి అధిక సంఖ్యలో వస్తున్న భక్తులను దృష్టిలో పెట్టుకొని అదనంగా క్యూ లైన్ లతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# సాదాసీదాగా సర్వసభ్య సమావేశం




**సీతానగరం, మార్చి 09, (ప్రభాతవార్త) :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం, ప్రజాప్రతినిధుల రాక కోసం సుమారు గంటన్నరకు పైగా ఎదురుచూడాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలకు ఆలస్యంగా సమావేశం ప్రారంభమైనా పలువురు అధికారులు వస్తూనే ఉండగా, మరికొందరు కీలక శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యకలాపాలను వివరించారు. అనంతరం గ్రామ సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్న నేపథ్యంలో పలువురు సర్పంచులను అధికారులు ఘనంగా సత్కరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన సీనియర్ అసిస్టెంట్ చింతా శివ గోపాల్‌ను సహోద్యోగులు, అధికారులు సన్మానించారు. అలాగే ఉన్నత చదువుల నిమిత్తం వెళ్తున్న పీహెచ్‌సీ డాక్టర్ ఏ.వీ.కే.చైతన్యను మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.భారతి, తహసిల్దార్ అంకం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సత్యం మదన్మోహన్, జడ్పీటీసీ చల్లమళ్ళ వెంకటలక్ష్మి, పలువురు ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

## స్వయంగా పర్యవేక్షిస్తున్న ఆలమూరు ఎంపీడీవో ఎ. రాజు

## పెనికేరు గ్రామంలో రూ.25 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం



**ఆలమూరు, మార్చి 9, (ప్రభాతవార్త)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం,ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.25 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పనులను ఆలమూరు మండల ఎంపీడీవో ఎ. రాజు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తూ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. రోడ్లు పూర్తయిన తర్వాత గ్రామంలో వర్షాకాలంలో ఎదురయ్యే బురద సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలవుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ఏ. రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి నిధులను సమర్థంగా వినియోగించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతతో పాటు సమయానికి పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.పెనికేరు గ్రామస్తులు కూడా గ్రామ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సంతోషం వ్యక్తం చేస్తూ, స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీడీవో ఎ. రాజు సేవలను అభినందించారు. గ్రామంలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ,సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# గర్భిణులకు అన్నదానం




**,పి గన్నవరం మర్చి 9 (ప్రభాత వార్త )** ప్రభుత్వ ఆసుపత్రి నందు వేణి ఫౌండేషన్ చైర్మన్. నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణి స్త్రీలకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని 200 మందికి పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి. గన్నవరం పి ఏ సీస్ అధ్యక్షులు సాధనాల సత్యనారాయణ,ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ కోట రాజేందర్,గుడాల సంపత్ రావు, ఆసుపత్రి సూపరడెంట్ డా..రాఘవేంద్ర రావు,గైనీకాలజస్ట్ డా..వందన, డెంటిస్ట్ కోటేశ్వరరావు, డా...పవన్ ,ఈ కార్యక్రమం ప్రారంభించారు. మరియు ట్రస్ట్ మెంబర్ తిక్కిరెడ్డి నిఖిల్,నల్లా పెద్దకాపు, నేలపూడి రామకృష్ణ, ఆకాశం బాబీ,, జగత ప్రసాద్, తోలేటి సాయి, కొర్లపాటి సూరిబాబు,

# బాలికలకు హెచ్పీవీ టీకా తప్పనిసరి




**అమలాపురం కలెక్టరేట్, మార్చి 09 (ప్రభాతవార్త)** మన ఆరోగ్యం -మన బాధ్యతని, హ్యూమన్ పాపిల్ లోమా వైరస్ అనేది మహిళల్లో ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే వైరస్ అన్నారు. ఈ ప్రమాదకరమైన వ్యాధిని నివారించడానికి ప్రభుత్వం హెచ్‌పీవీ వ్యాక్సి నేషన్ మిషన్ మోడ్ కార్యక్రమంను ప్రారంభించిందన్నారు 14 వీళ్లు దాటి 15 లోపు వయసు ఉన్న బాలికలకు ఈ టీకా ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చునన్నారు.తల్లిదండ్లులు తమ పిల్లలకు ఈ టీకా వేయించేందుకు ముందుకు రావాలనీ. సమీ పంలోని ఆరోగ్య కేంద్రం లేదా పాఠశాలల్లో నిర్వహించే టీకా శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కలెక్ట రేట్ నందు హెచ్పీవీ వ్యా క్సిన్ ప్రచార బ్యానర్ ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ 14 ఏళ్ల కుమార్తెలకు ఈ టీకా వేయించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించిందన్నారు. సర్వైకల్ క్యాన్సర్ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు హెచ్పీ వీ వ్యాక్సిన్ ఉద్దేశింపబడిందన్నారు. దీని కింద ఏటా బాలికలకు ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా టీకా లు వేస్తారన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం 3 నెలలపాటు కొనసాగుతుందనీ, ఈ ప్రక్రియ స్వచ్ఛందమైనదనీ, తల్లిదండ్రుల సమ్మతితో జిల్లాలో ఉన్న 10,989 మంది టార్గెట్ బాలికలకు వేయబడుతుందన్నారు. ప్రభుత్వ పి హెచ్ సి, సిహెచ్ సి మరియు జిల్లా ఆసుపత్రులలో 3 నెలల పాటు మిషన్ మోడ్‌లో వ్యాక్సిన్ వేస్తారన్నారు మహిళల ఆరోగ్యానికి, స్వస్థ నారి లక్ష్యానికి దోహదపడుతుందన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సి నేషన్ మిషన్ మోడ్ కార్యక్రమం గురించి ప్రజలకు సమగ్ర అవగాహనను పెంపొందిస్తూ టార్గెట్ బాలికలకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం దుర్గారావు దొర, డి సి హెచ్ ఎస్: కే కార్తీక్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## రూ.32.40 లక్షల సొత్తు స్వాధీనం

## సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా





**ఆలమూరు, మార్చి 9, (ప్రభాతవార్త)** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం,ఆలమూరు రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్ళను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల అంతరాష్ట్ర దొంగల ముఠాను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేసి భారీ ఎత్తున బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా (ఐపీఎస్) వివరాలు వెల్లడించారు. గత ఫిబ్రవరి 14న జత్తుక లక్ష్మీ పార్వతి అనే మహిళ ఫిర్యాదు మేరకు ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో కంచెర్ల జార్జ్ బెన్నీ (22), సన్నపు శ్రీ చరణ్ (20) ఇద్దరూ ఆలమూరు మండలం పెద్దపళ్ళ గ్రామానికి చెందినవారు కాగా, ఉండుర్తి ఆనంద్ కుమార్ (22) కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందినవాడు. నిందితుల వద్ద నుండి పోలీసులు 203.650 గ్రాముల బంగారం, 765 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోగా వాటి మొత్తం విలువ సుమారు రూ.32,40,000 ఉంటుందని అంచనా వేశారు. నిందితులలో ఒకరైన జార్జ్ బెన్నీపై గతంలో ఆలమూరు, రావులపాలెం పోలీస్ స్టేషన్లలో దొంగతనం మరియు గంజాయి కేసులు నమోదై ఉండగా, ఆనంద్ కుమార్‌పై కూడా గంజాయి కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించిన కొత్తపేట ాణూఉ సుంకర మురళీ మోహన్, రావులపాలెం రూరల్ జ× విద్యాసాగర్, అమలాపురం జజూ జ× గజేంద్ర కుమార్, ఆలమూరు ా× నరేష్ మరియు వారి బృందాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



**గోపాలపురం మార్చి 09, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలం, వాదాలకుంట గ్రామంలో ప్రాథమిక పాఠశాల-2 ఉపాధ్యాయులు 'బడిబాట' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. హెచ్ఎం ఇస్సాపురి కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నకూటి మణమ్మ, గోపాలపురం క్లస్టర్ చైర్మన్ వెంకట కనక పద్మలు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను గురించి వివరించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, సౌకర్యాల గురించి గ్రామస్తులకు, పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఐదేళ్లు నిండిన ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఉచితంగా యూనిఫామ్స్, పుస్తకాలు, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను అందజేయటం జరుగుతుందన్నారు. పోషక విలువలతో మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందరికీ అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని ఉద్దేశించి ఉచితంగా అందజేస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాదాలకుంట హై స్కూల్ హెచ్ఎం విజయ్ కుమార్, స్పెషల్ స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, టీచర్లు ఈశ్వరి, సత్య రమేష్, భవ్య శ్రీ, షఫీ, స్వాతి, సీఆర్పీ కొయ్య నాగరాజు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధులు చెక్కులు అందజేత



**ఆత్రేయపురం,మార్చి,09,(ప్రభాత వార్త)** ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణి కార్యక్రమం లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు చేతులు మీదుగా ఆత్రేయపురం మండలం వేలిచేరు గ్రామానికి చెందిన మానే స్వామి అవిడి వెంకటేశ్వరుల కీ పంపిణి చేశారు ఈ కార్యక్రమం లో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, జుజ్జువరపు శ్యామల, హరిబాబు, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, వెంకన్న, వెలిచేరు సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, కొప్పుల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.




# కాంప్లెక్స్ నిర్మించాలి

## ఆది వాసి వ్యాపారులకు కేటాయించాలి.

## ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ నరేష్



**చింతూరు మార్చి 10 ప్రభాత వార్త.** చింతూరు డివిజన్ పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డిని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి.నరేష్ కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు సొంతంగా పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి సరైన వెలుసుబాటులేక వారు పడుతున్న బాధలను ఆయనకు వివరించారు.చింతూరు పాత హాస్పిటల్ గోడను అనుకోని ఐ టీ డి ఏ ధ్వారా కాంప్లెక్స్ నిర్మించి ఆదివాసులకు కే టా ఇంచాలని కోరారు. చింతూరు మెయిన్ సెంటర్ లో ఆదివాసులు సొంతంగా పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి కనీస పరిస్థితులు లేక రోడ్డు పక్కన వలస వ్యాపారస్తులను బ్రతిమిలాడుకునే పరిస్థితి ఏర్పడిందని, ఈ ప్రాంత ఆదివాసులకు అటువంటి పరిస్థితి లేకుండా చింతూరు మెయిన్ సెంటర్ లో స్థిర వ్యాపార స్థావరాలను ఏర్పాటు కు ఐటీడీ ఏ ద్వారా మెయిన్ రోడ్ పక్కన ఉన్న పాత హాస్పిటల్ ప్రహరీని అనుకునీ ఉన్న షాప్స్ తొలగించి ఐటీడీ ఏ ద్వారా భావనలు నిర్మాణం చేసి స్థానిక ఆదివాసీలకు కే టా యించే విధంగా కృషి చేయలని రాష్ట్ర ఎస్టి కమిషన్ వారిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి.నరేష్ జెఎసి మండల చైర్మన్ పోడియం. రామకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# నలుగురు పేకాటరాయుళ్ళు అరెస్టు



**రాజవొమ్మంగి, మార్చి 09, ప్రభాతవార్త** లబ్బర్తి గ్రామ శివారున సోమవారం రాజవొమ్మంగి ఎస్. ఐ. శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది నలుగురు పేకాట రాయుళ్లను పట్టుకొన్నారు. అనలుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 5,500లు స్వాదీనం చేసుకొన్నట్లు ఎస్. ఐ వెల్లడించారు. పేకముక్కలను సీజ్ చేసామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు పనులు ప్రారంభం



**రాజవొమ్మంగి, మార్చి 09, ప్రభాతవార్త** రాజవొమ్మంగి సంత మార్కెట్ ప్రాంతంలో మార్కెట్ యార్డు అభివృద్ధిలో నాబార్డు, పంచాయితీ సంయుక్తంగా రూ. 20 లక్షలు వ్యయంతో 40 దుకాణాలు నిర్మాణానికి సోమవారం సర్పంచ్ గొల్లపూడి రమణి పూజలను పనులను ప్రారంబించారు. శాశ్వత రేకు షెడ్లను నిర్మించడం జరుగుతుందని సర్పంచ్ అన్నారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఏ. పి. ఐ. ఐ. సి డైరెక్టర్ పెద్దిరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు కూడా పూజలను చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గొల్లపూడి రమణి, గ్రామ స్వరాజ్య సమితి సెక్రటరీ బద్ది రాము, కో ఆర్డినేటర్ డి. వై. నాయుడు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, పెదిరెడ్ల సత్యనారాయణ, ముప్పన మోహన్, జెట్టి మధుశేఖర్, కోరువాడ బాబూరావు, యోహాన్, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ కమిటీల్లో సామాన్య కార్యకర్తలకు

## భాగస్వామ్యం : జక్కంపూడి రాజా



**సీతానగరం, మార్చి 09, (ప్రభాత వార్త) :** వైకాపా గ్రామ కమిటీల నిర్మాణంలో ప్రతి సామాన్య కార్యకర్తను భాగస్వామ్యం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రఘుదేవపురంలో పిండి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పార్టీ పట్ల విధేయత, క్రమశిక్షణతో పనిచేసే వారికే కమిటీల్లో సముచిత స్థానం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. గ్రామ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు అవకాశం ఇవ్వాలన్నారు. పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించే దిశగా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా శ్రీను, కో కన్వీనర్ కరుటూరి హరిబాబు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ సత్యం మదన్మోహన్, పిచ్చుకుల విజయ్,చల్లమళ్ళ సుజీరాజు, పెందుర్తి దేవదాసు, పైడి రాజు, ముదునూరి రామకృష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps